thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 42 కరీంనగర్ బుధవారం, 23 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇక ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాల విడుదల

ముంబై : కేంద్ర ప్రభుత్వం ఇక నుంచి ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాలను వెల్లడించనుంది. వచ్చే మే 15 నుంచి నెలవారీ ప్రాతిపదికన ఈ గణాంకాలను విడుదల చేయనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇంతకు ముందు మూడు నెలలకు ఒకసారి నిరుద్యోగ గణాంకాలను విడుదల చేసేవారు. మే 15న విడుదల చేసే గణాంకాల్లో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వివరాలు ఉంటాయి.
ఆ తర్వాత ప్రతి నెలా గణాంకాలను విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు మూడు నెలలకు ఒకసారి పట్టణ నిరుద్యోగ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తోంది. గ్రామీణ, పట్టణ నిరుద్యోగానికి సంబంధించిన డేటాను వార్షికంగా వెలువరిస్తోంది.




# కమల దళంలో అంతర్మథనం..

# మోదీ వారసుని కోసం వేట!

## మళ్ళీ ఉప ప్రధాని పదవికై ఆర్ఎస్ఎస్ పట్టు!!

## కొత్త శకానికి శ్రీకారం చుడతారా!?

భారతీయ జనతా పార్టీలో ఏమి జరుగుతోంది? జాతీయ అధ్యక్షుని ఎన్నికలో ఎందుకు ఇంత జాప్యం జరుగుతోంది? తెలంగాణ సహా అనేక ఇతర రాష్ట్రల్లో రాష్ట్ర అధ్యక్షుల ఎన్నిక ఎందుకు ముడిపడడం లేదు? అందుకు పార్టీ నేతలు చెపుతున్న కారణాలేనా లేక ఇంకా లోతైన కారణాలు ఏమైనా ఉన్నాయా? అంటే, కమల దళంలో జరుగతున్న పరిణామాల వెనక లోతైన కారణాలే ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారంగా తెలుస్తోంది. నిజానికి పైకి కనిపిస్తున్నదానికి లోపల జరుగతున్న పరిణామాలకు పొంతనలేదని అంటున్నారు. అవును ఢిల్లీలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే.. భవిష్యత్ లక్ష్యాలు, భవిష్యత్ వ్యూహాలు ఆధారంగా ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో అనివార్యంగా చేపట్టవలసిన పెను మార్పులపై లోతైన చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పైకి అంతా బాగుందన్నట్లు కనిపిస్తున్నా, అంతర్గతంగా అనేక అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, అందుకే ఒకదానితో ఒకటి ముడి పడిన కీలక నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని అంటున్నారు. ఇటీవల అటు ఢిల్లీలో ఇటు నాగాపూర్ లో అగ్రనేతల వరస సమావేశాలు కేవలం పార్టీ అధ్యక్షుని ఎన్నికకు పరిమతం కాదని.. అంతకు మించిన అంతర్మథనం జరుగుతోందని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాగపూర్ పర్యటన (మార్చి30) తర్వాత, చోటు చేసుకుంటున్న పరిణామాలు బీజేపీలో ఏదో జరుగుతోందనే అనుమానాలకు మరింత బలం చేకూర్చే విధంగా ఉన్నాయని, అంటున్నారు. అలాగే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంబంధాల విషయంలోనూ పునఃసమీక్ష జరుగుతోందని విశ్వసనీయంగా తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ వందేళ్ళ పండగను పురస్కరించుకుని, సంఘ్ పరివార్ ఎజెండాలో మిగిలి ఉన్న అంశాలపై మరింత దృష్టి పెట్టాలని ఆర్ఎస్ఎస్ బావిస్తోందని అంటున్నారు .అందులో భాగంగా పార్టీ పైన, ప్రభుత్వం పైన కూడా నాగపూర్ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండేలా, ఢిల్లీ పై నాగపూర్ పట్టు బిగిస్తోందని అంటున్నారు. మళ్ళీ ఉప ప్రధాని? ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఇటు బీజేపీలో, అటు ప్రభుత్వంలో భారీ మార్పులు ఉంటాయని, అంటున్నారు. ఇందులో భాగంగా, గతంలో అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వంలో ఉన్న ఉప ప్రధాని పదవిని పునరుద్దరించే ఆలోచన ఉందని అంటున్నారు. వాజ్ పేయి ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న అద్వానీకి 2002లో ఆర్ఎస్ఎస్ ఆలోచన మేరకే పదోన్నతి లభించిందనీ, ఇప్పుడు కూడా, ఆర్ఎస్ఎస్ ఆలోచన మేరకే మళ్ళీ ఉప ప్రధాని పదవిని పునరుద్దరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. అప్పటిలాగా ఇప్పుడు కూడా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు పదోన్నతి లభిస్తుందా? ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్, నాగపూర్ ఎంపీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలలో ఒకరిని అదృష్టం వరిస్తుందా? అన్నది తెలియాల్సి ఉందంటున్నారు. నిజానికి, ప్రస్తుతం బీజేపీ ముందున్న ప్రధాన సమస్య, ప్రధాన చిక్కు ముడి ఇదే అంటున్నారు. ఈ రోజు ఉప ప్రధాని రేపటి ప్రధాని? అవును. 2002లో ఉప ప్రధానిగా పదవిని చేపట్టిన అద్వానీ, 2004 ఎన్నికలలో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. అటల్జీ ప్రధానిగా ఉన్న సమయంలోనే అద్వానీని బీజేపీ, ఎన్డీఎ కూటమి ప్రధాని అభ్యర్థిగా ప్రకటించింది. సరే.. ఆ ఎన్నికల్లో బీజేపీ సారధ్యంలోని ఎన్డీఎ బండి తిరగబడింది. కాంగ్రెస్ సారథ్యంలోని యుపీఎ అధికారంలోకి వచ్చింది. అద్వానీ, ఐదేళ్ళు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. తిరిగి 2009 లోనూ ఆయనే ప్రధాని అభ్యర్థిగా బీజేపీ బరిలో దిగింది. అయితే మళ్ళీ అదే ఫలితం ఎదురైంది. అద్వానీ మరోసారి బస్సు మిస్సయ్యారు. అది వేరే విషయం. అదలా ఉంచితే, ఇప్పుడు మళ్ళీ అదే ఆనవాయితీ కొనసాగితే, ఈ రోజు ఉప ప్రధాని ఎవరైతే వారే రేపటి (2029) ప్రధాని అభ్యర్ధి అవుతారు. అందుకే. పార్టీలో ఇంతటి అంతర్మథనం సాగుతోందని, పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అలాగే, ఆర్ఎస్ఎస్ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే, మోదీ సహా చాలా మంది సీనియర్లు తెరమరుగు అవుతారని, కొత్త తరం తెరపైకి వస్తుందనీ, కమల దళంలో కొత్త శకానికి శ్రీకారం చుడుతుందని అంటున్నారు.



## తెలంగాణలో఼ దారెత్తిస్తున్న ఎండలు

హైదరాబాద్: తెలంగాణలో ఎండల తీవ్రత పెరిగింది. రాగల నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో గరిష్ఠంగా 44 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వడగాల్పుల తీవ్రత కారణంగా మధ్యాహ్నం వేళ ప్రజలు బయటకు రావొద్దని సూచించింది. మంగళవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# గ్రేటర్ హైదరాబాద్ లో బీజేపీ సరికొత్త గేమ్ ప్లాన్ మొదలుపెట్టిందా..?

**గ్రేటర్ హైదరాబాద్‌లో బీజేపీ సరికొత్త గేమ్ మొదలుపెట్టిందా? పొలిటికల్‌గా ప్రత్యర్థులను బోనులో నిలబెట్టేందుకు పక్కా స్కెచ్ వేస్తోందా? అందుకే సరిపడా బలం లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో నిలిచిందా? ఇంతకీ కమలం ప్లాన్ ఏంటి? ఎవర్ని ఎలా ఇరికించాలనుకుంటోంది?**

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక పేరుతో సరికొత్త రాజకీయానికి తెర లేస్తోందంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ టార్గెట్‌గా బీజేపీ సరికొత్త స్కెచ్ వేస్తున్నట్టు కనిపిస్తోందన్న చర్చ మొదలైంది రాజకీయవర్గాల్లో. ఈ ఎన్నిక ఫలితాలతో తనను తాను టెస్ట్ చేసుకోవడం తోపాటు.. ప్రత్యర్థుల్ని దోషులుగా నిలబెట్టే ప్లాన్ ఉందని, అందుకే బలం లేకున్నా బరిలో నిలబడ్డట్టు కనిపిస్తోందంటున్నారు. ఈ ఎన్నికలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లే ప్రధాన ఓటర్లు. ఆ పరంగా చూసుకుంటే బీజేపీకి సరిపడా బలం లేదు. కానీ... ఎంఐఎంకు మాత్రం ఎమ్మెల్సీని గెలిపించుకునేంత బలం ఉంది. అయినాసరే... ఎన్నికను ఆషామాషీగా తీసుకోవడం లేదట కాషాయ దళం. గెలిచే అవకాశం లేకున్నాసరే... హడావిడి విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదట. ఆత్మప్రభోదానుసారం ఓటేయాలని ఇతర పార్టీల కార్పొరేటర్స్ విజ్ఞప్తి చేయడం ద్వారా సరికొత్త పొలిటికల్ డ్రామాకు తెరలేపిందంటున్నారు విశ్లేషకులు. అదే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఏకకాలంలో టార్గెట్ చేస్తోంది కమలం. ఆ రెండు




పార్టీలు మజ్లిస్ మోచేతి నీళ్ళు తాగుతున్నాయని ఆరోపిస్తోంది. డిపాజిట్ రాదని, ఓడిపోతామని తెలిసి కూడా గతంలో వివిధ ఎన్నికల్లో వాళ్ళు పోటీ చేయలేదా? ఇప్పుడు మాత్రం ఎందుకు చేయడం లేదో రాహుల్ గాంధీ, కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేస్తోంది బీజేపీ. ఈ స్టేట్‌మెంట్స్‌ని చూస్తుంటే.... బలం లేకున్నాసరే... ఏదో పోటీ చేయాలి కాబట్టి చేస్తున్నట్టుగా లేదని, దీన్ని బేస్ చేసుకుని కమలనాథులు పెద్ద స్కెచ్చే వేసినట్టు కనిపిస్తోందని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. అయితే, దీన్ని భవిష్యత్ అవసరాల కోసం వాడుకోవాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఇప్పటికే హైదరాబాద్‌ను మజ్లిస్‌కు రాసిచ్చేయాని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తోంది బీజేపీ. ఆ రెండు పార్టీలు కలిసి రేపు ముఖ్యమంత్రి పదవిని కూడా ఎంఐఎంకే కట్టబెట్టినా ఆశ్చర్యం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు కాషాయ లీడర్స్. దాని ద్వారా... ఆ మూడు పార్టీలు ఒక్కటేనన్న భావన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారట. ఈ ప్రచారాన్ని ఉధృతం చేయడం ద్వారా.. భవిష్యత్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే... అది ఖచ్చితంగా మజ్లిస్ పార్టీకి వేసినట్టేనన్న ఫీలింగ్ తీసువచ్చే ప్లాన్ ఉందట. జనంలో ఆ అభిప్రాయం బలపడకున్నా.. కనీస చర్చ జరిగినా సరే... అది తమకు రాజకీయంగా ఎంతోకొంత ఉపయోగపడుతుందన్నది బీజేపీ నాయకుల ఆలోచనగా చెప్పుకుంటున్నారు. అటు ఆ పార్టీలని టార్గెట్ చేస్తూనే... ఇటు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లయిన ఆయా పార్టీల కార్పొరేటర్స్‌తో మైండ్ గేమ్ మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. మీరు మళ్ళీ కార్పొరేటర్‌గా గెలవాలంటే... ఇప్పుడు మీరున్న పార్టీల వల్ల కాదని, ఈసారి జీహెచ్ఎంసీ మాదేనని, ఇప్పుడు మేం చెప్పినట్టు విని బీజేపీ అభ్యర్థికి ఓటేస్తే... భవిష్యత్‌లో పార్టీ టిక్కెట్ మీకేనని చెబుతున్నారట బీజేపీ లీడర్స్ కొందరు. ఈ ప్రచారంతో ఆ రెండు పార్టీలకు చెందిన కొందరు కార్పొరేటర్స్ టర్న్ అయినా.. తమకు ఓటింగ్ పెరుగుతుందని భావిస్తున్నారట బీజేపీ ముఖ్యులు. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికలో మజ్లిస్ పార్టీ గనక గెలిస్తే... కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే గెలిపించాయని, వాళ్ళంతా ఒక్కటేనంటూ బోనులో నిలబెట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. బీజేపీ గేమ్ ప్లాన్ ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలంటున్నారు పొలిటికల్ పరిశీలకులు.

# అడవిలో అన్నలకు కౌంట్ డౌన్..

## భద్రతా బలగాల అష్ట దిగ్బంధనంలో కర్రెగుట్ట

### దండకారణ్యం చుట్టుముట్టిన పోలీసులుఅడవిలోకి

### మూడు రాష్ట్రాల నుంచి వేలాది మంది పోలీసులు



## హై టెన్షన్

వాజేడు : దండకారణ్యంలో తుపాకీల మోతతో అడవిలో అలజడి ప్రారంభమైంది. ఒక వైపు పోలీసులు, మరోవైపు భద్రతా దళాలు అడవిని చుట్టుముట్టాయి. మావోయిస్టుల కంచుకోట కర్రెగుట్ట స్వాధీనం చేసుకోవడానికి పోలీసులు, భద్రతా దళాలు దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో దండకారణ్యం చుట్టు ఉన్న గ్రామాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే భద్రతా దళాలకు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మరికొందరు మావోయిస్టులు కర్రెగుట వైపు పారిపోయారని భద్రతా దళాలు, పోలీసులు భావించారు.

**కర్రెగుట్ట లక్ష్యంగా పోలీసు బలగాలు...** ములుగు జిల్లా కర్రెగుట్ట లక్ష్యంగా పోలీసులు అడవిలోకి ప్రవేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు ముప్పేట దాడులు చేయడం, వరుస ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలకొరగడంతో మావోయిస్టుల కంచుకోట కర్రెగుట్టకు చేరుతున్నారు. అక్కడే కీలకనాయకులు ఆవాసం ఏర్పర్చుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులను టార్గెట్ చేస్తూ బాంబులు అమర్చినట్లు, అటువైపు గిరిజనులు ఎవరూ రాకూడదని మావోయిస్టులు ఒక లేఖ విడుదల చేశారు. దీంతో పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా ఆపరేషన్‌కు సిద్ధపడ్డారు.

**దండకారణ్యంలోకి వేలాది మంది పోలీసులు...** దండకారణ్యంలోకి సోమవారం సాయంత్రం వేలాది మంది పోలీసులు ప్రవేశించారు. తెలంగాణ నుంచి నాలుగు వేల మంది పోలీసు బలగాలు, భద్రతా దళాలు సోమవారం అడవిలోకి బయలుదేరి వెళ్లాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ చింతూరు తదితర ప్రాంతాల నుంచి రెండు వేల మంది పోలీసులు, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా జిల్లాల నుంచి ఎనిమిది వేల మంది పోలీసు, భద్రతా బలగాలు అడవుల్లోకి వెళ్లినట్లు తెలిసింది. అంతకు ముందు ఆదివారం హెలీకాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు.

**బచావో కర్రెగుట్ట పేరుతో ఆపరేషన్..** ములుగు జిల్లాలోని కర్రెగుట్టలను భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కర్రెగుట్టలు విస్తరించి ఉన్నాయి. కర్రెగుట్టల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆపరేషన్ చేపట్టారు. బచావో కర్రెగుట్టలు పేరుతో ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఇటు తెలంగాణ వైపు నుంచి కర్రెగుట్టలను సీఆర్పీఎఫ్ బలగాలు చుట్టుముట్టాయి.

**కొనసాగుతున్న ఎన్‌కౌంటర్...** ఊసూర్ బ్లాక్‌లోని కర్రెగుట్టల సమీపంలో మంగళవారం ఉదయం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

**కాల్పులు ఆపండి: హరగోపాల్...** కర్రెగుట్టలకు సంబంధించి పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఓ వీడియోను విడుదల చేశారు. తమకున్న సమాచారం మేరకు భద్రతాబలగాల వైపు నుంచి కాల్పులు జరుగుతున్నాయని, ఇప్పటికే వేలాది మంది భద్రతా బలగాలు కర్రెగుట్టల చుట్టూ మోహరించారని, వెంటనే కాల్పులు ఆపాలని డిమాండ్ చేశారు. ఓ వైపు శాంతి చర్చల ప్రతిపాదన తెస్తూనే ఇటువంటి హత్యకాండకు ప్రభుత్వాలు తెగబడటం దుర్మార్గమన్నారు. ఈ ముసుగులో సాధారణ ప్రజానీకం మరణించవచ్చని తెలిపారు. వెంటనే సాయుధ చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ముందుగా శాంతి చర్చల అడుగులు పడాలని, ఆ ప్రతిపాదన మావోయిస్టుల నుంచి కూడా వచ్చిందని తెలిపారు. శాంతి చర్చలకు అడుగులు పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో భద్రతా బలగాలను ఉసిగొల్పి మావోయిస్టులను పూర్తిస్థాయిలో అంతమొందించాలని చూడటంతో ఒక దుర్మార్గమైన చర్య అంటూ హరగోపాల్ అభిప్రాయపడ్డారు.




## యూపీఎస్సీ సివిల్స్ తుది ఫలితాలు వచ్చేశాయ్.. టాప్-10 ర్యాంకర్లు వీరే..

దిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ – 2024 తుది ఫలితాలు వచ్చేశాయి. ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సత్తా చాటిన విద్యార్థుల్లో ఇ.సాయి శివానికి 11వ ర్యాంకుతో మెరవగా.. బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119వ ర్యాంకులతో అదరగొట్టారు. **టాప్ 10 ర్యాంకర్లు వీరే..** శక్తి దుబే, హర్షిత గోయెల్, డోంగ్రే అర్చిత్ పరాగ్, షా మార్గి చిరాగ్, ఆకాశ్ గార్గ్, కోమల్ పూనియా ఆయుషి బన్సల్, రాజ్‌కృష్ణ ఝా, ఆదిత్య విక్రమ్ అగర్వాల్, మయాంక్ త్రిపాఠి. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో మొత్తం 1056 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన యూపీఎస్సీ.. ఇందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. మెయిన్స్‌లో సత్తా చాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది.

ఈ ఫలితాల్లో 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా.. జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి109, ఓబీసీ నుంచి 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీ నుంచి 87మంది చొప్పున ఉన్నారు.




యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్‌దార్ద్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కావని పేర్కొంది. కొన్ని రోజుల క్రితం హమ్‌దార్ద్ షర్బత్ గురించి రామ్‌దేవ్ బాబా పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు. దానిని కొనుగోలు చేయడం వల్ల వచ్చే లాభాలను కంపెనీ వేరొక వర్గానికి చెందిన నిర్మాణాలు చేపట్టేందుకు ఉపయోగిస్తోందన్నారు. "అదే ఈ షర్బత్ (పతంజలి సంస్థకు చెందిన పానీయం) తాగితే.. గురుకులాలను నిర్మించవచ్చు. పతంజలి విశ్వవిద్యాలయాన్ని విస్తరించవచ్చు" అంటూ రామ్‌దేవ్ మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియో వివాదాస్పదమైంది. ఈ క్రమంలో హమ్‌దార్ద్ కంపెనీ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వెంటనే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. హమ్‌దార్ద్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఇది ఆ సంస్థ ఉత్పత్తిని అగౌరవపరచడం కంటే తీవ్రమైందని, అవి ద్వేషపూరిత వ్యాఖ్యల కిందికే వస్తాయని వాదించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. "ఈ వ్యాఖ్యలు కోర్టు అంతరాత్మను షాక్‌కు గురిచేశాయి. ఇలాంటి వ్యాఖ్యలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు" అని తీవ్రంగా స్పందించింది. గతంలో తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యవహారంలో పతంజలి ఆయుర్వేద్ సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటనల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కూడా జరిగింది. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని వారు కోర్టుకు విన్నవించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.




హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు చిత్రాలను మాత్రమే కాదు.. ఉర్దూ చిత్రాలనూ ప్రోత్సహిస్తామని తెలిపారు. గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ గుండె చప్పుడును తన పాటల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ గద్దర్ బాణి, పాటలను అనుకరిస్తారు. గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆయన పేరు మీద అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయం. హైదరాబాద్‌లో జరిగే చలన చిత్ర అవార్డులు ఘనంగా నిర్వహించాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తాం" అని అన్నారు. జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. హెచ్ఐసీసీ వేదిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. జ్యూరీ కమిటీకి ఛైర్మన్‌గా నటి జయసుధను ఎంపిక చేశారు. అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు ఇటీవల వెల్లడించారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ప్రస్తుతం జ్యూరీ సభ్యులు పరిశీలిస్తున్నారు.




కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) దారుణ హత్య కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనలో ప్రధాన నిందితురాలిగా ఉన్న మృతుడి భార్య పల్లవి కదలికలపై పోలీసులు ఆరాతీశారు. ఈక్రమంలో గుర్తించిన కొన్ని కీలక విషయాలను సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనకు ముందు ఐదు రోజులు గూగుల్‌లో హత్య గురించిన వివరాలను పల్లవి శోధించారు. ఎక్కడ నరాలు తెగితే మనిషి త్వరగా చనిపోతాడో ఆమె తెలుసుకున్నారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఓం ప్రకాశ్‌ను ఆయన భార్య పల్లవి, కుమార్తె కృతి పథకం ప్రకారం కడతేర్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. తానే హత్య చేసినట్లు పల్లవి పోలీసుల విచారణలో అంగీకరించారు. దీంతో ఆమెను అరెస్టు చేశారు. హత్యలో కృతి పాత్రపై లోతుగా విచారిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మానసిక స్థితిని కూడా వైద్యులు పరిశీలిస్తున్నారు. ఈ దారుణ ఘటనపై ఓం ప్రకాశ్ కుమారుడు కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

**కళ్లలో కారం చల్లి.. కత్తులు దూసి...** ప్రస్తుతం పల్లవిని కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. ఇక దర్యాప్తులో భాగంగా పోలీసులు సోమవారం సాయంత్రం ఆమెను ఘటనాస్థలానికి తీసుకెళ్లి ప్రశ్నించారు. హత్యకు ముందు నిందితురాలు వాట్సప్ గ్రూప్స్‌లో పలు సందేశాలు ఉంచారని తెలుస్తోంది.
సొంత ఇంట్లోనే తనను బంధించారని, నిరంతర నిఘాలో ఉన్నానని ఆమె పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన కుమార్తె భద్రతపై ఆందోళన వ్యక్తంచేసినట్లు సమాచారం. ఈ హత్యకు ఓం ప్రకాశ్ భార్య మానసిక స్థితి ఎంత కారణమో.. ఆస్తి గొడవలూ అంతే కారణమని భావిస్తున్నారు. ఓం ప్రకాశ్ భార్య, కుమార్తె వద్ద కంటే కుమారుడు, చెల్లితో ఉండేందుకే ఇష్టపడేవారు. ఉత్తరకన్నడ జిల్లా దండేలి వద్ద ఉన్న 17 ఎకరాల భూమిని కుమారుడు, చెల్లికి రాసేందుకు సిద్ధమయ్యారు. దీంతో భార్య, కుమార్తెలు ఓం ప్రకాశ్‌తో నిత్యం గొడవ పడుతూ చివరకు ప్రాణాలు తీసే స్థితికి చేరారని అనుమానిస్తున్నారు.




## తెలంగాణ ఇంటర్ ఫలితాలు.. బాలికలదే పైచేయి

హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం 65.96 శాతం, ద్వితీయ సంవత్సరం 65.65 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

మొత్తం 9.97లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో 73.08 శాతం, ద్వితీయ సంవత్సరంలో 77.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో బాలురు 59.74 శాతం, సెకండియర్‌లో 64.60 శాతం మంది పాసయ్యారు.

ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లా 77.21 శాతంతో మొదటి స్థానంలో.. 48.43 శాతంతో మహబూబాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో ములుగు జిల్లా 80.12 శాతంతో టాప్‌లో ఉండగా.. కామారెడ్డి జిల్లా 54.93శాతంతో చివరి స్థానంలో నిలిచింది.




## అమెజాన్, వాల్‌మార్ట్ కోసం భారత్‌పై అమెరికా ఒత్తిడి..!

దేశీయంగా దాదాపు 125 బిలియన్ డాలర్ల ఈకామర్స్ మార్కెట్లో తమ సంస్థల పట్టు పెంచేందుకు భారత్ పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. న్యూదిల్లీపై దాదాపు 26శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ చర్చలో ఈకామర్స్ అంశం కూడా వచ్చింది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం కోసం విస్తృతస్థాయిలో జరుగుతున్న సదస్సుల్లో ఈకామర్స్ రంగంలోని అన్ని సంస్థలకు సమాన అవకాశాలు, పరిస్థితులు కల్పించే అంశంపై చర్చ జరిగింది. తాజాగా భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ చర్చలపై స్పందిస్తూ.."ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడేలా చెప్పుకోదగ్గ పురోగతి సాధించాం. ఇంధన, రక్షణ, వ్యూహాత్మక టెక్నాలజీల రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకొంటాం" అని పేర్కొన్నారు.

**మాకు నష్టం కలిగించారో.. ఖబడ్దార్...** వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ కొన్నాళ్ల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా భారత్‌లో ఈ కామర్స్ కంపెనీలకు ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యం వాల్‌మార్ట్ చేతిలో ఉన్న విషయం తెలిసిందే. భారత్‌లో ప్రైస్ ఓపెన్ విధానం అమలుచేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతోపాటు.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దేశీయ రిటైల్ దిగ్గజమైన రిలయన్స్‌తో పోటీపడాలని బలంగా భావిస్తున్నారు. భారత్‌లో విదేశీ ఈకామర్స్ సంస్థలు కేవలం ఇతరులు తయారుచేసిన వస్తువులను కస్టమర్లకు విక్రయించడానికే వినియోగించాలన్న నిబంధన ఉంది. అదే భారత్‌కు చెందిన కంపెనీలు తయారుచేసిన వస్తువులు సొంత ప్లాట్‌ఫామ్‌ల్లో విక్రయించుకొనే అవకాశం ఉంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానే పోలుస్తుంది. 2006 నుంచి భారత్ దేశీయ మార్కెట్లను తమ కంపెనీలకు తెరిపించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటోంది. ఇక దీనికితోడు భారత్‌లోని విదేశీ ఈకామర్స్ వేదికలు తరచూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తనిఖీలకు లక్ష్యంగా మారుతున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో భారత్‌తో చర్చల సమయంలో తమ దేశ ఈకామర్స్ దిగ్గజాలను అమెరికా చాలా జాగ్రత్తగా సమన్వయం చేసుకొంటోందని ఈ విషయంతో సంబంధం ఉన్నవారు చెప్పినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. ఈ క్రమంలోనే భారత ఈకామర్స్ మార్కెట్‌ను తమ సంస్థలు మరింతగా తెరవాలని న్యూదిల్లీపై ఒత్తిడి తీసుకొస్తోంది. "విదేశీ పెట్టుబడులు దేశంలోకి రావడం స్వాగతించదగిన విషయమే. కానీ, మూల్యంగా భారత రిటైల్ మార్కెట్‌ను ఇష్టానుసారం మార్చేసి.. చిరు వ్యాపారుల ప్రయోజనాలను దెబ్బతీయడం కాదు" అని కన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ పేర్కొన్నారు. 2013లో భారత్‌లో అడుగుపెట్టిన నాటినుంచి అమెజాన్ ఇండియా వరుసగా తన పట్టు పెంచుకొంటూ వస్తోంది. కాకపోతే ఫ్లిప్‌కార్ట్ నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. అమెజాన్‌కు 40 మిలియన్‌ల డైలీ యాక్టివ్ యూజర్లు ఉండగా.. ఫ్లిప్‌కార్ట్‌కు 50 మిలియన్ల మంది ఉన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ పూర్తి.. తీర్పు రిజర్వ్



హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. గతేడాది నవంబర్ 1న ఎన్నికల ప్రచారసభ నిర్వహించిన కౌశిక్‌రెడ్డి.. ఓటర్లు తనకు ఓటు వేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్నికల నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కమలాపురం పోలీసులు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిర్వహించి అభియోగపత్రం దాఖలు చేశారు. రాజకీయ కక్షల కారణంగానే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఆత్మహత్య పేరుతో ఎన్నికల ప్రచారసభలో ఓటర్లను బెదిరించారని ప్రభుత్వ తరఫు న్యాయవాది అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే నోడల్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సాక్షులుగా ఓటర్ల వాంగ్మూలాన్ని ఎందుకు నమోదు చేయలేదని ప్రభుత్వ న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

## చెన్నమనేని రమేశ్‌పై డీజీపీకి ఆది శ్రీనివాస్ ఫిర్యాదు



హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. భారత పౌరసత్వం లేకున్నా తప్పుడు పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెన్నమనేనిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఇప్పటికే చెన్నమనేనిపై సీడీఐ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు వివరాలు అందించడానికి బుధవారం తమ కార్యాలయానికి రావాలని ఆది శ్రీనివాస్‌ను పిలిచారు. తన పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టులో సవాల్ చేయగా... ఆయన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి కొట్టివేసిన విషయం తెలిసిందే. అంతేకాదు.. కోర్టు ఆదేశంతో పౌరసత్వంపై ఫిర్యాదు చేసిన ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, లీగల్ సర్వీసెస్ అథారిటీకి రూ.5 లక్షలను చెల్లించాలని ఆదేశించింది. దీంతో సోమవారం ఆ నగదును చెన్నమనేని డీడీ రూపంలో అందజేశారు.

## అందుకే వీఆర్వో వ్యవస్థ రద్దు చేశారు.. కేసీఆర్‌పై మంత్రి పొంగులేటి షాకింగ్ కామెంట్స్

యాదాద్రి : ఏదైనా చట్టం చేస్తే అది ప్రజలకు ఉపయోగపడాలి కానీ భారం కావద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేసీఆర్ గొప్పతనం, స్వార్థం కోసం నలుగురు వ్యక్తులు నాలుగు గోడల మధ్య కూర్చుని చేసిన చట్టం ధరణి అని ఆరోపించారు. ఇవాళ(మంగళవారం) యాదాద్రి భువనగిరి జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ధరణి అమలు చేసే సమయంలో వంద రోజులు రిజిస్ట్రేషన్లు జరగలేదని అన్నారు. భూ భారతి చట్టం అందరి ఆమోదయగ్యంతో చేశామని చెప్పారు. మే ఒకటి తేదీ నుంచి 28 జిల్లాల్లో జిల్లాకొక్క మండలంలో పైలట్ ప్రాజక్టు అమలు చేస్తామని అన్నారు. కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రి వీఆర్వో వ్యవస్థ



రద్దు చేశారని ఆరోపించారు. అధికారులు అధికార దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

చురకలు



# బహుముఖ ప్రజ్ఞాశాలి సుందర రామకృష్ణ - ఏప్రిల్ 23... అక్కిరాజు సుందర రామకృష్ణ జన్మదినం



అక్కిరాజు సుందర రామ కృష్ణ వందకు పైగా సినిమాలలో నటించారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన ముఠామేస్త్రి చిత్రంలో అక్కిరాజు గవర్నర్‌గా నటించాడు. ఠాగూర్ సినిమాలో ప్రిన్సిపాల్‌గా కనిపించారు. నాగార్జున నటించిన శివ సినిమాలో లెక్చరర్‌గా, ఎగిరే పావురమా చిత్రంలో సంగీత కారునిగా ఆయన నటించి అందరినీ మెప్పించారు. శ్రీకృష్ణ తులాభారం నాటకంలో ప్రముఖ సినీనటి జమునతో కలిసి అనేక ప్రదర్శనలలో నటించారు. జెమిని టీవీలో, తేజ టీవీఛానల్‌లో పెళ్లిపందిరి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు సుమారు 15 సంవత్సరాల పాటు వ్యాఖ్యానం చేశారు. ఆదికవి నన్నయ్య, శ్రీనాథ కవిసార్వభౌమ, అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణ మొదలైన పాత్రలను టీవీ సీరియళ్ళలో పోషించాడు. పౌరాణిక నాటకాలలో శ్రీకృష్ణుడు, బిల్వమంగళుడు, భరతుడు, కాళిదాసు, అర్జునుడు మొదలైన పాత్రలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. అక్కిరాజు సుందర రామకృష్ణ తండ్రి అక్కిరాజు రామయ్య. తల్లి అన్నపూర్ణమ్మ. ఆయన గుంటూరు జిల్లా నరసారావుపేట లో 23 ఏప్రిల్ 1949లో జన్మించారు. ప్రముఖ రచయిత అక్కిరాజు రమాపతి రావు అయన సోదరుడు. మరొక సోదరుడు అక్కిరాజు జనార్ధనరావు పేరుపొందిన జర్నలిస్ట్. నరసారావు పేటలో డిగ్రీ వరకు చదివిన సుందర రామకృష్ణ హైదరాబాద్‌లో ఎం.ఎ., ఎం.ఓ.ఎల్.,ఎం.ఫిల్ చేశారు. తరువాత ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి వేంకట పార్వతీశ కవులు – రామాయణ పద్యకృతులు అనే అంశంపై ఇరివెంటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. థియేటర్ ఆర్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా చేశారు. తెలుగు సంస్కృతం ఆంగ్లం కలిపి నూతన మణిప్రవాళ భాషను సృష్టించినవారు. సందర్భోచితంగా ఉర్దూ పదాలు కూడా చాలా వాడుకున్నారు. అమ్మతోడు, కేశవామాధవా, కోనేటి రాయనికి, బాపురమణ, తేనీటి విందు, కవీశ్వరా, శంకర నారాయణీయము,రాజేశ్వరీ శతకము, శ్రీ శనీశ్వర శతకము, అమెరికాలో కవిసుందర్ – శ్యామసుందర్, కవితాశరధి దాశరథి, ఆంజనేయ శతకం, భీమన్న, భీమలింగ శతకం మొదలైన కావ్యాలు వ్రాశారు. బాల్యం నుండే నటన గానం పట్ల మక్కువ చూపేవారు. ఈలపాట రఘురామయ్య, సూరిబాబు, ఘంటసాల వెంకటేశ్వరరావు మొదలైన వారిని అనుకరించే వారు. ఆయన గొప్ప గాయకుడే కాక మంచి సంగీత దర్శకుడు కూడా. లక్ష్మీనరసింహ సుప్రభాతం, బాసర సరస్వతీ వైభవం, శ్రీకృష్ణ రాయబారం, షిర్డీసాయి సుప్రభాతం, గణేశ సుప్రభాతం, వేంకటేశ్వర స్తుతి, క్రీస్తు రక్షక మొదలైన సి.డి.లను కూర్చి విడుదల చేశారు. ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లో ఏ గ్రేడ్ డ్రామా ఆర్టిస్ట్ గా ఉన్నారు. 2005లో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా సన్మానం పొందారు. ఇంటర్ మీడియెట్ తెలుగు పాఠ్య పుస్తకాలలో పాఠాలను తయారు చేశారు. 2007లో లెక్చరర్‌గా పదవీ విరమణ చేశారు. కవితా గాండీవి, నాట్య శ్రీనాథ, అభినవ తెనాలి రామకృష్ణ, అభినవ ఘంటసాల, పద్య విద్యామణి, కళాప్రవీణ, వశ్యముఖి తదితర బిరుదులు సత్కారాలు పొందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




గాజాలో యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న హమాస్.. ఇప్పుడు సైన్యంలో చిన్నపిల్లలు, యువతను కూడా నియమించుకోవడం మొదలుపెట్టింది. ఇప్పటికే దాదాపు 30,000 మంది యువతను ఇజ్ అద్ దిన్ అల్ ఖస్సం బ్రిగేడ్‌లో చేర్చుకొన్నట్లు సౌదీకి చెందిన అల్ అరేబియా ఛానెల్ తన కథనంలో పేర్కొంది. వీరిలో చాలామంది గతంలో శిక్షణకు హాజరైనవారు ఉన్నట్లు అనుమానం వ్యక్తంచేసింది. కాకపోతే ఆ క్యాంపు ఇప్పటికీ ఉందా.. లేదా అనే అంశంపై స్పష్టత లేదని పేర్కొంది.

కాకపోతే కొత్తగా హమాస్‌లో చేరిన వారికి గెరిల్లా యుద్ధతంత్రం, రాకెట్లు ప్రయోగించడం, బాంబులు అమర్చడం తప్ప ఇక ఇతర నైపుణ్యాలు లేవని పేర్కొంది. వీరి నియామకాలు కచ్చితంగా ఎప్పుడు జరిగాయో కూడా అల్–అరేబియా వెల్లడించలేదు. కానీ, జనవరిలో కాల్పుల విరమణ ఒప్పందం రద్దైన తర్వాతే వీరు గ్రూపులోకి వచ్చి ఉంటారని పేర్కొంది. ప్రస్తుతం హమాస్ వద్ద ఆయుధాలు, డ్రోన్లు, దీర్ఘశ్రేణి క్షిపణుల కొరత తీవ్రంగా ఉంది. గతంలో వాడిన క్షిపణుల శకలాలను, పేలకుండా ఉండిపోయిన ఇజ్రాయెల్ దళాల మందుగుండును రీసైకిల్ చేస్తున్నారు. వీటిని భూమిపై అమర్చే పేలుడు పదార్థాలుగా వాడుతున్నట్లు తెలుస్తోంది. హమాస్ నిధులలేమితో కటకటలాడుతోంది. కనీసం సంస్థలోని సభ్యులకు కూడా చెల్లింపులు చేయలేని స్థితికి జారిపోయింది. ఈ పరిస్థితిని అరబ్ ఇంటెలిజెన్స్ వర్గాలు గ్రహించాయట. గాజాలోకి వెళ్లే మానవీయ సాయంలో ఇజ్రాయెల్ భారీగా కోత విధించడంతో.. హమాస్ దోచుకొని విక్రయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని ఆ పత్రిక పేర్కొంది. దీంతో పాటు ఆ సంస్థలో నిధుల పంపిణీకి బాధ్యత వహించేవారిని గుర్తించి మరీ ఇజ్రాయెల్ దళాలు అంతం చేస్తున్నాయి. యుద్ధం మొదలుకావడానికి ముందు ప్రతినెలా దాదాపు 15 మిలియన్ డాలర్లు ఖతార్ నుంచి లభించేవి.

దీంతోపాటు ఏటా 500 మిలియన్ డాలర్లు ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నిధుల రూపంలో వచ్చేవి. గాజాలో పోరు మొదలయ్యాక నిధుల రాక బాగా కష్టతరంగా మారిపోయింది. యుద్ధం ప్రారంభంలో బ్యాంక్ ఆఫ్ పాలస్తీనా శాఖల నుంచి 180 మిలియన్ డాలర్లు తీసుకొన్నట్లు అక్కడి అధికారులు చెబుతున్నారు.




ఈ సాంకేతిక యుగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఇప్పటికే ఏఐ ఆధారిత ఆటోమేషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో వేగంగా పనులు పూర్తవుతున్నా.. కొన్ని సమస్యలూ లేకపోలేదు. ముఖ్యంగా ఏఐ రాకతో ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. తాజాగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. కృత్రిమ మేధతో రాబోయే రోజుల్లో కొట్లాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని అన్నారు. ఫలితంగా నిరుద్యోగం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు.

**రెండు, మూడు రోజులైనా పనిచేయగలమా? బిల్‌గేట్స్..** “ఇది ఏఐ యుగం.. జ్ఞానంపై సమాజం దృక్కోణాన్ని సమూలంగా మార్చే శకం. ఇప్పటివరకు గొప్ప గొప్ప డాక్టర్లు, టీచర్ల మేధ అద్భుతం అని కొనియాడాం. కానీ, ఏఐ రాకతో రాబోయే దశాబ్ద కాలంలో వీరికి ఉండే జ్ఞానం ఉచితంగా, అందరికీ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం మన జనాభాకు సరిపడా వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. దీంతో ఏఐతో లభించే మెడికల్ సలహాలు, టీచింగ్ క్లాస్‌లు అందరికీ నచ్చుతాయి. కానీ, ఇది కాస్త భయానకమైన విషయం. ఇదంతా పక్కనబెడితే.. మరి ఉద్యోగాల సంగతేంటీ? కనీసం వారానికి రెండు, మూడు రోజులైనా పని చేయగలమా?” అని బిల్‌గేట్స్ అన్నారు.

అయితే, కొన్ని విషయాల్లో ఏఐ సమస్యలను పరిష్కరిస్తోందని టెక్ దిగ్గజం తెలిపారు. కృత్రిమ మేధతో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని, పనులు వేగవంతమవుతున్నాయని పేర్కొన్నారు.

**వందేళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితి: ఒబామా...** "సాంకేతికత పెరిగే కొద్దీ.. ఏఐ మరింత ప్రభావవంతంగా, వేగంగా అందుబాటులోకి వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఆటోమేషన్‌కు అడ్వాన్స్డ్ వెర్షన్. అయితే, కేవలం తయారీ రంగాన్ని మాత్రమే ఆటోమేటిక్ చేయట్లేదు. రోబో చేతులను ఉపయోగించడంలేదు కాదు. ఉన్నత స్థాయి మేధోపరంగానూ అనేక పనులు చేస్తోంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలపర్లు చేసే 70శాతం పనులను ఏఐ చేయగలదు. నిపుణులైన ఉద్యోగులు, మంచి జీతభత్యాల గురించి మాట్లాడుకునేటప్పుడు ఏఐ రాక కాస్త గందరగోళానికి గురిచేస్తుంది. కృత్రిమ మేధ వినియోగం పెరిగితే చాలా ఉద్యోగాలు గల్లంతే. వందేళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితి రావొచ్చు. బ్లూ కాలర్ ఉద్యోగులే కాదు, చాలా మంది ఆందోళనకు గురవుతారు. ఉద్యోగం ఎలా? కుటుంబాన్ని పోషించేందుకు ఆదాయం ఎలా? ఇలాంటి ప్రశ్నలు తలెత్తుతాయి” అని ఒబామా వివరించారు. వీరి అభిప్రాయాలపై సోషల్ మీడియాలోనూ చర్చ మొదలైంది. “ఇలాంటి భవిష్యత్తునేనా మనం కోరుకునేది? విద్య, ఆరోగ్య రంగాల్లో మనిషి ప్రతిభను మెషిన్లు భర్తీ చేయగలవా?” అని యూజర్లు ప్రశ్నిస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన అంశమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్‌కు రాహుల్ గాంధీ లేఖ.. అసలు విషయమిదే..

ఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. తెలంగాణలో వేముల రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని రాహుల్ గాంధీ లేఖలో కోరారు. అయితే రోహిత్ చట్టంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ ఏం ఆలోచించినా ప్రజల కోసమే ఆలోచిస్తారని అన్నారు. రోహిత్ చట్టం తేవాలని రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారని తెలిపారు. రోహిత్ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం నాడు ఎంపీ చామల కిరణ్ మీడియాతో మాట్లాడారు.

**తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఎంపీ చామల...** కేసీఆర్ చేసిన తప్పులకు రజతోత్సవ సభలో తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ పిట్టల దొర, కేటీఆర్ తుపాకీ రాముడని ఎద్దేవా చేశారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బులతో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. రజతోత్సవాలు బీఆర్ఎస్ పార్టీకా, టీఆర్ఎస్ పార్టీకా అని ప్రశ్నించారు. రజతోత్సవ బ్యానర్‌లో బీఆర్ఎస్ అని ఉంటుందా.. టీఆర్ఎస్ అని ఉంటుందా అని నిలదీశారు. కేటీఆర్ మళ్లీ చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలను స్మరించుకున్నారని అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావలసిన అవసరం ఏముందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ అధ్యక్ష పదవిపై ఎంపీ చామల కిరణ్ ఏమన్నారంటే...** కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి చేసేదేముందని ప్రశ్నల వర్షం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కురిపించారు. తుపాకీ రాముడు కేటీఆర్ బాధ ఏంటో అర్థం కావడం లేదన్నారు. భారీ డైలాగులు కొట్టి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని అన్నారు. కళ్లముందు జరిగిన చరిత్రను కేటీఆర్ వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. గాంధీ, నెల్సన్ మండేలా లాగా కేసీఆర్ ఫీల్ అవుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవిపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వనున్నట్లు సమాచారముందని అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ కులగణన ఫలితమే బీఆర్ఎస్ పార్టీ బీసీని అధ్యక్షుడిగా నియమిస్తోందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# అమెరికాలో భారతీయ విద్యార్థుల ముందు ఈ దారులు?

చిన్న చిన్న నేరాలకే అమెరికాలో విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్నాయి. గొడవ చేసినా.. గొడవలో ప్రమేయం ఉన్నా.. పబ్ లో అల్లరి చేసినా.. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా ఇలా ఏది చేసినా విద్యార్థుల వీసాలు రద్దు చేస్తూ దేశం దాటి పోవాలని హుకూం జారీ చేస్తున్నారు. దీన్నే ప్రశ్నించిన ఓ అమెరికాలో చదువుతున్న ఓ భారతీయ విద్యార్థి ఏకంగా కోర్టుకెక్కి అమెరికా సర్కార్ పై న్యాయపోరాటం చేసి గెలిచాడు. అందరికి ఓ స్ఫూర్తివంతమైన సందేశం పంపాడు. ఇప్పుడు అందరికీ అతడి దారి ఓ మార్గదర్శకంగా మారుతోంది. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో వెళ్లే భారతీయ విద్యార్థులు ప్రస్తుతం తీవ్రమైన ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ హయాం నుండి ప్రారంభమైన కఠినమైన వలస నిబంధనలు ఇప్పుడు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతంలో పెద్దగా పట్టించుకోని స్వల్ప నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటివి ఇప్పుడు వారి అమెరికా కలను చిదిమేస్తున్నాయి. కేవలం హెచ్చరిక లేదా చిన్న జరిమానాలతో సరిపెట్టిన కేసులను కూడా తిరిగి తెరపైకి తీసుకువచ్చి, విద్యార్థుల వీసాలను రద్దు చేస్తున్నారు.

**– చిన్న పొరపాట్లకే పెద్ద శిక్షలు:** గతంలో ఎప్పుడో జరిగిన చిన్నపాటి తప్పులు ఇప్పుడు విద్యార్థులను వెంటాడుతున్నాయి. ఉదాహరణకు, రెండేళ్ల క్రితం న్యూయార్క్‌లో వేగంగా కారు నడిపిన ఒక భారతీయ విద్యార్థి అప్పట్లో జరిమానా కట్టి కేసును ముగించుకున్నాడు. అరెస్ట్ వంటివి జరగలేదు. అయితే, ఇప్పుడు అకస్మాత్తుగా అతని వీసా రద్దు చేయబడే ప్రమాదం ఏర్పడింది. చట్టపరంగా ముగిసిన కేసు ఇప్పుడు అతని భవిష్యత్తుకు అడ్డంకిగా మారింది. మిస్సోరీలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్ట్ అయిన హైదరాబాద్‌కు చెందిన మరో విద్యార్థి పరిస్థితి కూడా ఇలాంటిదే. కోర్టు ఆదేశాల ప్రకారం ఏడాది పాటు మద్యం సేవించకుండా, క్రమం తప్పకుండా మూత్ర పరీక్షలు చేయించుకుంటూ అన్ని నిబంధనలు పాటించాడు. అయినప్పటికీ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అతని వీసా రద్దు చేయబడింది.

**–వీసాల అకస్మిక రద్దు, అప్పీలుకు అవకాశం కరువు:** తాజా నివేదికల ప్రకారం ఇప్పటికే 300కు పైగా భారతీయ విద్యార్థుల వీసాలు రద్దు చేయబడ్డాయి. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల రద్దయిన అంతర్జాతీయ విద్యార్థుల వీసాలలో సుమారు 50 శాతం మంది భారతీయులే ఉన్నారు. వీరికి చాలా సందర్భాలలో ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వడం లేదు. అకస్మాత్తుగా వీసా రద్దు గురించి సమాచారం అందుతోంది. తమ పరిస్థితిని వివరించుకోవడానికి, అప్పీల్ చేసుకోవడానికి తగినంత సమయం లేదా అవకాశం లభించడం లేదు. ఇది విద్యార్థులలో తీవ్రమైన అనిశ్చితిని, భయాన్ని కలిగిస్తోంది.

**–1940 నాటి ఏలియన్ రిజిస్ట్రేషన్ చట్టం పునరుజ్జీవం:** ఈ కఠినతర విధానాలకు తోడు 1940 నాటి ఏలియన్ రిజిస్ట్రేషన్ చట్టాన్ని తిరిగి తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం, అమెరికాలో ఉన్న F-1 (విద్యార్థి), H-1B (ఉద్యోగ) వీసాలపై ఉన్న విదేశీయులు అందరూ తప్పనిసరిగా తమ వివరాలను డిజిటల్‌గా నమోదు చేసుకోవాలి.

అంతేకాకుండా తమ చట్టబద్ధమైన స్థితిని నిరూపించే పత్రాలను ఎప్పుడూ తమ వెంట తీసుకెళ్లాలి. ఈ నిబంధనను పాటించని వారికి జరిమానాలు లేదా జైలు శిక్షతో పాటు దేశ బహిష్కరణ కూడా విధించే అవకాశం ఉంది.

**–మారుతున్న వలస విధానం తీరు:** గతంలో అమెరికా వలస విధానం చిన్నపాటి తప్పులను సరిదిద్దే విధంగా, కొంత ఉదారంగా ఉండేది. అయితే, ప్రస్తుతం అమలవుతున్న విధానాలు భూతకాలంలోని వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటూ, శిక్షించే దిశగా మారుతున్నాయని



విశ్లేషకులు భావిస్తున్నారు. “క్యాచ్ అండ్ రివోక్” వంటి కార్యక్రమాల ద్వారా సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నారని, ఇది మరింత మంది విద్యార్థులను ప్రభావితం చేసే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి.

**–భారతీయ విద్యార్థుల ముందున్న దారులు:** న్యాయపోరాటం: వీసా రద్దుకు గురైన కొందరు విద్యార్థులు ఇప్పటికే న్యాయస్థానాలను ఆశ్రయించారు. కొందరికి తాత్కాలిక ఊరట లభించినప్పటికీ, ఇది ఖర్చుతో కూడుకున్నది మరియు విజయం సాధించడం అనిశ్చితంగా ఉంది. వ్యక్తిగత కేసు పరిస్థితులు, లభ్యమయ్యే ఆధారాలు న్యాయపోరాట ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి.

**దేశం వీడటం:** వీసా రద్దు నోటీసు అందుకున్న చాలా మంది విద్యార్థులు స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్ళవలసి వస్తోంది. ఇది వారి విద్యను, భవిష్యత్తు ప్రణాళికలను తీవ్రంగా దెబ్బతీస్తుంది.

**అత్యంత అప్రమత్తంగా ఉండటం:** ప్రస్తుతం అమెరికాలో ఉన్న విద్యార్థులు అత్యంత చిన్న చిన్న చట్టపరమైన పొరపాట్లు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, లేదా మరే ఇతరత్రా సమస్యలలో చిక్కుకోకుండా జాగ్రత్త వహించడం అత్యంత ముఖ్యం. వలస నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి.


**విద్యా సంస్థల మద్దతు:** కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ఈ విషయంలో మద్దతుగా నిలుస్తూ, న్యాయ సహాయం అందించడానికి ప్రయత్నిస్తున్నాయి. విద్యార్థులు తమ విద్యా సంస్థలలోని అంతర్జాతీయ విద్యార్థుల కార్యాలయాలను సంప్రదించడం ద్వారా సహాయం పొందవచ్చు.

**భారత ప్రభుత్వ సహాయం:** అమెరికాలోని భారత రాయబార కార్యాలయం మరియు కాన్సులేట్లు ప్రభావిత విద్యార్థులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి మరియు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయి. ఈ సమస్యను అమెరికా ప్రభుత్వంతో చర్చించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

**ముగింపు:** అమెరికాలో భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కఠినతరమవుతున్న వలస నిబంధనలు, ఊహించని వీసా రద్దులు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితులలో, విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండటం, చట్టపరమైన అంశాలపై అవగాహన పెంచుకోవడం, అవసరమైతే న్యాయ సహాయం తీసుకోవడం వంటివి తప్పనిసరి. అంతేకాకుండా, ఇమ్మిగ్రేషన్ విధానాలలో పారదర్శకత, హేతుబద్ధత అవసరమని నిపుణులు మరియు ప్రభావిత వర్గాలు కోరుతున్నాయి. భారతీయ విద్యార్థులు తమ భవిష్యత్తును కాపాడుకోవడానికి అటు న్యాయపోరాటం, ఇటు అత్యంత జాగ్రత్తతో కూడిన జీవనం అనే రెండు దారుల మధ్య సందిగ్ధంలో ఉన్నారు.

# తీరు మారని రాహుల్.. కాంగ్రెస్‌కు తిప్పలే!

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభలో విపక్షనేత.. రాహుల్‌గాంధీ మరోసారి బీజేపీకి అడ్డంగా దొరికేశారు. అసలే.. బీజేపీ నాయకులుఎప్పుడు అవకాశం వస్తే.. అప్పుడు రాహుల్‌ను ఏకేస్తున్నారు. పైగా ఇప్పుడు మూడురాష్ట్రాల ఎన్నికలకురంగం రెడీ అవుతున్న దరిమిలా.. మరింతగా రాహుల్‌ను కార్నర్ చేయాలని బీజేపీ నాయకులు రెడీఅయ్యారు. ఇలాంటి సమయంలో ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించి.. తనను కాపాడుకుని.. పార్టీని కూడా కాపాడాల్సి ఉంది. కానీ.. ఈ విషయంలో రాహుల్ దారులు తప్పుతున్నారు.. తప్పటడుగులే వేస్తున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనకు వెళ్లిన రాహుల్‌గాంధీ.. మరోసారి అక్కడ భారత్‌పై విమర్శలుగుప్పించారు.ఇప్పటికే ఆయన బ్రిటన్‌పర్యటనలో చేసిన విమర్శలను ప్రధాని మోడీ ఇటీవల కూడా ఎండగట్టారు. అలాంటిది తన తీరు ను మార్చుకునేందుకు రాహుల్ ఎంత మాత్రమూ ప్రయత్నించడం లేదు. తాజాగా అమెరికాలో రాహుల్ గాంధీ



మట్లాడుతూ.. భారత దేశ ఎన్నికల వ్యవస్థను తప్పుబట్టారు. వాస్తవానికి ప్రపంచ దేశాలన్నీ.. భారత ఎన్నికల వ్యవస్థను మెచ్చుకుంటున్నాయి. ఒక్క ఎలాన్ మస్క్ తప్ప.. ట్రంప్ కూడా.. భారత ఎన్నికల వ్యవస్థపై ఎప్పుడూ విమర్శలు చేయలేదు. అలాంటి చోట రాహు ల్.. %--%భారత ఎన్నికల సంఘం కొన్ని పార్టీలతో రాజీ పడుతోంది%--% అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. భారత ఎన్నికల వ్యవస్థపై.. సంఘంపై.. అక్కడి ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని చెప్పుకొచ్చారు. కానీ.. వాస్తవానికి ప్రజలకు నమ్మకం ఉంది... లేనిదల్లా కాంగ్రెస్ కేనని బీజేపీ నాయకులు విమర్శించిన విషయం తెలిసిందే. అక్కడితోకూడా.. ఆగని రాహుల్.. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలను ప్రస్తావించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో సాయంత్రం 5.30–7.30 మధ్య 70 లక్షల మంది ఓట్లు వేసిన ట్టు ఎన్నికల సంఘం చెప్పిందని.. కానీ, ఇది ఎలా సాధ్యమో .. సంఘానికైనా తెలియదని అందుకే తమకు సమాధానం చెప్పడం లేదని.. ఇదంతా రాజీ పడడం వల్లే జరుగుతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సాధారణంగా ఓటరు ఓటు వేయడానికి 3 నిమిషాల సమయం పడుతుంది. కానీ.. కేవలం రెండు గంటల్లో 70 లక్షల మంది ఎలా ఓటేశారు? దీనికి సమాధానం లేదు. సో.. ఇదీ.. భారత ఎన్నికల వ్యవస్థ అని చెప్పుకొచ్చారు. సహజంగా విదేశాలకు వెళ్లినప్పుడు.. భారత దేశ గొప్పతనాన్ని చెబుతుంటారు. కానీ,రాహుల్ తరచుగా ఇలానే విమర్శలు చేస్తూ.. అడ్డంగా దొరికి పోతున్నారు.

# అత్యవసరంగా డబ్బు కావాలా?.. మీ బంగారం వేస్తే ఈ ఏటీఎంలో డబ్బులొస్తాయ్

ఏటీఎం అనగానే మనకు ఠక్కున గుర్తుకు వచ్చేది డబ్బులు తీసుకోవడం లేదా డిపాజిట్ చేయడం. కానీ టెక్నాలజీ ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. తాజాగా, చైనాలోని షాంఘై నగరంలో ఒక వినూత్న ఏటీఎం కనిపించింది. దీని స్పెషాలిటీ ఏమిటంటే.. ఇందులో మీరు బంగారాన్ని ఉంచితే చాలు.. అది మీ బ్యాంకు ఖాతాలో డబ్బును జమ చేస్తుంది. వినడానికి వింతగా ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఈ యంత్రం ఎలా పనిచేస్తుంది. దీని వెనుక ఉన్న టెక్నాలజీ ఏమిటో ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఈ ఏటీఎంలో అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు ముట్టనప్పుడు మీరు మీ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు లేదా ఇతర బంగారు వస్తువులను ఉంచవచ్చు. యంత్రం వాటిని స్వీకరించి, అత్యాధునిక సెన్సార్ల సహాయంతో వాటి బరువు, క్వాలిటీని క్షణాల్లో గుర్తిస్తుంది. ఆ తర్వాత, ఆ రోజు చైనా మార్కెట్‌లో ఉన్న బంగారం ధర ప్రకారం మీ బంగారం విలువను లెక్కిస్తుంది. విశేషం ఏంటంటే.. యంత్రం 1200 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద బంగారాన్ని కరిగించి, దాని స్వచ్ఛతను మరింత కచ్చితంగా



నిర్ధారిస్తుంది. అన్ని వివరాలు సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఆ మొత్తాన్ని నేరుగా మీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తుంది. ఈ ప్రక్రియ అంతా కొన్ని నిమిషాల్లోనే పూర్తవుతుంది. ఈ టెక్నాలజీ వినియోగదారులకు అనేక విధాలుగా ఉపయోగపడుతుంది అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీగా డబ్బులు అవసరం అనుకున్నప్పుడు తమ వద్ద ఉన్న బంగారాన్ని సులభంగా విక్రయించి డబ్బు పొందవచ్చు. అంతేకాకుండా, బంగారం విక్రయించడానికి నమ్మకమైన ప్రదేశం కోసం వెతకాల్సిన అవసరం కూడా ఉండదు. ఈ యంత్రం ద్వారా జరిగే లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయని, వినియోగదారులకు మంచి ధర లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. షాంఘైలో ఈ కొత్త ఏటీఎం ప్రజల నుంచి విశేషమైన స్పందనను అందుకుంటోంది.చాలా మంది తమ వద్ద ఉన్న చిన్న మొత్తాల బంగారాన్ని కూడా ఈ యంత్రం ద్వారా విక్రయించి నగదు పొందుతున్నారు. అయితే, ఈ టెక్నాలజీకి కొన్ని లిమిట్స్ కూడా ఉండవచ్చు. ఉదాహరణకు, చాలా పెద్ద మొత్తంలో బంగారం విక్రయించాలనుకునే వారికి ఇది అనుకూలంగా ఉండకపోవచ్చు.ఒకవేళ ఇలాంటి ఏటీఎం మన దేశంలో కూడా వస్తే ఎలా ఉంటుంది.. నిజంగా ఇది మాత్రం మార్కెట్లో ఓ విప్లవాత్మక మార్పు అవుతుంది. చిన్న, మధ్య తరహా బంగారు ఆభరణాలు కలిగిన వారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, దీనికి సంబంధించిన నియమ నిబంధనలు, భద్రతా చర్యలు ఎలా ఉండబోతున్నాయనేది వేచి చూడాలి.

# చురకలు

## సంపాదకీయం

### థాక్రే బ్రదర్స్ : ఉన్న దమ్ములు చూపిస్తారా ?

ఆ ఇద్దరూ అన్నదమ్ములు. అంటే కజిన్స్ అన్న మాట. మహా రాజకీయాల్లో పెద్ద పులి లాంటి శివసేన అధినేత బాల్ థాక్రేకి మొదట వారసుడిగా ఆయన తమ్ముడి కొడుకు రాజ్ థాక్రే అని అంతా అనుకునేవారు. బాల్ థాక్రేని అచ్చుగుద్దినట్లుగా ఆయన అన్ని విషయాల్లో పోలి ఉండేవారు. థాక్రే డేరింగ్ అండ్ డాషింగ్ పొలిటికల్ స్టైల్ రాజ్ థాక్రేకు వచ్చింది. అలాగే ఆయన ఆవేశపూరితమైన స్పీచులు అలాగే బాడీ లాంగ్వేజ్ ఆయన వేసే సెటైర్లు మరాఠీ భాష మీద పట్టు ఇవన్నీ రాజ్ కే ఎక్కువగా అబ్బాయి. అంతే కాదు థాక్రే మార్క్ వ్యూహాలు కూడా రాజ్ కే ఎక్కువగా పట్టుబడ్డాయి. ఇక 1990 దశకంలో శివసేన ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ సమయంలో ఆయనను వెన్నంటి రాజ్ థాక్రే ఉండేవారు. ఇదిలా ఉంటే సొంత కొడుకు ఉద్ధవ్ థాక్రే 1985 బృహన్ ముంబై ఎన్నికల్లో శివసేన పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారు. 1990లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఇక 2002లో బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని ఒంటి చేత్తో విజయ తీరాలకు చేర్చారు. . 2003లో శివసేన అధినేత బాల్ థాక్రే ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. 2004లో శివసేన పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అలా బాల్ థాక్రే తన సొంత కుమారుడు ఉద్ధవ్ థాక్రేకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఆయననే తన అసలైన వారసుడిగా ప్రకటించేశారు. దాంతో రాజ్ కి బాల్ థాక్రేకి కొంత గ్యాప్ వచ్చింది. అలా 2005 నవంబరు 27న శివసేనకు రాజీనామా చేసి సొంత పార్టీని రాజ్ పెట్టుకున్నారు. దానికి మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అని పేరు పెట్టుకున్నారు అయితే రాజ్ ఆ పార్టీ తరపున పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. అంతే కాదు చట్ట సభలకు సైతం తాను ఒక్కడిగా కూడా గెలవలేకపోయారు. ఎంతో బలమైన నాయకుడిగా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కనిపించిన రాజ్ థాక్రే ఇప్పటిదాకా చట్ట సభలలో కాలు మోప లేకపోయారు అంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఆయన కంటే వెనక వచ్చిన ఉద్ధవ్ థాక్రే ఏకంగా సీఎం గా కూడా అయిపోయారు. ఇదిలా ఉంటే ఉద్ధవ్ థాక్రే తన వారసుడిగా బాల్ థాక్రే నిర్ధారించారు. దాంతో శివసేన యావత్తూ ఆయన వెంట నడిచింది. అయితే 2019 నుంచి 2022 మధ్యలో ఏక్ నాథ్ షిండే శివసేనను చీల్చేశారు. ఆయన పవర్ ఫుల్ మాస్ లీడర్. దాంతో శివసేన డీలా పడింది. తగిన వ్యూహాలు లేక 2024 లోక్ సభ ఎన్నికల్లో పెద్దగా పెర్ఫార్మెన్స్ చూపించలేకపోయింది. ఈ నేపథ్యంలో రాజ్ థాక్రే ఉద్ధవ్ థాక్రే ఇద్దరూ కలిసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. మహారాష్ట్రలో హిందీ భాషను రుద్దుతామని అంటే తాము వ్యతిరేకిస్తామని ఉద్ధవ్ థాక్రే ప్రకటించారు. శివసేన మరాఠీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఈ ఒక్క అంశమే ఈ ఇద్దరినీ కలపబోతోంది అని అంటున్నారు. తమ మధ్య ఉన్నవి చిన్న అభిప్రాయ విభేదాలే అని రాజ్ అంటున్నారు. ఉద్ధవ్ కూడా రాజ్ తో జత కలిసేందుకు ఓకే అంటున్నారు. ఇలా థాక్రే బ్రదర్స్ చేతులు కలుపుతున్నారు. ఇది రానున్న బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో శివసేనని గెలిపించేందుకే అని అంటున్నారు. అంతే కాదు శివసేనలో ఏక్ నాథ్ షిండే వెళ్ళిపోయాక మాస్ ఇమేజ్ ఉన్న లీడర్ లేకుండా పోయారు. రాజ్ కనుక వస్తే ఆ లోటు తీరుతుందని అంటున్నారు. మరి ఈ ఇద్దరు అన్నదమ్ములు కలిస్తే కనుక శివసేనకు రాజకీయంగా లాభం ఉంటుందని అంటున్నారు. మిత్రులు అయిన కాంగ్రెస్ శరద్ పవార్ ఎన్సీపీ థాక్రే బ్రదర్స్ ఒక్కటి కావాలని కోరుకుంటున్నాయి. బీజేపీ కూడా వారిద్దరి కలయికకు ఓకే చెబుతూ ఎవరు కలసినా మహారాష్ట్రలో తమదే ప్రతీ ఎన్నికలోనూ విజయం అని అంటోంది. మొత్తం మీద చూస్తే ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఉన్న దమ్ములు చూపించబోతున్నారుట. ఈ ఇద్దరూ కలిసేది ఎపుడూ ఏమిటి అన్నది తొందరలో తెలుస్తుంది.

# అనితర సాధ్యం...సుబ్రహ్మణ్య శర్మ సేవాభావం - ఏప్రిల్ 23...తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ జయంతి

ఒక మారుమూల చిన్న గ్రామానికి రాష్ట్రస్థాయిలో పేరు తేవడం, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేట్లు చేయడం, అంతర్జాతీయ చిత్రపటంపై కూడా ఓ కుగ్రామం పేరును పరిచయము చేయడం సామాన్యమైన విషయమేమీ కాదు. దాని వెనక మొక్కవోని ధైర్యం, పట్టుదల, చిత్తశుద్ధి, అంకితభావం, విరామం ఎరుగని కృషి, అన్నిటికీ మించి అకుంఠిత కార్యదీక్ష కలబోసిన ఒక అరుదైన వ్యక్తిత్వం ఉంది. స్వలాభాపేక్ష లేని నిస్వార్థ సేవా భావం ఆ వ్యక్తిత్వంలో కలగలిసిపోయింది. ఆ అరుదైన ఆదర్శ వ్యక్తిత్వం చెందిన తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మది. పెద్దగా చదువుకోకున్నా విద్యారంగంలో, గ్రామ అభివృద్ధిలో ఇతోధిక సేవ చేసి సుబ్రహ్మణ్య శర్మ మహబూబ్ నగర్ జిల్లా, బిజినేపల్లి మండలం పాలెం గ్రామ అభివృద్ధికి మారు పేరుగా నిలిచారు. అప్పట్లోనే ఆయన సేవలను గుర్తిస్తూ జాతీయస్థాయిలో కూడా అనేక పత్రికలు ప్రత్యేక కథనాలు రాశాయి. రాష్ట్రస్థాయిలోనే గ్రామానికి పేరుతెచ్చి ఎలాంటి స్వలాభాపేక్ష లేకుండా సేవచేసి, తన స్వంత ఆస్తులనే గ్రామాభివృద్ధికి వెచ్చించిన మహనీయుడిగా నిలిచిన సుబ్బయ్య. పాలెం కుగ్రామానికి పట్టణస్థాయి వసతులు కల్పించడానికి కృషిచేశారు. తాను స్థాపించిన కళాశాలలో అభ్యసించిన విద్యార్థులందరో నేడు కవులుగా చెలామణి అవుతున్నారు. ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహం అప్పటి రాష్ట్ర గవర్నరు కుముద్‌బెన్ జోషిచే ఆవిష్కరించబడింది. సుబ్బయ్య స్థాపించిన పాఠశాల పేరును తోటపల్లి సుబ్రహ్మణ్యం స్మారక ఉన్నత పాఠశాలగా పేరుమార్చి ఆయన సేవలను గుర్తించారు. 2006లో సుబ్రహ్మణ్యం చేసిన సేవలపై ప్రత్యేకంగా ఒక పుస్తకమే వెలువడింది. తోటపల్లి సుబ్రహ్మణ్యం 1926, ఏప్రిల్ 23న సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి సత్యమూర్తి, తల్లి భగీరథమ్మ. తల్లిదండ్రులు మొదట ఈయనకు పౌరోహిత్యం నేర్పాలని ప్రయత్నించారు. కాని సుబ్రహ్మణ్యంకు దీనిపై ఆసక్తి లేకుండేది. అప్పుడు గ్రామంలో ఒకేఒక పాఠశాల, అదీ కూడా ఏకోపాధ్యాయ పాఠశాల ఉండేది. అందులోనే కొంతవరకు తెలుగు, ఉర్దూ అభ్యసించారు. ప్రారంభంలో సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుడిగా జీవనం ఆరంభించారు. కాని ఈ వృత్తిలో ఇతనికి ఆసక్తి లేకుండేది. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి వ్యవసాయం చేయడం ప్రారంభించారు. తాను 22 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు తండ్రి మరణించడంతో కుటుంబ బాధ్యతల బరువు మోయాల్సి వచ్చింది. తమ్ముడు రామేశ్వర్‌ను ఉన్నత విద్య అభ్యసించడానికి సహాయపడినారు. రామేశ్వర్‌కు ఉన్నత ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్ననూ అది కాదని గ్రామాభివృద్ధిలో తనకు సహకరం అందించవలసిందిగా, తనకు తోడుగా ఉండవలసిందిగా కోరడంతో చివరి వరకు రామ లక్ష్మణులులా ఆదర్శ సోదరులు ఇద్దరూ కలిసే గ్రామాభివృద్ధిలో పాలుపంచు కున్నారు. 1960 నాటికి పాలెం గ్రామం 1300 జనాభాతో జిల్లాలో పూర్తిగా వెనకబడిన ప్రాంతం. అదే సమయంలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రారంభమవడంతో గ్రామాన్ని ఎలాగైనా అభివృద్ధి చేయాలనే తలంపుతో గ్రామ ప్రజలను ఏకం చేసి సుబ్రహ్మణ్యం నడుంబిగించారు. ప్రతి పంచాయతి బ్లాకులో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలని ప్రభుత్వం భావించడంతో ఆ కేంద్రాన్ని పాలెంకు రప్పించడానికి సుబ్బయ్య ప్రయత్నించారు. బ్లాకు కేంద్రం బిజినేపల్లి కాకుండా చిన్న గ్రామమైన పాలెంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అధికారులు అభ్యంతర పర్చిననూ తన శక్తినంత ధార పోసినారు. ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు కావలసిన 2 ఎకరాల భూమిని బ్లాకు కేంద్రంలో సకాలంలో సమకూరక పోవడంతో పాలెంలో తనకున్న స్వంత భూమిని ఇస్తానని, దానికి తోడు రూ 10000/- కూడా విరాళం ఇవ్వదల్చు కున్నానని చెప్పి మొదటి సారిగా గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషిచేసి సఫలీకృతులైనారు. గ్రామంలో అధ్యాత్మిక విలువలు పెంచాలనే తలంపుతో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి పూనుకొని గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేత ఆలయానికి ప్రారంభోత్సవం చేయించారు. అప్పట్లో గ్రామంలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండేది. తర్వాతి చదువులకై నాగర్‌కర్నూల్ వెళ్ళవలసి వచ్చేది. కాబట్టి ముందుగా ఉన్నతపాఠశాల నెలకొల్పాలని సంకల్పించి, దానికి అనుబంధంగా వసతి గృహాన్నికూడా ఎర్పాటుచేశారు. ఆ తర్వాత ప్రభుత్వ డిగ్రీకళాశాల, ఓరియంటల్ కళాశాల కూడా స్థాపించారు. ఇక్కడ స్థాపించబడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిల్లాలోనే రెండవది కాగా రాష్ట్రంలోనే ఒక గ్రామంలో స్థాపించబడ్డ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మొదటిది. జిల్లాలోనే ఏకైక వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెంలో ఏర్పాటు కావడానికి కారకుడు సుబ్బయ్యనే. పట్టుబట్టి తన స్వంత భూములు కూడా దీనికై ధారబోసి పరిశోధన కేంద్రాన్ని రప్పించు కున్నారు. 'పౌల్ట్రీ, ఇతర పరిశ్రమలు అధ్యాత్మికంగా, విద్యాపరంగా గ్రామం పేరు పొందినప్పటికీ పారిశ్రామికంగా కూడా ముందంజ వేయాలని తలచి ముందుగా



సుబ్బయ్య పౌల్ట్రీ పరిశ్రమను గ్రామానికి రప్పించు కున్నారు. ఆ తర్వాత ఇతర పరిశ్రమలు కూడా గ్రామంలో స్థాపించడానికి సుబ్బయ్య కృషిచేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామానికి బస్సుసౌకర్యం కోసం కృషిచేసి స్టేషను నిర్మాణానికి పాటు పడ్డారు. అప్పట్లో సమితికేంద్రంలో కూడా బస్టాండ్ లేకుండేది, అయితే పాలెం గ్రామానికి భక్తులు, డిగ్రీ, ఓరియంటల్ కళాశాలలో అభ్యసించే విద్యార్థులు దూర ప్రాంతాలనుంచి వస్తున్నారని పట్టుపట్టి బస్సుస్టేషను నిర్మాణానికి కారకులయ్యారు. జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి కారకుడైన సుబ్బయ్య ప్రపంచ పౌల్ట్రీ సంస్థ కోరికపై అమెరికా వెళ్ళి పౌల్ట్రీ, డెయిరీ, వ్యవసాయ ఉత్పాదకతలపై పరిశోధన చేశారు. అక్కడికి వచ్చిన తర్వాత పాలెంలో అమలు చేయడానికి ప్రయత్నించారు. ఒక కుగ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా పేరుతేవడానికి సుబ్బయ్య కృషిచేయడమే కాకుండా సఫలీకృతుడైనారు. అప్పట్లో పాలెం గ్రామం రాష్ట్ర స్థాయిలో పేరు సంపాదించ డానికి సుబ్బయ్య కృషే కారణం. ప్రధానమంత్రిని, ఎందరో ముఖ్యమంత్రులనే కాకుండా అంతర్జాతీయ స్థాయి శాస్త్ర వేత్తలను కూడా పాలెంకు రప్పించిన సుబ్బయ్య గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి వ్యక్తిగతంగా మంచి పేరు పొందారు. పాలెం సుబ్బయ్యగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి సుబ్రహ్మణ్య 1986, జూన్ 23న మరణించారు. తర్వాత ఏడాది 1987, జూన్ 22న అప్పటి గవర్నరు కుముబ్ బెన్ జోషిచే సుబ్బయ్య కాంస్య విగ్రహం గ్రామంలో ఆవిష్కరించ బడింది. 1986లో సుబ్బయ్యపై ప్రత్యేకంగా ఒక పుస్తకమే ప్రచురించబడింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# పుస్తకాల పరిరక్షణ సామాజిక బాధ్యత - ఏప్రిల్ 23.. ప్రపంచ పుస్తక దినోత్సవం




ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపంచ కాపీ హక్కుల దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. 1995 నుండి నిర్వహించబడుతున్న ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం రోజున పుస్తకం చదవడం, ప్రచురించడం, కాపీ హక్కులు వంటి విషయాలను ప్రోత్సహించి వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మిగ్యుఎల్ డి సెర్వంటెస్ పుట్టి మరణించిన తేది ఏప్రిల్ 23, విలియం షేక్స్పియర్, గార్సియాసా డి లా వేగా వంటి రచయితలు మరణించిన తేది, అనేక ఇతర రచయితల పుట్టిన, మరణించిన తేది ఏప్రిల్ 23వ తేది అవడంవల్ల 1995, ఏప్రిల్ 23న యునెస్కో తొలిసారిగా ప్రపంచ పుస్తక దినోత్సవంను నిర్వహించింది. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి ?వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడా నికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపం చంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సినీ వినీలాకాశంలో ధృవ తార సత్యజిత్ రాయ్ - ఏప్రిల్ 23... సత్యజిత్ రాయ్ వర్ధంతి

సత్యజిత్ రాయ్... సినిమాల గురించి ఏ కొంచెం అవగాహన ఉన్నా, ఈ పేరు సుపరిచితమే. ప్రపంచం లోని సినీ దర్శకులలో అగ్రశ్రేణికి చెందిన ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్. దర్శకత్వం మటుకే కాక, కథారచన, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సంగీత దర్శకత్వం, కళా దర్శకత్వం ఇలా సినిమాలకు సంబంధించిన శాఖలలోనే కాకుండా చిత్రకళ లోనూ, సాహిత్యం లోనూ సాటి లేని మేటిగా తనదైన ప్రత్యేకత చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. సత్యజిత్ రాయ్ (మే 2 1921%–%ఏప్రిల్ 23 1992) భారత దేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. అయన ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించారు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో జన్మించి ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఎకనామిక్స్ చదువుకున్న సత్యజిత్ 1940–41లో తమ కుటుంబానికి మిత్రుడైన రవీంద్ర నాథ ఠాకూర్ బతికుండగానే శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళ అభ్యసించారు. సినిమాలూ, గ్రామఫోన్ రికార్డ మోజుతో 1942లో కలకత్తాకు తిరిగి వచ్చారు. 1943 నుంచి సుమారు పన్నెండేళ్ళపాటు ఒక బ్రిటిష్ అడ్వర్టైజింగ్ కంపెనీలో పని చేశాక సినీ రంగంలో కాలు మోపారు. 1955లో పథేర్ పాంచాలీ సినిమాకు దర్శకత్వం వహించిన తరవాత దర్శకుడుగా దేశవిదేశాల్లో పేరు సంపాదించు కున్నారు. అంతకు ముందే కలకత్తా ఫిల్మ్ సొసైటీని స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1949లో కలకత్తాకు వచ్చిన ప్రసిద్ధ ఫ్రెంచ్ దర్శకుడు ఝాఁ రెన్వార్ వెంట తిరిగి సమకాలీన సినిమా గురించి అవగాహన చేసుకున్నారు. సంవత్సరానికి ఒక సినిమా చొప్పున అతను దర్శకత్వం వహించిన సినిమాలన్నీ ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. కొన్ని బెంగాలీ సాహిత్యం నుంచి తీసుకున్న కథలైతే కొన్ని స్వయంగా రాసుకున్నవి. సీరియస్ కళాఖండాలే కాక పిల్లల కోసం సాహసాలూ, హాస్యంతో కూడిన సినిమాలూ తీశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, వాస్తవిక జీవిత చిత్రణ, అపూర్వం అనిపించే సినీ పరిభాషా, కళా నైపుణ్యం అడుగడుగునా ఆయన



సినిమాల్లో కనిపిస్తాయి. ప్రపంచంలోని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లన్నీ ప్రత్యేకంగా అధ్యయనం చేసే దర్శకుల్లో రాయ్ ఒకరు. రవీంద్రుడి 'చారులతా' మొదలుకొని పిల్లల సినిమా 'గోపీ గాయేన్' వంటి జానపద చిత్రాలూ, హిందీలో ప్రేంచంద్ కథ ఆధారంగా 'శత్‌రంజ్ కే ఖిలాడీ', రవీంద్రనాథ ఠాకూర్ మీద అద్భుతమైన డాక్యుమెంటరీ ఒకటీ ఇలా ప్రతీ ఒక్కటీ కళాఖండం అనిపించేట్టుగా నిర్మించారు. ఆయనకు దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉండేది. తమ సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే, కేస్టింగ్, సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము – వంటివి కూడా ఆయనే చూసుకునేవారు. రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. కంప్యూటర్ ఫాంట్‌లు వ్యాప్తిలోకి రాకముందే రాయ్ బెంగాలీ అక్షరమాలలో కొత్త శైలులని ప్రవేశపెట్టారు. బెంగాలీలో అనేక కథలూ, వ్యాసాలూ, నవలలూ కూడా రాశారు. సైన్స్ ఫిక్షన్, డిటెక్టివ్ సాహిత్యం మొదలైన ప్రత్యేక విషయాల గురించి కథలు రాసి, ఫేలూ దా మొదలైన పాత్రలతో జైసల్మేర్ కోట నేపథ్యంతో 'షోనార్ కెల్లా' వగైరా సినిమాలు కూడా తీశారు. బెంగాలీ సంస్కారాన్నీ, భారతీయతనూ ఒంట పట్టించుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన సత్యజిత్ రాయ్ ఏ ప్రక్రియను చేపట్టినా ప్రతిభా వంతంగా నిర్వహించ గలిగారు. తన చిన్నతనంలోనే ఆర్థర్ కోనన్ డాయిల్ డిటెక్టివ్ కథలనూ, ఎచ్.జి.వెల్స్ తదితరుల సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్నీ అభిమానించే వారు. సత్యజిత్ రాయ్ పిల్లల కోసం "ఫేలూదా" అన్న డిటెక్టివ్ ని సృష్టించారు. 1965 మొదలుకుని 1994 దాకా 35 ఫేలూదా నవలలు రాసారు. ఇందులో – ఫేలూదా, అతని కజిన్ తపేష్, జటాయు అని పిలువబడు లాల్ మోహన్ గంగూలీ ప్రధాన పాత్రలు. వీరు ముగ్గురు కలిసి పరిష్కరించే సమస్యల సంకలనమే ఫేలూదా కథలు. ఇది కాక సత్యజిత్ రాయ్ ప్రొఫెసర్ శొంకు అన్న మరో పాత్రని కూడా సృష్టించి నవలలు రాసారు. బెంగాలీ పిల్లల సాహిత్యంలో ఈ రెండు పాత్రలకి ఓ విశిష్ట స్థానం ఉంది. సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నారు. 40 ఏళ్ళు సినీరంగంలో ఓ వెలుగు వెలిగి, మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగా, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగ ప్రముఖునిగా నిలిచారు. సత్యజిత్ రాయ్ మరణానంతరం భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆయన పై ఓ స్టాంపును విడుదల చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# వ్యాయామ వేళ జాగ్రత్త!

గోదావరిఖని : ఆరోగ్యకరమైన జీవనం కోసం రోజూ ఉదయం, సాయంత్రాలు వ్యాయామం చేసేవారి సంఖ్య పెరుగుతోంది. నడక.. వ్యాయామం.. యోగా.. ఇలా ఎవరికి నచ్చిన మార్గంలో వారు శరీరానికి కొంత శ్రమ కలిగిస్తున్నారు.. ప్రస్తుతం ఎండలు మండుతున్న సమయంలో తగు జాగ్రత్తలతో వ్యాయామం చేస్తేనే ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు రావని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తాజాగా 39 – 40 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉక్కపోత కూడా పెరుగుతోంది. మున్ముందు ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల వ్యాయామం చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

**డీహైడ్రేషన్‌కు అవకాశం**

వేసవిలో డీహైడ్రేషన్‌కు అవకాశం ఉంటుంది. వ్యాయామం వల్ల చెమట ఎక్కువగా బయటకు వెళ్తుంది. శరీరం వెంటనే అలసిపోతుంది. ఉదయం, సాయంత్రం వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే వ్యాయామం చేయాలి. తాగునీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. ఏదైనా సమస్య అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అశోక్, సీనియర్ ఫిజిషియన్, గోదావరిఖని

**వైద్యుల సూచనలు ఇవీ..**

ఉదయం 8 గంటల లోపు వ్యాయామం పూర్తి చేయాలి.
సాయంత్రం 7 గంటల తరవాతే మైదానాలకు వెళ్లాలి.
శరీరం సహకరించిన మేరకే కసరత్తు అవసరం.



వయసులో పెద్దవారు ఒంటరిగా కాకుండా బృందాలుగా వ్యాయామానికి వెళ్లాలివెంట తాగునీరు, ఓఆర్ఎస్ ఉంచుకోవాలి
చెమట రూపంలో ఒంట్లో ఉన్న లవణాలు ఎక్కువగా బయటకు వెళ్లడం వల్ల వెంటనే అలసిపోతారు. శక్తినిచ్చే ద్రవాలు తీసుకోవాలి
ఒంట్లో సోడియం స్థాయిలు తగ్గిపోకుండా కొద్ది మొత్తంలో ఉప్పు నీరు తీసుకోవచ్చు..వ్యాయామం చేసే సమయంలో మధ్యమధ్యలో కొంత విరామం తప్పనిసరి.కళ్లు తిరిగినట్లనిపించినా, తల తప్పినట్లనిపించినా వెంటనే ఆపివేయాలి. కొద్ది సేపు విశ్రాంతి తీసుకోవాలి. సమస్య మరీ ఎక్కువనిపిస్తే ఆస్పత్రికి వెళ్లాలి.

ఉమ్మడి జిల్లాలో..జిమ్‌లు : 250
ఓపెన్ జిమ్‌లు : 150
మైదానాలు : 300
రోజూ నడిచే వారి సంఖ్య : 4 లక్షలు
వ్యాయామం చేసే వారి సంఖ్య : 1.5 లక్షలు

# చిన్న రైతుకు రాయితీ ఫలం

పెద్దపల్లి : వరి సాగు తగ్గించి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు రాయితీ అవకాశం కల్పిస్తోంది. నాటిన తర్వాత మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తోంది. పథకంలో భాగంగా ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యాలను నిర్ణయించారు. అయిదెకరాల లోపు భూమి ఉండి, జాబ్‌కార్డున్న రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తుండగా వానాకాలం ఆరంభం నాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.

**మూడేళ్ల వరకు నిర్వహణ బాధ్యత**

ఉపాధిహామీలో భాగంగా ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫలం, సపోట, జీడిమామిడి, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, కొబ్బరి పంటల సాగుకు అవకాశం ఉంది. పండ్ల తోటల నిర్వహణ బాధ్యతను మూడేళ్ల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. ఒక్కో మొక్కకు మామిడి, సపోట, జీడి మామిడి, ఆయిల్‌పామ్‌లకు రూ.686, జామ, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, కొబ్బరిలకు రూ.580 చొప్పున మూడేళ్ల పాటు, డ్రాగన్‌ఫ్రూట్ అర ఎకరంలో 900 మొక్కలు నాటితే రూ.2.68 లక్షలు చొప్పున రెండేళ్ల వరకు అందజేస్తారు. సాగు చేసిన ఏడాదితో పాటు మరో రెండేళ్లు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు.

**అన్నదాతకు అవగాహన**

ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటల సాగుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో లక్ష్యాలు అధిగమించేలా కార్యాచరణ రూపొందించారు.



ఎంపీడీవో కార్యాలయాల్లో ఆధార్, జాబ్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఇతర పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు దరఖాస్తు చేసుకొనేలా క్షేత్ర సహాయకులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, మిగిలిన సామాజికవర్గాలకు రూ.90 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు పంపిణీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో సారవంతమైన నేలలు, రైతుల్లో ఆసక్తి ఉన్నా పెట్టుబడుల భారంతో పండ్ల తోటల సాగుకు ముందుకు రావడం లేదు. కొన్నేళ్లుగా ప్రభుత్వం పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుండటంతో బీడు భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు. తెగుళ్లు, అతివృష్టితో నష్టం వాటిల్లుతోంది. ఈ మేరకు రైతులను చైతన్యం చేస్తే లక్ష్యాలు చేరనున్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

ఉపాధిహామీలో పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలి. జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. మొక్కల కొనుగోలు నుంచి నాటడం వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నాం. లాభదాయకమైన పండ్ల మొక్కలను నాటుకోవడం ద్వారా నికర ఆదాయం వస్తుంది. కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# అడవంతా ఆగమాగం



సిరిసిల్ల : జిల్లాలో 379.14 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ ప్రాతం ఉంటే అందులో 18.78 శాతం మాత్రమే పచ్చదనం ఉంది. అడవులు అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి మండలాల్లో యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నారు.

**చొచ్చుకొస్తున్న ఆక్రమణదారులు**

గతేడాది అడవుల్లో చెట్ల నరికివేత.. ఆక్రమణలపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం జిల్లా అటవీ అధికారులను నివేదిక కోరింది. దీనిలో ఆక్రమణలకు గురైంది సహజ అటవీ ప్రాంతమా? ప్లాంటేషన్ చేసిందా? అన్న వివరాలను వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. దీనికోసం జిల్లాలో బీట్లవాగా నివేదికను క్రోడీకరించగా 251.67 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు పంపారు. వాస్తవానికి ఇంతకు రెండింతలు జరిగి ఉంటుందని స్థానికుల సమాచారం.

ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని గుండారం శివారులోని అటవీ భూములను కొందరు చొరబడి చెట్లకు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. అటవీ అధికారుల సంచారం లేని సమయం చూసుకుని గుట్టుచప్పుడు కాకుండా చదును చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 50 హెక్టార్ల మేరకు అటవీ భూమి ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఈ సెక్షన్ పరిధిలోని తిమ్మాపూర్, వెంకటాపూర్, గుంటపెల్లిచెరువుతండా ప్రాంతాల్లోని అడవుల్లో వృక్షాలను నేలకూల్చి క్రమక్రమంగా 12 హెక్టార్లలో సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.వీర్నపల్లి మండలం వన్‌పల్లి శివారులో అటవీ భూములు క్రమంగా అన్యాక్రాంతమవుతున్నాయి. ఎర్రగడ్డతండా, గర్జనపల్లి, అడవిపదిర, బావుసింగ్‌నాయక్‌తండా, బాబాయిచెరువుతండా తదితర గ్రామాల పరిధిలో కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం జోరుగా సాగుతోంది. అడవిలో విలువైన చెట్లను నరికివేస్తూ ఆరుతడి పంటలు సాగుచేస్తున్నారు. గర్జనపల్లి శివారులో సుమారు 40 హెక్టార్ల అటవీభూమి అన్యాక్రాంతమై నట్లు అటవీశాఖ గుర్తించింది.

కోనరావుపేట మండలం శివంగలపల్లి, వట్టిమల్లలో రెవెన్యూ అటవీ హద్దులు తేలకపోవడంతో రెండింటిలోనూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇక్కడ రెండు శాఖల మధ్య సమన్వయంతో ఎంత ఆక్రమణలు జరిగాయనేది స్పష్టత లేదు. చందుర్తి మండలం సనుగుల, తిమ్మాపూర్. రుద్రంగి మండలం వీరునితండా, గైరిగుట్టతండాలో అటవీభూములను చదునుచేసి పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రుద్రంగి మండలంలో అటవీభూములుగా గుర్తించి హద్దురాళ్లు ఉన్నప్పటికీనీ లెక్కచేయకుండా చొచ్చుకొస్తున్నారు.

**కారణాలు**

అటవీశాఖ ప్రగతిపై కరీంనగర్ కార్యాలయంలో సమీక్షలు నిర్వహించడం.. అక్కడి నుంచి పర్యవేక్షణలు చేయడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించడం లేదు.

ఏటా హరితహారంలో మొక్కలు నాటుతున్నా.. వాటి లెక్కలు, సంరక్షణ బాధ్యతలు కూడా కరీంనగర్ నుంచే జరుగుతోంది. ఇక్కడి సిబ్బంది వాటిపై పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు.

రహదారులకు ఇరువైపుల ఉండే వృక్షాల రక్షణకు ఇస్తున్న ప్రాధాన్యం అటవీలోపల ఉన్న వృక్షాలపై చూపడంలేదు. దీంతో అక్రమార్కులు అడ్డదారుల్లో చెట్లను నరికి కలప తరలిస్తున్నారు.

ఆక్రమిత అటవీ భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయికి వెళ్లేసరికి గిరిజనుల నుంచి వ్యతిరేకత వస్తోంది.

# సీబీఎస్ఈ తరగతుల నిర్వహణకు అనుమతులు




గోదావరిఖని : సింగరేణి సంస్థ పాఠశాలలతో పాటు కళాశాలలు, సాంకేతిక విద్యా కేంద్రాలను నిర్వహిస్తోంది. వీటిల్లో కార్మికుల పిల్లలు చదువుతుంటారు. వారి నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) విధానంలో బోధనకు డిమాండ్ రావటంతో యాజమాన్యం ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా యైటింక్లైన్‌కాలనీలోని సెక్టర్–3 పాఠశాలలో వసతులు మెరుగుపరిచారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ విధానాన్ని పాఠశాలలో అమలు పరిచేందుకు శనివారం ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం సింగరేణిలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిన సెక్టార్–3 పాఠశాలలో సీబీఎస్ఈ విధానంతో బోధించేందుకు అనుమతి లభించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

**2030 వరకు అమలు**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ తరగతులు ప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు శనివారం అనుమతులు రావటంతో సీబీఎస్ఈ తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాది క్రితం సీబీఎస్ఈ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టేందుకు గల పాఠశాలలోని వసతులు, సౌకర్యాలను కేంద్ర పాఠశాలల బృందం పరిశీలించింది. ల్యాబ్‌లతో పాటు క్రీడా మైదానం, విశాలమైన తరగతి గదులు ఉండటంతో అర్హత సాధించింది. ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు సీబీఎస్ఈ విధానంలో బోధన అందించేందుకు 2030 సంవత్సరం వరకు అనుమతులు ఇచ్చారు.

**నెరవేరిన కార్మికుల కల**

సింగరేణి గనులు ఉన్న ప్రాంతాల్లో సీబీఎస్ఈ విధానంలో బోధించే పాఠశాలలు లేకపోవటంతో కార్మికుల పిల్లలను ఇతర ప్రాంతాలకు పంపించేవారు. ఈ నేపథ్యంలో సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం ద్వారా బోధించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పెరిగింది. రామగుండం ప్రాంతంలో కేవలం ఎన్టీపీసీటౌన్‌షిప్‌లో మాత్రమే కేంద్రీయ విద్యాలయం ఉంది. ప్రస్తుతం సింగరేణిలో యువ కార్మికులు పెరగడంతో వారి పిల్లలు ప్రాథమిక విద్య చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్యనందించేందుకు సరైన పాఠశాలలు లేకపోవంతో భారీగా డబ్బులు వెచ్చించి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం యైటింక్లైన్‌కాలనీలోని సెక్టర్–3 పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతులు రావటంతో యువ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మరో పాఠశాలకు ప్రయత్నం**

మరో సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ అమలుకు ప్రయత్నిస్తాం. ప్రస్తుతం సెక్టర్–3 పాఠశాలకు అనుమతులు రావటంతో జైపూర్‌లోని సింగరేణి విద్యుత్తు కేంద్రం పరిధిలోని కాలనీలో మరో పాఠశాల నిర్వహించేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తాం. సింగరేణి కార్మికుల పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.బలరాం, సింగరేణి సీఎండీ

# అక్కరకురాని శుద్ధి కేంద్రం

నర్సాపూర్: నర్సాపూర్‌లో నిర్మాణం పూర్తయిన మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం ఎఫ్ఎస్‌టీపీ(ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను వినియోగించకుండా తాళం వేశారు. దీంతో ఏడాదిగా ఇది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా మారింది. ఇందుకోసం రూ.20లక్షల నిధులు వెచ్చించారు.గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికల్లో వీటి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు పట్టణంలో వెల్దుర్తి వెళ్లే మార్గంలోని ప్రభుత్వ భూమిని దీనికి కేటాయించగా.. గుత్తేదారు ఏడాది క్రితమే పనులు పూర్తిచేశారు. జనావాసాలకు దూరంగా దీని నిర్మాణం చేపట్టారు. మానవ వ్యర్థాల శుద్ధికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. బోరు, ట్యాంకులు, అరలతో కూడిన సంపులు నిర్మించారు.

**నిబంధనలు పాటించక** నివాస గృహాల్లో సెప్టిక్ ట్యాంకులు నిండినప్పుడు వ్యర్థాలను కొందరు తీసుకెళ్లి శివారు ప్రాంతాల్లో ఖాళీ చేస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది. వ్యాధులు వ్యాపించే అవకాశం లేకపోలేదు. వ్యర్థాలను తరలించే వారు సైతం ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. సెప్టిక్ ట్యాంకు నిండినప్పుడు వాటిని శుభ్రపర్చడానికి వెళ్లి కొందరు మృత్యువాతపడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో పురపాలిక సిబ్బందే వ్యర్థాలను ఇళ్ల నుంచి ప్లాంటుకు తరలిస్తారు. శుద్ధి చేశాక వచ్చే నీటిని నిర్ణీత ప్రదేశంలోనే ఖాళీ చేయిస్తారు.

# ఏఖీన్‌పూర్ సీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు

కోరుట్ల: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ హెల్త్ మిషన్' కింద 'నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్'(ఎన్‌క్వాస్) పురస్కారాలను అందజేస్తుంది. ఇటీవల తెలంగాణలోని మూడు సీహెచ్‌సీలను ఎంపిక చేసింది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఖీన్‌పూర్ సీహెచ్‌సీని ఎన్‌క్వాస్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఎన్‌క్వాస్‌కు ఎంపికైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మూడేళ్లపాటు ఏటా రూ.3 లక్షలు, సీహెచ్‌సీలకు రూ.2 లక్షలు అందనున్నాయి. మార్చి 18న ఏఖీన్‌పూర్ సీహెచ్‌సీని ఎన్‌క్వాస్ బృందం పరిశీలించి ఆసుపత్రి పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి నమోదు చేసుకున్నారు.

**మెరుగవనున్న వైద్య సేవలు**

పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో ప్రజలకు అందిస్తున్న సేవల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్ పురస్కారానికి ఎంపిక చేస్తుంది. ఏఖీన్‌పూర్ సీహెచ్‌సీ పరిధిలో ఏఖీన్‌పూర్, నాగులపేట, సంగెం గ్రామాలున్నాయి. మొత్తం 5990 మంది జనాభా ఉన్నారు. ఏఖీన్‌పూర్ సీహెచ్‌సీలో



సీహెచ్‌వో, ఇద్దరు ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశా వర్కర్‌లు మొత్తం 8 మంది వైద్య సిబ్బంది పని చేస్తున్నారు. సీహెచ్‌సీ పరిధిలో నిత్యం ఓపీలో 40 మందిని పరీక్షించి చికిత్స అందిస్తుంటారు. ప్రతిరోజు సీహెచ్‌సీకి వచ్చే వారికి బీపీ, మధుమేహ పరీక్షలు, జ్వరం, సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించి వైద్యం అందిస్తుంటారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్థులకు మందులు అందిస్తుంటారు. చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు ఇస్తుంటారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించడంతోపాటు 9 నెలలు నిండే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తుంటారు. పాఠశాల విద్యార్థులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సీజనల్, ఇతర వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో అందించిన సేవలకు గానూ ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. ఈసందర్భంగా అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.సమీనా తబస్సుం మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందించిన సేవలను గుర్తించి ఏఖీన్‌పూర్ సీహెచ్‌సీ ఎన్‌క్వాస్‌కు ఎంపికైందన్నారు. ఎన్‌క్వాస్ నిధులతో ఆసుపత్రుల్లో వసతులు మరింతగా మెరుగుపడతాయని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దోహదపడుతుందన్నారు.

# సన్నబియ్యం.. తినేందుకు సిద్ధం

భగత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యానికి జనం నుంచి మంచి స్పందన వచ్చింది. గత నెల వరకు దొడ్డుబియ్యం కారణంగా అధిక మంది తీసుకోకపోయేవారు. ఈ నెలలో మొదటి రోజు నుంచి రేషన్ దుకాణాల వద్ద బారులుదీరారు. ఇలా జిల్లాలో అధిక మంది లబ్ధిదారులు తీసుకెళ్లడం విశేషం. గత మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో 363.90 మెట్రిక్ టన్నులు ఎక్కువ మంది తీసుకెళ్లారు.

**95 శాతానికి చేరిన లబ్ధిదారుల హాజరు..**

గత నెల వరకు రేషన్ దుకాణాల్లో దొడ్డువి ఇవ్వడంతో.. వాటిని తీసుకున్న తర్వాత రూ.10–13 చొప్పున బయట విక్రయించేవారు. బయట సన్నరకాలు కొనుక్కొనేవారు. ఇది పరోక్షంగా లబ్ధిదారులకు ఆర్థిక భారంగా మారింది. తీసుకున్న వారిలో కేవలం 20 శాతం మంది మాత్రమే తినేవారు. ప్రజలకు పంపిణీ చేస్తున్నా పక్కదారి పటడంతో ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్నవి ఇవ్వడం మొదలుపెట్టింది. మొత్తం రేషన్‌లో 95 శాతం పంపిణీ జరిగినట్లు అధికారులు తెలిపారు.

**రెండో కోటాలో నాణ్యత అంతంతే?**

మొదటి కోటా కింద రేషన్ దుకాణాలకు పంపిణీ చేసిన సన్నబియ్యం నాణ్యత మెరుగ్గా ఉందని లబ్ధిదారులు తెలిపారు. కానీ రెండో కోటా కింద నాణ్యత అంత బాగాలేదన్నారు. మొదటి దఫాలో సన్నరకంతో పాటు నూక తక్కువ ఉందని, రెండో దఫాలు మధ్యస్థ రకంతోపాటు నూక ఎక్కువ ఉందని పేర్కొన్నారు. నాణ్యమైనవి పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

**కొన్ని చోట్ల తూకంలో తేడా..**

ఇన్నాళ్లు దొడ్డు బియ్యం కొంటూ దందా చేసిన కొందరు డీలర్లకు సన్నవి విక్రయించేవారు కరవు అయ్యారు. కొందరు ఎలక్ట్రానిక్



కాంటాల్లో ముందే సెట్టింగ్ చేసి పెడుతుండగా.. మరికొందరు గోనె సంచితో తూకం వేస్తుండటంతో ఒక్కో లబ్ధిదారుకు 400 గ్రాములు తక్కువ వస్తోంది.

**మాలాంటి వారికి మేలు**

సన్న బియ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. గతంలో పంపిణీ చేసిన దొడ్డువి తినాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు ఇచ్చిన వాటిని వండుకొని తింటున్నాం. మా కుటుంబానికి ఆర్థికంగా లబ్ధి చేకూరింది. ఈ విధానం ఎప్పుడూ కొనసాగించాలి. నాణ్యమైనవి పంపిణీ చేయాలి.పొలవేని సత్యం, లబ్ధిదారుడు

జిల్లాలో వివరాలు..
రేషన్ దుకాణాలు :566
ఆహార భద్రతకార్డులు : 2,61,273
అంత్యోదయ : 15,722
అన్నపూర్ణ : 35
లబ్ధిదారులు :8,09,906
పంపిణీ ఇలా...
మార్చిలో దొడ్డువి : 4794.482 మె.ట
ఏప్రిల్‌లో సన్నవి : 5158.384 మె.ట

చురకలు



# నీరు నిలుపు.. సాగుకు మలుపు

తాండూరు : తాండూరు శివారులోని కాగ్నా నదికి వరదలొచ్చినప్పుడు ఆనకట్టలు లేక నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోయేది. కళ్లముందే పొలాలకు పారాల్సిన నీరు ఇలా నేలపాలవుతుంటే రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యేవారు. అడ్డుకట్టలు కడితే కొంతమేరకైనా వృథాను అరికట్టవచ్చని నీరు నిలిచి పొలాలకు పారించి పంటలు పండించుకోవచ్చని రైతులు అధికారులకు పదేపదే విన్నవించేవారు. ఎట్టకేలకు వారి కృషి ఫలించింది. తాజాగా వరద నీరు వృథాగా పోకుండా అధికారులు ఆనకట్టలు నిర్మిస్తున్నారు.

రూ.10 కోట్లవ్యయం: ఇప్పటికే నదిలో దిగువ, ఎగువ రెండు ఆనకట్టల్ని నిర్మించారు. రూ.10 కోట్ల వ్యయంతో కొత్తగా కట్టలు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో కురిసే వానకు నదిలోకి భారీగా వచ్చే వరద నీరు వృథాగా అటుఇటూ వెళ్లకుండా మరో కట్టను నిర్మిస్తున్నారు. తాండూరు– కొడంగల్ మార్గంలోని వంతెనకు ఎగువన కొత్తగా నిర్మించిన ఆనటక్ట వద్ద వరద నీరు నిల్వటానికి అధికారులు రెండు వైపులా మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. వరద నీరు వచ్చినప్పుడు ఇది వరకు నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్తూ పంట పొలాలను దెబ్బతీసేది. నదికి రెండు వైపులా కట్టలు ఏర్పాటు చేస్తుండటంతో



వరద నీరు ఆనకట్ట వద్దే నిల్వ ఉంటుంది.

**కొడంగల్‌కు మెరుగైన తాగునీటి సరఫరా..**

ఇక్కడి ఆనకట్ట నుంచే కొడంగల్ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా మరింత మెరుగు కోసం ఆనకట్టకు రెండు వైపులా రెండు కిలో మీటర్ల పొడవునా కొత్తగా మట్టి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షా కాలం నాటికి పూర్తి చేసే విధంగా వేగంగా చేస్తున్నారు. నదిలోని మట్టినే తీసి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నది మధ%రి%్యలో ఆనకట్ట, రెండు వైపులా మట్టి కట్టలతో వరద నీరు భారీగా నిల్వ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

# పశుపోషకులకు బాసట

చొప్పదండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, చేపల కొలనుతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

**నాలుగు పశువులు ఉంటేనే..**

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులను కలిగి ఉంటేనే షెడ్ల నిర్మాణానికి అనుమతినిస్తారు. పశువుల షెడ్డుతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి



అనుమతినివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

**రూ.లక్ష వరకు కేటాయింపు**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 926 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటివరకు 336 నిర్మించారు. మిగతావి ప్రగతిలో ఉన్నాయి. ఈనెలాఖరు వరకు వీటన్నింటిని పూర్తి చేసేలా ఉపాధిహామీ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్**

పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 లోగా వీలైనన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇవి పాడి రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

# సన్నబియంతో సంతృప్తికరంగా భోజనం..!

కొత్తగూడెం: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది (ఈనెల 30) నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారుకు ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇకపై వీటి స్థానంలో సన్నబియ్యం అందించనున్నారు. రైతుల నుంచి కొన్న సన్నధాన్యాన్ని మరపట్టించి తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అక్రమాలకు అడ్డుకట్ట.. ఇన్నాళ్లు 'రేషన్' లబ్ధిదారులకు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. అయితే అందులో ఎక్కువ శాతం మంది వాటిని తినలేక దళారులకు విక్రయించటంతో పథకం లక్ష్యం నీరుగారేది. లబ్ధిదారులు మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వాటి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈనేపథ్యంలో రేషన్‌కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. **ఏడు లక్షల కార్డులు.. 11వేల మె.ట. బియ్యం**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7,05,950 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ప్రతినెలా సుమారు 11వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు, పాతకార్డుల్లో పేర్లు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్‌లో కొత్తకార్డులు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదే జరిగితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బియ్యం కోటా పెంచాల్సి ఉంటుంది. సుమారు 60 నుంచి 70వేల వరకు కార్డులు, 3లక్షల వరకు యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున కనీసం 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా కావాలి.

# సిండికేట్.. కాదంటే వేటు



హైదరాబాద్: ఖైరతాబాద్ జోన్ పరిధిలో డ్రైవర్లు, ఇతర ఒప్పంద కార్మికుల సరఫరా కోసం పిలిచిన టెండర్లలో ఇద్దరు మాత్రమే గుత్తేదారులు పాల్గొన్నారు. అందులో ఒకరి టెండర్‌పై అనర్హత వేటు వేశారు. టర్నోవర్ 200శాతం లేదని నిరాకరించారు. ఇక మిగిలింది ఒకే ఒక్క టెండర్. దాన్ని 4.8శాతానికి ఆమోదించారు. ఒకే ఒక్క టెండర్ మిగిలితే రీకాల్ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఈ ఒక్క జోన్‌లోనే అయిదు టెండర్లను ఆమోదించడం విశేషం.

**అది అక్కడ ఆనవాయితీ**

జీహెచ్ఎంసీలో ఒప్పంద ఉద్యోగులు, కార్మికుల సరఫరా టెండర్లలో గుత్తేదారులు సిండికేట్‌గా మారితే సరి.. లేకపోతే పోటీదారులపై అనర్హత వేటు వేసి టెండర్లను అప్పగించడం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాదికి పిలిచిన టెండర్లన్నీ దాదాపు ఇదే విధంగా జరిగాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు.. ఆరుజోన్ల పరిధిలో దాదాపు 25వేల మంది ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. అన్ని విభాగాలు కలిపి 350 టెండర్లను జోన్లలో పిలిచారు. ఇప్పటికే 300 టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అన్నీ సిండికేట్‌కే దక్కాయి. వీటిలో 80శాతం టెండర్లను సింగిల్ టెండర్ ఆమోదించారు. అన్నీ 4.5శాతం నుంచి 4.9శాతానికి దక్కించుకున్నవే కావడం విశేషం. ఇటీవల ఒప్పంద కార్మికుల సరఫరా టెండర్లలో అక్రమాలను 'ఈనాడు' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కేవలం దక్షిణ మండల కార్యాలయం పరిధిలో మాత్రం నిబంధనలను సవరించారు. మిగిలిన అన్నింటిలోనూ ఏకపక్షంగా ఆమోదించేశారు. ఇంకా 50 టెండర్ల వరకు ఆమోదించాల్సి ఉంది.

**ఏళ్ల తరబడి వారే..**

జీహెచ్ఎంసీ పరిధిలో ఒప్పంద ఉద్యోగుల సరఫరా టెండర్లను ఏళ్ల తరబడి ఒకే గుత్తేదారు సొంతం చేసుకుంటున్నారు. గతంలో ప్రజాప్రతినిధిగా చేసిన ఓ నేత అనుచరులకే 50శాతం టెండర్లను దక్కించుకున్నారు. వాస్తవానికి మానవ వనరులను సరఫరా చేసే ఏ గుత్తేదారు అయినా అర్హులే. జీహెచ్ఎంసీలో మాత్రం ఆయా ప్రత్యేక విభాగాల్లో అనుభవం ఉన్నవారే అర్హులుగా పేర్కొంటున్నారు. ఇలా పాత వారికే టెండర్లు దక్కేలా చక్రం తిప్పారు.

**మాయాజాలం**

ఒప్పంద ఉద్యోగుల సరఫరాలో మస్టర్ల మాయాజాలం గుత్తేదారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. టెండర్లను దక్కించుకునేందుకే 1.50శాతం వరకు అధికారులకు కమీషన్లు ఇస్తున్నారు. ఇక నేతలకు మామూళ్లు సరేసరి. లేని కార్మికులను ఉన్నట్లు చూపించి వేతనాలు స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. బయోమెట్రిక్ విధానం, ముఖగుర్తింపు హాజరు.. ఇవన్నీ పక్కదోవ పట్టిస్తున్నారు. ఇన్ని అక్రమాలకు నిలయంగా మారిన ఒప్పంద ఉద్యోగుల, కార్మికుల సరఫరా టెండర్లలో ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

# జీతమెప్పుడు వస్తుంది?



వీర్నపల్లి : పల్లెల్లో వలసలను తగ్గించి స్థానికంగా ఉపాధి కల్పించాలన్న గొప్ప లక్ష్యంతో ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. గ్రామాల్లో పని గుర్తింపు మొదలు కూలీలకు వేతనాల చెల్లింపు వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఈజీఎస్ సిబ్బంది పాత్ర కీలకం. ముఖ్య పాత్ర పోషిస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతన బకాయిలతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారింది. నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కలిగి ప్రభుత్వ విభాగాల్లో, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒకటి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏపీవోలు, ఇంజినీర్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతోపాటు కార్యాలయ సిబ్బంది కలిసి మొత్తం 248 మంది ఉన్నారు. ఆర్థిక సంవత్సరం మొదలు నుంచి ముగింపు వరకు జాబ్‌కార్డులున్న కూలీలకు పని కల్పనా లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో పని గుర్తింపుతోపాటు అనుమతులు, తీర్మానాలు చేయడంతోపాటు ఉపాధి పని ప్రదేశంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా సేవలు అందేలా పర్యవేక్షణ చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా క్షేత్ర సహాయకులు పాత్ర కీలకం. పని ప్రదేశంలో కూలీల హాజరు, చిత్రాలు తీసి సంబంధిత యాప్‌లో నిక్షిప్తం చేస్తుంటారు. సాంకేతిక సహాయకుల జీతాలు సకాలంలో విడుదలవుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. కానీ క్షేత్ర సహాయకులకు సంబంధించి జనవరి నుంచి వేతనాలు బకాయిలు ఉన్నాయి. మిగితా సిబ్బంది రెండునెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ నుంచి పీడీ వరకు వేతనాలు విడుదల కాలేదు.

**అప్పులు చేయాల్సి వస్తోంది**

ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నా కూలీలకు పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. జనవరి నుంచి జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చాలామంది క్షేత్ర సహాయకులు, ఈజీఎస్ సిబ్బంది ఇంటి అద్దె చెల్లింపు, నిత్యావసర సరకులు కొనుగోలు చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. సకాలంలో వేతనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రాజునాయక్, క్షేత్ర సహాయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

**ప్రభుత్వం దృష్టిలో..**

ఈజీఎస్‌లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. కేంద్రం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. రాగానే వారి ఖాతాల్లో జమ అవుతాయి. శేషాద్రి, డీఆర్డీవో


జిల్లాలో ఉపాధిహామీ వివరాలు

గ్రామ పంచాయతీలు :260
ఉపాధి హామీ కార్డులు :98133
నమోదైన కూలీలు :199721
సాంకేతిక సహాయకులు :34
క్షేత్రసహాయకులు :153
ఏపీవోలు :9 ఈసీఎస్‌లు :5
సీవోఎస్‌లు :19

# యంత్రంలోనే గుట్టు.. నకిలీ టిక్కెట్లు

హైదరాబాద్: ఆలయాల్లో నకిలీ టిక్కెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) యంత్రాల్లో సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుంటూ సిబ్బంది 'డబుల్ నంబర్ టిక్కెట్ల'తో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. టిక్కెట్లను 'రీప్రింట్' చేస్తూ ఆ డబ్బును జేబులో వేసుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో ఈ వ్యవహారం వెలుగు చూడగా.. అంతకు ముందు కొమురవెల్లిలో వీఐపీ టిక్కెట్ల విక్రయాలు, బాసర ఆలయంలో లడ్డూ టిక్కెట్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. 2023లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఒకే రోజు రూ.3వేలు జేబులో వేసుకొని ఇద్దరు ఉద్యోగులు దొరికిపోయారు. వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేయడంతోపాటు పదోన్నతులు కల్పించారన్న ఆరోపణలున్నాయి.

**సాంకేతిక లోపాలు..** రాజధానిలోని ప్రముఖ దేవాలయాల్లో రోజూ సగటున 3వేల మంది, ప్రత్యేక రోజుల్లో 15వేల మంది భక్తులు వస్తుంటారు. పలురకాల అర్చనలతో పాటు ప్రసాదాలకు పీవోఎస్ యంత్రాల ద్వారా టిక్కెట్లు విక్రయిస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో, సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు ఒకే నంబర్‌తో రెండు టిక్కెట్లు ప్రింట్ అవుతున్నాయి. యంత్రంలో అమర్చే కాగితం అయిపోయే సమయంలోనూ ఇలా జరుగుతోంది. ఈ పరిస్థితితో కొందరు ఉద్యోగులు నకిలీ టిక్కెట్ల దందాకు తెరలేపుతున్నారు. రోజూ 50 నుంచి 100 టిక్కెట్లు జేబులో వేసుకున్నా.. నెలలో లక్షల రూపాయలు ఆలయ ఆదాయానికి గండికొట్టినట్టే. బల్కంపేట ఆలయంలో జనవరి 12న జరిగిన ఘటనను పరిశీలిస్తే...ఉద్యోగి రూ.31,550 కాజేసినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నారు.



**థర్మల్ ప్రింటర్లు వినియోగిస్తే...**తాజా ఉదంతాలతోనూ కొన్ని ఆలయాల అధికారులు కళ్లు తెరవలేదు. ఇప్పటికీ పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాలనే వినియోగిస్తూ టిక్కెట్లు జారీ చేస్తున్నారు. వీటి స్థానంలో థర్మల్ ప్రింటర్లు వినియోగిస్తే డూప్లికేట్ నంబర్ల సమస్య ఉండదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధునాతన సాంకేతికతతో పనిచేసే యంత్రాలను కొనుగోలు చేయాలంటే ఒక్కో ఆలయానికి రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని ఈవోలు చెబుతున్నారు.

# ట్యాంకర్లు.. నిబంధనలకు నీళ్లు

హైదరాబాద్ : కాచిగూడలో అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఐటీ ఉద్యోగి అక్కడికక్కడే మరణించాడు. షేక్‌పేట్ సమీపంలో అపసవ్యదశలో వచ్చిన ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. అక్కడ చేరిన కొందరు ఆటోడ్రైవర్‌ను బెదిరించి వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను అక్కడ నుంచి తప్పించారు. శేరిలింగంపల్లిలోని అపార్ట్‌మెంట్‌కు మురుగు నీరు సరఫరా చేసిన ట్యాంకర్ డ్రైవర్ నిలదీసిన వారిపైనే దౌర్జన్యానికి దిగినట్టు సమాచారం.

అడ్డూ అదుపు లేకుండా దూసుకెళ్తున్న వాటర్ ట్యాంకర్లు వాహనదారుల వెన్నులో వణకు పుట్టిస్తున్నాయి. తాగునీటి వాహనం వస్తుందంటే దారెంట ప్రయాణించేందుకు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటడం, తాగునీరు చాలకపోవటంతో నగర పౌరులు ప్రత్యామ్నాయంపై ఆధాపడుతున్నారు. ఇదే అదనుగా సొమ్ము చేసుకునేందుకు వేలాది వాటర్ ట్యాంకర్లు బయటకొస్తున్నాయి. వీలైనంత ఎక్కువ ట్రిప్పులు తిరిగేందుకు డ్రైవర్లు ఇష్టానుసారం నడుపుతున్నారు. నెల వ్యవధిలోనే 15 రోడ్డు ప్రమాదాలకు ప్రైవేటు వాటర్ ట్యాంకర్లు కారణంగా పోలీసులు గుర్తించారు. 10 మంది గాయాలపాలవ్వగా, ముగ్గురు మృత్యువాతపడ్డారు. నీటి సరఫరా చేస్తున్నాయనే ఉద్దేశంతో అధికారులు చూసీచూడనట్టు వదిలేయటం



సామాన్యుల ప్రాణాలతో చెలగాటంగా మారింది.

**దూసుకొస్తున్నాయ్.. ప్రాణాలు తీస్తున్నాయ్**

అతివేగం, అనుభవలేమితో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు అమాయకుల ప్రాణాలు బలితీసుకుంటున్నారు. నారాయణగూడ సమీపంలో జలమండలి వాటర్ ట్యాంకర్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న కార్పెంటర్‌జగన్నాథంచారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. మియాపూర్‌లో పని ముగించుకొని నడుచుకుంటూ వెళ్తున్న మాల్యాద్రి అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొని చనిపోయారు. కూకట్‌పల్లిలో ప్రైవేటు వసతి గృహంలోకి వాటర్ ట్యాంకర్ దూసుకెళ్లింది. ప్రహరీని ఢీకొట్టి ఆగిపోయింది. నిబంధనల విరుద్ధంగా నడిచే ట్యాంకర్లు, లైసెన్స్ లేని డ్రైవర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

**మైనర్లే డ్రైవర్లు.. నంబర్‌ప్లేట్ కనిపించదు**

వేసవి వచ్చిందంటే తాగునీటి కటకట. రోజువారీ నీటి అవసరాలకు జనం ఇబ్బంది పడుతుంటారు. ఈ ఏడాది ముందుగా నీటి ఇబ్బందులు తలెత్తటంతో వాటర్ ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శివారు ప్రాంతాల్లో వందలాది బోర్లు పుట్టుకొచ్చాయి. రేయింబవళ్లు వాటి నుంచి యథేచ్ఛగా నీరుతోడి నిల్వ చేస్తున్నారు. నగరంలో సుమారు 1000 జలమండలి, సుమారు 5–6వేలకు పైగా ప్రైవేటు ట్యాంకర్లు ఉన్నట్టు అంచనా. నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలకు రంగులు వేసి నడుపుతున్నారు. పాతటైర్లు, మరమ్మతుకు నోచుకోని బండ్లు కావటంతో బ్రేక్ విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రిళ్లు తిరిగే చాలా ట్యాంకర్లు నంబర్ ప్లేట్ లేకుండానే తిరగటం ఆందోళన కలిగిస్తోంది. జలమండలి ఆధ్వర్యంలోని వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు కొందరు మైనర్లకు స్టీరింగ్ అప్పగించి వారు విశ్రాంతి తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రైవేటు పరిస్థితి మరీ ఘోరంగా మారింది.

# తుది దశకు బైపాస్ నిర్మాణం

పెద్దపల్లి: కాజీపేట నుంచి కరీంనగర్‌కు నేరుగా వెళ్లేందుకు పెద్దపల్లి వద్ద నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఉగాది పర్వదినం కంటే ముందే పూర్తి చేసేందుకు పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు పెద్దపల్లి, కొలనూరు నుంచి బైపాస్ మార్గంలోని క్యాబిన్‌తో ఇంటర్‌లాకింగ్ పనులతో పాటు కమీషనింగ్ పనులు పూర్తి చేయనున్నారు. బైపాస్ మార్గంలో లూప్‌లైన్(రెండో లైన్) నిర్మాణానికి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ పనులు కూడా ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి గూడ్స్ రైళ్లను మాత్రమే బైపాస్ మీదుగా మళ్లించనున్నారు. ప్రయాణికుల రైళ్లను తప్పనిసరిగా పెద్దపల్లి స్టేషన్ మీదుగానే నడుపుతారు.

**స్టేషన్‌పై తగ్గనున్న ఒత్తిడి**

బైపాస్ లైన్ నిర్మాణంతో పెద్దపల్లి ప్రధాన స్టేషన్‌పై ఒత్తిడి తగ్గనుంది. బైపాస్ మార్గంలో నిర్మించిన క్యాబిన్ ద్వారానే అక్కడి స్టేషన్ మాస్టర్ రైళ్ల నిర్వహణ బాధ్యతను నిర్వహిస్తారు. ఈ రైలు మార్గాన్ని రైల్వే శాఖ రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గం హుస్సేన్‌మియా వాగు వంతెన సమీపం నుంచి చీకురాయి రైల్వే గేటు రంగంపల్లి వద్ద ప్రస్తుత కరీంనగర్ రైలు మార్గానికి అనుసంధానమవుతుంది. ఈ మార్గం పూర్తయితే కరీంనగర్ వైపు నుంచి వెళ్లే గూడ్స్ రైళ్లు పెద్దపల్లి స్టేషన్‌కు వెళ్లకుండా నేరుగా కాజీపేట, వరంగల్ వైపు వెళ్తాయి. పెద్దపల్లి వైపు నుంచి కరీంనగర్ వెళ్లే రైళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, కాజీపేట, వరంగల్ వైపు నుంచి వచ్చే రైళ్లు కరీంనగర్ వెళ్లాలంటే పెద్దపల్లి స్టేషన్‌లో ఇంజిన్ మార్చుకోవాల్సి వస్తుంది. దీనికే అధికంగా సమయం పట్టనుంది.

**చొరవ చూపితేనే కొత్త రైళ్లు**నిజామాబాద్ నుంచి హైదరాబాద్, ముంబయి మినహా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా సికింద్రాబాద్ మీదుగా ప్రయాణించాల్సిందే. కరీంనగర్ నుంచి తిరుపతికి మినహా మరే దూర ప్రాంతానికి రైళ్లు లేవు. రెండు జిల్లా కేంద్రాల మీదుగా దిల్లీ, చెన్నై లాంటి ప్రాంతాలకు కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఇద్దరు ఎంపీలు చొరవ చూపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంపీ అరవింద్ నిజామాబాద్ నుంచి దిల్లీకి కొత్త రైలు కోసం ప్రతిపాదించారు. విజయవాడ, విశాఖపట్టణం, చెన్నై, బెంగళూర్ వైపు కొత్త రైళ్లను నడిపించేందుకు ఆయనతో పాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవ చూపాల్సి ఉంది.

# అత్యంత నాణ్యత.. అత్యున్నత ప్రమాణాలు

హైదరాబాద్: మురుగు జలాల శుద్ధి సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో జీరో బ్యాక్టీరియా మురుగు శుద్ధి విధానం పరిష్కారంగా మారనుంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఐఐఎస్‌సీ) అభివృద్ధి చేసిన విధానంతో మురుగు నీటిని అత్యున్నత ప్రమాణాలతో అత్యంత నాణ్యతతో శుద్ధి చేసి సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**జీరో బ్యాక్టీరియా..**

ఈ విధానంలో ఉపయోగించే సిల్వర్ నానోపార్టికల్ పూతలతో బ్యాక్టీరియా కణత్వచాలకు అంతరాయం కలిగించి వాటి మరణానికి కారణమవుతాయి. రేడియేషన్ బ్యాక్టీరియా వృద్ధికి అవకాశం లేకుండా చేస్తుంది. ఎలెక్ట్రోస్ట్రాటిక్ ఫిల్టరేషన్ విధానంలో ఉపయోగించే ఫిల్టర్లు బ్యాక్టీరియాను ఆకర్షించేలా చేస్తాయి. ప్రత్యేక వడపోత వ్యవస్థల్లో యాంటీ మైక్రోబయల్‌తో నింపి ఉండే సూక్ష్మరంధ్రాల ఫిల్టర్‌ల



వినియోగం బ్యాక్టీరియాను తొలగిస్తుంది. పునర్వినియోగానికి ఇది దోహదపడనుంది.

**నగరంలో అధ్యయనం**

జలమండలి పరిధిలో ప్రస్తుతం 1950 ఎంఎల్‌డీల మురుగునీరు ఏర్పడుతోంది. పాత ఎస్టీపీల్లో 772 ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి అవుతుండగా మరో 653 ఎంఎల్‌డీల మురుగునీటి శుద్ధి ప్లాంట్లు కొత్తగా ఏర్పాటు చేశారు. ఐఐఎస్‌సీ అభివృద్ధి చేసిన జీరో బ్యాక్టీరియా విధానం మెరుగైన ఫలితాలను ఇస్తుందని జలమండలి భావిస్తోంది. ఈ మురుగునీటి శుద్ధి విధానాన్ని పరిశీలించి అవసరమైతే ఇక్కడ కూడా వినియోగించుకుంటామని జలమండలి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

**బెంగళూరులో వినియోగంపై కార్యాచరణ**బెంగళూరు జలమండలి పరిధిలోని ఎస్టీపీలు, అపార్ట్‌మెంట్‌లు, గేటెట్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన మురుగునీటి నాణ్యతను ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన జీరో బ్యాక్టీరియా సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసేందుకు బెంగళూరు జలమండలి కార్యాచరణ రూపొంది స్తోంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న సంప్రదాయ ద్వితీయ ట్రీట్‌మె ంట్ విధానంతో పోలిస్తే కొత్త విధానం నాణ్యమైన నీటిని ఉత్పత్తి చేస్తుంది.

# కర్షకులకు.. కడగండ్లు

పెద్దేముల్ : కోట్‌పల్లి ప్రాజెక్టు జిల్లాకే మణిహారం. దశబ్దాలుగా పెద్దేముల్, ధారూర్ మండలాల్లోని వేలాది ఎకరాలను సాగుచేసే 18 గ్రామాల రైతులకు పెద్ద దిక్కుగా ఉండేది. రబీ సీజన్‌లో ఈ ప్రాంతం అంతా పచ్చని పంట పొలాలతో కళకళలాడేది. ఏళ్లుగా కాలువలకు మరమ్మతులు లేకపోవడంతో పలుచోట్ల గండ్లు పడ్డాయి. కుడి, ఎడమ కాలువలు పూడిక నిండి పిచ్చిమొక్కలు పెరిగి నీరందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో జలాశయం కింద వరిసాగు చేసిన ఆయకట్టు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

**నీరంతా వాగుపాలు**

ప్రాజెక్టు నుంచి 15 కిలో మీటర్ల దూరంలో గల బండపల్లి, జనగాం, మంబాపూరు రైతులు రాత్రీ పగలు పొలాల వద్దే ఉంటూ నీటి తడులు పెట్టుకుంటున్నారు. ప్రాజెక్టు నుంచి కుడి కాల్వ 24 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. చాలా చోట్ల గండ్లు పడి నీరు రావడం లేదు. గొలుసుకట్ట విధానంలో ప్రాజెక్టు ప్రధాన కాల్వల మధ్య చెరువులు కట్టారు. గండ్ల కారణంగా చెరువుల్లోకి నీరు చేరడం లేదు.

ఈ రైతు పేరు బాల్‌రాజ్, జనగాం గ్రామం. కోట్‌పల్లి ప్రాజెక్టు కింద ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ప్రాజెక్టు నీరు వచ్చే పరిస్థితి లేదు. పంటను కాపాడుకునేందుకు రూ.1.5 లక్షలు ఖర్చు చేసి రెండు బోర్లు వేయించాడు. తక్కువ నీరు పడింది. భార్యాభర్తలు రాత్రీ పగలు పొలం వద్దే ఉంటూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ మహిళ రైతు పేరు భీమని నర్సమ్మ. జనగాం గ్రామం. కోటిపల్లి ప్రాజెక్టు ఆయకట్టు కింద నాలుగు ఎకరాల భూమి ఉంది. ఎకరంలో వరి సాగు చేస్తున్నారు. కాల్వల నుంచి నీరు రాకపోవడంతో రూ.2



లక్షలు పెట్టి బోరు వేస్తే 400 మీటర్ల లోతులో అంగుళం నీరు పడింది. ఆ నీటితో కోడలు, కూతురుతో కలిసి పంటను రక్షించుకుంటున్నారు.

**ప్రాజెక్టు వివరాలు**

జలాశయం పేరు: కోట్‌పల్లి
ఆయకట్టు: 9,200 ఎకరాలు
నీరందే ఆయకట్టు: 4 వేల ఎకరాలు
ప్రస్తుతం వరిసాగు: 3,000 ఎకరాలు
కాల్వల పరిస్థితి: అస్తవ్యస్తం, అధ్వాన్నం
నీటి నిల్వ సామర్థ్యం: 1.5 టీఎంసీలు (24 అడుగులు)
లబ్ధి పొందే గ్రామాలు: పెద్దేముల్, ధారూరు మండలాల్లోని 18 గ్రామాలు
కుడి కాలువ పొడవు: 24.14 కి.మీ.
ఎడమ : 11.6 కి.మీ.
బేబి కాలువ : 2.6 కి.మీ.

# అది ఆట కాదు.. కన్నీటి గాథ



హైదరాబాద్ : బెట్టింగ్ యాప్‌లు యువత ఉసురు తీస్తున్నాయి. ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. సినీ, టీవీ తారలు, సామాజిక సేవకుల ముసుగులో ఇన్‌ఫ్లుయెన్సర్లు బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తున్నారు. ఇంట్లో కూర్చొని రూ.లక్షలు సంపాదించామని నోట్ల కట్టలను చూపుతూ వీడియోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. వీటికి ఆకర్షితులై ఎంతోమంది అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆడుతున్నారు. కొందరు రుణ యాప్‌లను ఆశ్రయించి ఆ ఉచ్చులో చిక్కుతున్నారు. చివరికి అసలు, వడ్డీ చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గ్రేటర్ పరిధిలో రెండేళ్లలో సుమారు 10 మంది బెట్టింగ్ ఉచ్చులో పడి బలవన్మరణం చెందినట్లు అంచనా. ఆయా కుటుంబాలు బిడ్డల జ్ఞాపకాలతో కాలం వెళ్లదీస్తున్నాయి. ఎవరిని కదిలించినా కన్నీళ్లు ఉబికివస్తున్నాయి.

**కడుపుకోత మిగిల్చాడు**

బాలానగర్ వినాయకనగర్‌కు చెందిన డి.తరుణ్‌రెడ్డి(21) బీటెక్ పూర్తి చేశాడు. ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. ప్రముఖ వర్సిటీలో సీటు సంపాదించాడు. ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తుండగా రూ.6 లక్షల ప్యాకేజీతో కొలువు లభించింది. తల్లిదండ్రులు పొంగిపోయారు. ఇంజినీరింగ్ చదివేటప్పుడు సరదాగా మొదలైన ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటుగా మారాయి. రెండేళ్లుగా పందేలు కాసేందుకు క్రెడిట్ కార్డుతో రూ.3 లక్షలు.. వ్యక్తిగత రుణం రూ.4 లక్షలు తీసుకొని నష్టపోయాడు. అప్పులన్నీ తీర్చిన తండ్రి కొడుకుని సున్నితంగా మందలించాడు. గతేడాది డిసెంబర్‌లో అప్పులు తీరగానే.. ఈ ఏడాది జనవరి 13న బెట్టింగ్‌లతో క్రెడిట్ కార్డుతో రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు తెలిసేలోగా.. జనవరి 22న ఉరేసుకున్నాడు.

**చితికిపోయి.. కొడుకుని కోల్పోయి**

గుడిమల్కాపూర్‌కు చెందిన బాలకృష్ణ కుమారుడు శీలం మనోజ్ గతేడాది దుండిగల్‌లోని కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నప్పుడు ఆన్‌లైన్ బెట్టింగులకు దగ్గరయ్యాడు. సులువుగా డబ్బు సంపాదించవచ్చంటూ మనోజ్‌ను రొంపిలోకి లాగారు. రుణయాప్‌లు, ఇతర మార్గాల్లో అప్పులు చేశాడు. సొమ్మంతా నష్టపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. నెల వాయిదాలు చెల్లించట్లేదంటూ ఒత్తిడి చేయడం.. అప్పుల విషయం బయటకు తెలిస్తే బంధువుల్లో పరువు పోతుందని భావించాడు. మనస్తాపంతో గతేడాది ఫిబ్రవరి 26న ఉరేసుకొని చనిపోయాడు. మనోజ్ చేసిన రూ.5 లక్షల అప్పును తండ్రే తీర్చాడు. ఆర్థికంగా చితికిపోయి.. కొడుకును కోల్పోయి తల్లిదండ్రులు కన్నీటి మధ్య జీవనం సాగిస్తున్నారు. ఎదిగిన బిడ్డలు చేసిన తప్పులు కన్నవారిని మనోవేదనకు గురిచేస్తాయని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

**బిడ్డకు దూరమై కోలుకోలేని తల్లి**

తల్లితో సాయికిరణ్ చివరి పుట్టిన రోజు

ఎదిరే కొమరయ్య, లక్ష్మి దంపతులు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోచమ్మబస్తీలో ఉంటారు. సాయికిరణ్(21) ఏకైక సంతానం. తల్లి కూలీకెళుతూ.. తండ్రి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. కుమారుడిని నారాయణగూడలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీలో చేర్చారు. రూ.1.50 లక్షల బైక్ కొనిచ్చారు. ఏడాది క్రితం స్నేహితుల ప్రభావంతో బెట్టింగ్ యాప్‌లకు దగ్గరయ్యాడు. రూ.2 లక్షలు అప్పు చేశాడు. బైక్ వాయిదాలు సక్రమంగా చెల్లించలేదు. తప్పటడుగు వేశాడని గ్రహించిన తల్లిదండ్రులు రూ.రెండు లక్షల అప్పు తీర్చారు. బుద్ధిగా చదుకోమని చెప్పారు. బెట్టింగ్ వ్యసనంతో మరోసారి రూ.4.5 లక్షలు అప్పు చేశాడు. బైక్ తాకట్టు పెట్టాడు. చేసిన అప్పులు.. కన్నవారి మనోవేదన చూసి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుంగిపోయిన తల్లి మూడు నెలలుగా మంచానికే పరిమితమైంది. భార్య ఆలనాపాలనా చూస్తున్నాడు. అప్పులన్నీ తీరుస్తాం బిడ్డా.. నువ్వు ఆగం కావొద్దని చెప్పినా ఇట్లా చేసుకున్నాడని సాయికిరణ్ అమ్మమ్మ బాలమణి కన్నీరుమున్నీరయ్యారు.

# పెరగాలి జోన్లు.. కావాలి సిబ్బంది

హైదరాబాద్ : హెచ్‌ఎండీఏ ఒకేసారి 3 వేలపైనే చదరపు కిలోమీటర్ల వరకు పెరగడంతో సంస్థ కార్యకలాపాలను విస్తరించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పరిధి పెంపుతోనే సరిపెట్టకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే అందుకు అనువుగా అదనపు జోన్లు, భారీగా సిబ్బంది నియామకం తప్పనిసరి. ప్రస్తుతం శంషాబాద్, మేడ్చల్-1, మేడ్చల్-2, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, ఘట్‌కేసర్ జోన్లు ఉన్నాయి. ఆర్‌ఆర్‌ఆర్‌కు 2 కి.మీ.ల వరకు బఫర్ జోన్.. అటు ఇటు కిలోమీటరు మేర గ్రోత్‌కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. 2050 అవసరాల కోసం హెచ్‌ఎండీఏ బృహత్తర ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఇవన్నీ సమన్వయం చేయాలంటే కొత్త జోన్లు, అదనపు సిబ్బంది సేవలు కావాల్సిందే. ప్రస్తుతం ఉన్న ఆరు జోన్లను 10 నుంచి 12 వరకు పెంచాలని హెచ్‌ఎండీఏ యోచిస్తోంది. ఏటా కొత్త లేఅవుట్లు, భారీ అంతస్తుల నిర్మాణాల కోసం దరఖాస్తులు వస్తున్నాయి. మున్ముందు వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతి జోన్‌లో వివిధ రంగాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్‌లో భూ కేటాయింపులు ఉంటాయి. వాటికి అనుగుణంగా అనుమతులు జారీ చేస్తుంటారు.

**అనుమతుల్లో వేగం అవసరం**

స్థిరాస్తి రంగం పరుగులు పెట్టాలంటే అనుమతులు వేగవంతం కావాలి. సిబ్బంది కొరతతో తీవ్ర జాప్యం జరుగుతోంది. కీలకమైన జేపీవోలు, ఏపీవోలు సరిపడా లేరు. పరిధి పెంపు తర్వాత మరో 100-150 వరకు క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం. ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సైతం నత్తనడకన సాగుతోంది. ఆరు జోన్ల పరిధిలో 20-25 మంది వరకు పీవోలు, ఏపీవోలు ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

**హెచ్‌ఎండీఏ కొత్త స్వరూపం**

ప్రస్తుత పరిధి 7,257 చ.కి.లు
పెరగనున్న విస్తీర్ణం 10,472.723 చ.కి.లు
జిల్లాల సంఖ్య 11 (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్)
మండలాలు 104
గ్రామాల సంఖ్య 1355

# వికారాబాద్‌కు మహర్దశ..



వికారాబాద్: మహానగరం హైదరాబాద్‌ను సువిశాలం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ నూతనంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (హెచ్‌ఎంఆర్)కు రూపకల్పన చేసింది. వికారాబాద్ జిల్లాలోని 54 రెవెన్యూ గ్రామాలను హెచ్‌ఎంఆర్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పరిణామంతో ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ వరకే కేంద్రీకృతమైన అభివృద్ధి ఇతర ప్రాంతాలకు విస్తరించనుంది. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) వరకు పట్టణీకరణను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**స్థిరాస్తి వ్యాపారానికి ఊతం**

గత రెండేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం మందగించి భూముల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఐదు మండలాలు, 54 రెవెన్యూ గ్రామాలను హెచ్‌ఎంఆర్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వ తాజా నిర్ణయంతో మళ్లీ స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

**ఆర్‌ఆర్‌ఆర్‌కు ఇరువైపులా..**

బాహ్య వలయ రహదారికి ఇరు వైపులా పట్టణీకరణ ఎలాగైతే పెరిగిందో, అదే మాదిరిగా రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్‌ఆర్‌ఆర్‌కు బయటి వైపు ఐదు కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేసే బాధ్యతను మహా హైదరాబాద్ అప్పగించారు. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి జిల్లా పరిధిలోకి వచ్చే గ్రామాలను మహా హైదరాబాద్ పరిధిలోకి చేర్చి, ఈ పరిసర ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లా వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుందని పలువురు భావిస్తున్నారు.

**ఆ గ్రామాలు ఇవే..**

పూడూరు మండలంలోని 23, వికారాబాద్‌లో 13, నవాబుపేట 11, పరిగి 4, మోమిన్‌పేట మండల పరిధిలో 3 గ్రామాలు ఉన్నాయి. గెజిట్ విడుదల కాగానే మహా నగరం హైదరాబాద్ పరిధిలోకి వెళ్తాయి. అయితే పాలనాపరంగా వికారాబాద్ జిల్లాలోనే కొనసాగుతాయి.

పూడూరు: అంగడిచిట్టెంపల్లి, చెన్‌గొముల్, చీలాపూర్, చింతలపల్లి, కండ్లపల్లి, కెరవెల్లి, కడ్మూర్, కొత్తపల్లి, మంచన్‌పల్లి, ఎన్కెపల్లి, మన్నెగూడ, పూడూరు, సోమన్‌గుర్తి, మేడిపల్లికలాన్, మీర్జాపూర్, మిట్టకంకల్, నిజాంపేట్ మేడిపల్లి, పెద్దఉమ్మెంతాల్, కుత్బుల్లాపూర్, రేగడి మామిడిపల్లి, తిరుమలాపూర్, తుర్కఎన్కెపల్లి.

వికారాబాద్: బూర్గుపల్లి, సిద్దులూరు, సిద్దులూరు చించలం, సిద్దులూరు మునుగాల్, పాతూర్, పీరంపల్లి, పులుసుమామిడి, ధన్నారం, గిరిగిట్‌పల్లి, కొంపల్లి, గుడుపల్లి, మద్గుల్‌చిట్టెంపల్లి, వికారాబాద్.

నవాబుపేట: అక్నాపూర్, చించల్‌పేట, గంగ్యాడ, గుబ్బడిఫత్తేపూర్, లింగంపల్లి, మాదిరెడ్డిపల్లి, ముబారక్‌పూర్, నవాబుపేట, పూలపల్లి, పులుమామిడి, ఎల్లకొండ.

మోమిన్‌పేట: చక్రంపల్లి, చీమల్‌దరి, దేవరంపల్లి.

పరిగి: చిట్యాల్, మాదారం, రాపోల్, తొండపల్లి.

# కబ్జాకు కంచె

హైదరాబాద్: రాజధానిలో ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడేందుకు రెవెన్యూ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఆక్రమార్కులు ఖాళీ స్థలాల్లో టెంట్లు వేయడం, తప్పుడు పత్రాలు సృష్టించి రాత్రికి రాత్రే రేకుల షెడ్లు వేసి వాటి ఆధారంగా కోర్టులను ఆశ్రయించడం, వాటి తీర్పులు వచ్చేలోపు నిర్మాణాలు చేపట్టి ఇతరులకు విక్రయిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వినూత్న పంథాలో వెళ్లనున్నారు. బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న అనిశా ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 102/పీలో రూ.2 వేల కోట్ల విలువైన 12 ఎకరాల భూమి చుట్టూ రూ.35 లక్షలతో కంచె నిర్మించనున్నారు. చుట్టూ సీసీ కెమెరాలు, కొన్నిచోట్ల కంట్రోల్ ప్యానళ్లను ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు



ఉండటంతో కొందరు రియల్ వెంచర్ల ప్రతినిధులు, ప్రైవేటు వ్యక్తులు, రౌడీషీటర్లు, వారి అనుచరులు వాటిని ఆక్రమించేందుకు తరచూ ప్రయత్నాలు చేస్తున్నారు. నిజాం కాలం నాటి పత్రాలు సృష్టించి చుట్టూ కంచె వేసి ఈ భూమి ఫలానా వ్యక్తిది.. ఇక్కడ ఎవరైనా నిర్మాణాలు చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని వారే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

**గజం భూమీ వదలం... కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

రెవెన్యూ రికార్డుల్లో ఉన్న స్వల్ప లోపాల కారణంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు అక్రమార్కులు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు డిజిటల్ సాక్ష్యాలు, ఫోటోలు తీయించనున్నాం. రికార్డులు పక్కాగా కంప్యూటరీకరిస్తాం. యాప్‌లో నమోదు చేసి.. గజం భూమిని కూడా వదులుకోం. టౌన్, సర్వే రికార్డులను నవీకరించి వాటి సరిహద్దులను ఎలక్ట్రానిక్ ఫెన్సింగ్ ద్వారా ఏర్పాటు చేయనున్నాం.

# విలీనం.. వీడని సందిగ్ధం

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో విలీనమైన 12 పంచాయతీలపై సర్వే చేసిన నివేదిక దస్త్రాన్ని పురపాలకశాఖ అధికారులు ఇటీవల ప్రభుత్వానికి పంపారు. దీనిలో వేములవాడ పురపాలికలో 467 జనాభాతో విలీనమైన అయ్యోరుపల్లికి మాత్రమే తిరిగి పంచాయతీగా ఏర్పాటుకు ప్రభుత్వ వర్గాలు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా 11 పంచాయతీలపై స్పష్టత రాలేదు. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 83,500 జనాభా ఉంది. 2018లో విలీనమైన పెద్దూరు, సర్దాపూర్, చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు పంచాయతీలు కలుపుకుని మొత్తం లక్ష జనాభాకు చేరింది. దీంతో సిరిసిల్లను ద్వితీయశ్రేణి పురపాలికగా గుర్తించారు. అటు వేములవాడ పురపాలికలో విలీనమైన తిప్పాపూర్, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, నాంపల్లి, కోనాయిపల్లి పంచాయతీల కలుపుకుని 45 వేలకు చేరుకుంది. అయినా తృతీయశ్రేణి పురపాలికగానే కొనసాగుతోంది.



**అభివృద్ధి విస్తరిస్తుందని..**

పంచాయతీలు పురపాలికలో విలీనం చేయడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విరివిగా నిధులు సమకూరడంతో అభివృద్ధి విస్తరిస్తుందని అందరూ భావించారు. దీనిని కొన్ని గ్రామాల్లోని ప్రజలు వ్యతిరేకించారు. అప్పటికే పురపాలిక ఎన్నికలు రావడంతో యంత్రాంగం వార్డుల విభజన చేయగా ఎన్నికలు పూర్తయ్యాయి. తర్వాత పంచాయతీల్లోని రికార్డులను రెండు పురపాలికలు స్వాధీనం చేసుకున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విలీన పంచాయతీల విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. వేములవాడలో అయ్యోరుపల్లిని తిరిగి పంచాయతీగా ఏర్పాటు చేస్తానని విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దీనిపై సిరిసిల్ల, వేములవాడలో విలీన పంచాయతీలపై ప్రత్యేక బృందం అధ్యయనం చేసింది. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, జరుగుతున్న పనులపై నివేదికను ప్రభుత్వానికి అందించారు.

సిరిసిల్ల పురపాలికలో విలీనమైన పంచాయతీల్లోని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఎలా విలీనం చేస్తారని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దానికి అప్పటి ప్రభుత్వం నుంచి విలీన పల్లెల్లో పదేళ్ల వరకు అస్తిపన్నులు పెంచమని, విలీన పల్లెల్లో అభివృద్ధి విస్తరిస్తామని వివరించారు. ప్రభుత్వ హామీతో అప్పుడు ఈ విషయం సద్దుమణిగింది. ఇటీవల పురపాలికల పదవీ కాలం ముగియడం.. ఎన్నికల హామీలను గుర్తుచేయడంతో మరోసారి తెరపైకి వచ్చింది.

సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల పరిధిలో 2050 బృహత్‌ప్రణాళిక అమలుకు ఇటీవల సర్వే జరిగింది. పట్టణ విస్తీర్ణం.. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై పూర్తి నివేదికను సిద్ధం చేస్తున్నారు. విలీన పంచాయతీలపై డీటీసీపీ అన్సారీని సంప్రదించగా.. పంచాయతీలకు సంబంధించి పూర్తి వివరాల నివేదికను ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

# పల్లెకు రాని వెలుగు

పెనుగొండ: పల్లె వెలుగు బస్సు సర్వీసులను గ్రామాల వైపు నడపడం లేదు. ఫలితంగా ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో వీటిపై ప్రయాణం ప్రాణాల మీదకు తెస్తుంది. గ్రామాల నుంచి బస్సు సర్వీసులు లేకపోవడంతో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ఉచితంగా ప్రయాణ అవకాశాన్ని కల్పించినా వారికి ఉపయోగపడటం లేదు.

బ్రాహ్మణచెర్వు నుంచి నిత్యం పెద్దసంఖ్యలో తణుకు పట్టణానికి వెళుంటారు. ఈ మార్గంలో ఒక్క బస్సు సర్వీసు నడపటం లేదు. భీమవరం డిపో నుంచి మాముదూరు, జుత్తిగ, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామాలను తాకుతూ తణుకు రోజుకు రెండు సార్లు సర్వీసు నడుపుతు



న్నారు. సెలవు రోజుల్లో మాత్రం ఈ సర్వీసును రద్దు చేయడంతో ఇబ్బంది పడుతున్నారు. అవకాశం కొలది ప్రైవేటు వాహనాల వారు ఛార్జీల రూపంలో భారీగా దండుకుంటున్నారు. సత్యవరం, కొయ్యేటిపాడు, ఓడూరు, నెలమూరు మార్గాల్లో బస్సుల మాటే లేదు. ఈ విషయమై నరసాపురం డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి మాట్లాడుతూ రద్దీ, ఇతర పరిస్థితులపై పరిశీలించి సర్వీసుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పెనుగొండ పరిసర గ్రామాలను కలుపుతూ మార్టేరు, కొఠాలపర్రు, మునమర్రు, వడలి, పిట్టలవేమవరం, అన్నవరప్పాడు మీదుగా తణుకుకు బస్సు సౌకర్యం కల్పిస్తామని గతంలో ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు. కాని అది అమలుకు నోచుకోకపోవడంతో మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న పెనుగొండ, 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్ధాంతం చేరుకుని అక్కడి నుంచి తణుకు వెళ్తున్నారు.

పాలకొల్లు మండలం లంకలకోడేరు నుంచి వెలివెల వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కోసారి ఆటోలు అందుబాటులో ఉండక అత్యవసర పనులపై వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. తప్పక అటుగా వెళ్లే ద్విచక్ర వాహనాల చోదకుల సాయంతో ముందుకెళ్తున్నారు.

# రెట్టింపైన ఆనందం

నరసాపురం : మత్స్యకారులకు అందించే మత్స్యకార భరోసాను ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టింది. సముద్రంలో చేపలవేట సాగించే మత్స్యకారులు నిషేధ కాలంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా కోసం గతంలో నెలలు తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. అలాంటి పరిస్థితులకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 16 వరకు సముద్రంలో చేపల వేట నిషేధం అమలులో ఉంటుంది. కూటమి ప్రభుత్వం నిషేధకాలం ప్రారంభమైన పక్షం రోజుల్లోనే పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు మత్స్యకార భరోసా జమ చేసేందుకు చర్యలు చేపట్టింది.

భరోసా రూ.20వేలు.. సముద్రంలో చేపలవేట నిషేధ కాలంలో గతంలో ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.10వేలు అందించేవారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం భరోసా పెంపునకు చర్యలు చేపట్టింది. ఒక్కొక్క కార్మికుడికి రూ.20వేలు అందించేందుకు నిర్ణయించింది. జాబితాల పరిశీలన.. మత్స్యకార భరోసా జాబితాలో అనర్హులు ఉంటే వారిని గుర్తించేందుకు మత్స్యశాఖ సహాయ



సంచాలకుడు ఎల్ఎల్ఎన్ రాజు పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. సముద్రంలో చేపలవేట సాగించే బోట్లపై పనిచేసే కార్మికులు, యజమానుల్లో తల్లికి వందనం మినహా ప్రభుత్వ ఇతర పథకాలు పొందే లబ్ధిదారులుంటే వారిని గుర్తించి తొలగించేందుకు జాబితాలు పరిశీలించారు. ఈ నెల 22న జాబితాలను పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరిస్తామని ఏడీ తెలిపారు. 23న జాబితాల ఆమోదానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. 26న భరోసా నగదు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారన్నారు. మత్స్యకారులు: సుమారు 1856 మంది

మత్స్యకార భరోసా: రూ.20 వేలు

# వైద్యో నారాయణో.. ఏరీ!

విజయనగరం: మన్యం జిల్లాల్లోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అసిస్టెంట్ సివిల్ సర్జన్లుగా పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు విధుల్లో ఉన్నట్లు చూపిస్తూ.. ఆసుపత్రులకు గైర్హాజరవుతున్నారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వచ్చి ముఖ గుర్తింపు వ్యవస్థ ద్వారా హాజరు నమోదు చేయాలి. కానీ దాన్ని ట్యాంపరింగ్ చేసి విధులకు డుమ్మా కొడుతున్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని ఆశతో వచ్చిన రోగులకు నిరాశ కలిగిస్తున్నారు.ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు కార్యాలయాల్లో ప్రభుత్వం ముఖ గుర్తింపు వ్యవస్థను అమలు చేసింది. నిర్ణీత సమయానికి వైద్యులు, సిబ్బంది ఆసుపత్రులకు హాజరై వైద్య సేవలు అందించేలా దీన్ని అమలు చేస్తోంది. ఆసుపత్రికి చేరుకుని చరవాణిలో ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని నిబంధన విధించింది. కొందరు వైద్యులు ఆసుపత్రికి రాకుండా వచ్చినట్లు తప్పుడు హాజరు నమోదుతో మేనేజ్ చేస్తున్నారు. కొందరు కింది స్థాయి అధికారులు దాన్నే అనుసరిస్తున్నారు.

**సాంకేతిక తనిఖీలో బట్టబయలు**

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వాసుపత్రుల్లోని కొందరు వైద్యులు విధులకు హాజరు కాకుండా సమీప పట్టణాల్లో ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. వైద్యుల గైర్హాజరుపై రాష్ట్ర ఉన్నతాధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. పది రోజుల కిందట సాంకేతికంగా వారి హాజరు పరిశీలించగా రాష్ట్ర వ్యాప్తంగా 232 మంది వైద్యులు ట్యాంపరింగ్ చేసి హాజరు వేసుకుంటున్నట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో 24 మందిని ఇలా గుర్తించారు.

# నిధులు దండిగా.. పనులు మొండిగా!



అనకాపల్లి : జిల్లా పరిషత్తులో సాధారణ (జనరల్ ఫండ్), 15వ ఆర్థిక సంఘం నిధులు దండిగానే ఉన్నాయి. వాటితో చేపట్టిన పనులే ముందుకు వెళ్లడం లేదు. బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం నెలకొనడం, కొన్నిచోట్ల నేతలు, శాఖల మధ్య సమన్వయం లేక జిల్లా పరిషత్తు పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఆర్థిక సంఘం నిధులతో కొంత అభివృద్ధి చేయగలిగినా జనరల్ ఫండ్‌తో చేసిన వాటికి ఏడాది నుంచి బిల్లులు నిలిచిపోవడంతో గుత్తేదారులెవరూ ముందుకు రావడం లేదు. ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ ఈ సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

జిల్లాపరిషత్తుకు ఏటా వివిధ పద్దుల్లో సాధారణ నిధులు రూ. 20 కోట్ల వరకు అందుబాటులోకి వస్తుంటాయి. అదే విధంగా ఆర్థిక సంఘం నిధులు కూడా రెండు విడతల్లో రూ. 20 కోట్ల వరకు ఖజానాకు వచ్చి చేరుతాయి. వీటితో తాగునీటి బోర్లు, సీసీ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల మరమ్మతులు, కల్వర్టుల నిర్మాణం వంటి పనులను చేపడుతుంటారు. కొన్నింటిని జడ్పీటీసీ సభ్యులే సొంతంగా చేస్తే మరికొన్నింటిని స్థానిక గుత్తేదారులకు అప్పగించారు. ఈ నిధులతో చేసిన పనులుకు బిల్లులు సకాలంలో అందడం లేదు. సుమారు రూ. 7 కోట్ల మేర బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. దీంతో చాలావరకు మంజూరైన పనులు దస్త్రాలను దాటి వెళ్లడం లేదు.

అనకాపల్లి జిల్లాలో రూ.2.89 కోట్లతో గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో 111 పనులను జడ్పీ సాధారణ నిధులతో మంజూరుచేశారు. వీటిలో ఒక్కటంటే ఒక్క పని కూడా మొదలు కాలేదు. ఎక్కువగా చేతిబోర్లు, వీధి కాలువల నిర్మాణాలకు నిధులిచ్చారు. బిల్లులు సకాలం ఇవ్వడం లేదని వీటిని చేపట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు.

అల్లూరి జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చిన్నచిన్న మరమ్మతులు, కాలువలు, రోడ్ల నిర్మాణాలకు రూ. 2.71 కోట్లతో 70 పనులు మంజూరు చేశారు. వాటిలో 61 పనులు కార్యరూపంలోకి రాకుండానే నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలో రూ.98 లక్షలతో 26 పనులు మంజూరు చేశారు. వాటిలో ఒక్కటి కూడా మొదలుపెట్టకుండా వదిలేశారు.

పూర్తయ్యేలా చూస్తాం... సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ. 7 కోట్ల బిల్లులు సీఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి ఉన్నాయి. ప్రభుత్వం ఏ క్షణమైనా వాటిని విడుదల చేసే అవకాశం ఉంది. మంజూరైన పనులన్నింటినీ మూడు నెలల్లో పూర్తిచేసేలా సంబంధిత శాఖలతో మాట్లాడుతున్నాం. జడ్పీ బిల్లుల్లో జాప్యం లేకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

నారాయణమూర్తి, సీఈఓ, జడ్పీ

# సేంద్రియ ఆహారం.. ఆరోగ్య సమాహారం



భీమిలి : విశాఖ నగర వాసులు సేంద్రియ (ఆర్గానిక్) ఆహారం, ఉత్పత్తుల వినియోగంపై శ్రద్ధ చూపుతున్నారు. రసాయనిక ఎరువులతో కృత్రిమ పద్ధతుల్లో పండిస్తున్న పంటలు, మార్కెట్లో లభిస్తోన్న ఆహార పదార్థాలతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ప్రత్యామ్నాయంగా ఆర్గానిక్ ఉత్పత్తులను ఆశ్రయిస్తున్నారు. ఈక్రమంలో రాగులు, జొన్నలు, కొర్రలు, ఉలవలు, సజ్జలు, తదితర చిరు ధాన్యాలతో తయారయ్యే వాటిపైన, ఆర్గానిక్ దినుసులు, నూనెలు, ఫలాలు, వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. నగరంలో వీటి వినియోగం క్రమంగా పెరుగుతుండడంతో విక్రయించే దుకాణాలు కూడా అదే రీతిలో పెరగడం గమనార్హం.

**నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో విక్రయం**

ముఖ్యంగా ఆర్కేబీచ్, వుడాపార్కుతో పాటు బీచ్‌రోడ్డు ప్రాంతాల్లోని పార్కుల వద్ద ఆర్గానిక్ పదార్థాల విక్రయం జరుగుతోంది. ఉదయం నడక, పరుగుకి వచ్చే వారు రాగి జావ, అంబలి, మిల్లెట్స్ వంటకాలను అల్పాహారంగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా మధుమేహగ్రస్తులు, బీపీ, థైరాయిడ్, ఇతరత్రా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్న వారువీటిని స్వీకరిస్తున్నారు. బీచ్‌రోడ్డు, పార్కులున్న ప్రాంతాల్లోనే కాకుండా పెందుర్తి, సుజాతనగర్, గాజువాక, భీమిలి, తగరపువలస, మురళీనగర్, మాధవధార, అక్కయ్యపాలెం, ఎంవీపీకాలనీ, మధురవాడ, గోపాలపట్నం, కంచరపాలెం, ఎన్ఏడీ, ద్వారకానగర్, సిరిపురం, పూర్ణామార్కెట్, జగదాంబకూడలి, వన్‌టౌన్, జిల్లా పరిషత్తు, వాల్తేరు, ఉషోదయ, ఆరిలోవ ప్రాంతాల్లోనూ సేంద్రియ స్టోరుల్లో రసాయనిక రహిత పదార్థాలు, స్వచ్ఛమైన నూనెలు, పప్పుదినుసులు, తదితర సామగ్రిని విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాగులు, జొన్నలు, అరికెలు, సామలతో చేసిన ఇడ్లీలు, దోశలు, ఉలవ వడ, జొన్న పరోటా వంటివి అమ్ముతున్నారు. ఈ రకమైన ఆర్గానిక్ పదార్థాల అల్పాహార కేంద్రాలు (టిఫిన్ సెంటర్లు) నగరంలో పెరిగాయి.

గణాంకాలు

నగరంలో సేంద్రియ ఉత్పత్తుల్ని ప్రత్యేకంగా అమ్మే దుకాణాలు– 28

సేంద్రియ ఆహారాన్ని, అల్పాహారాన్ని అందించే సెంటర్లు – 15

ఉదయం పూట మిల్లెట్స్, అంబలి, జావ వంటివి విక్రయించే చిరు స్టాళ్లు – 35

ఆర్కేబీచ్ వంటి ప్రాంతాల్లోని స్టాళ్ల వద్ద రోజుకి సగటున 150 నుంచి 200 మంది, మిగిలిన ప్రాంతాల్లో సుమారు 50 నుంచి 80 మంది సేంద్రియ ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు.

సేంద్రియ ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాల్లో రోజుకి సగటున రూ.20వేల నుంచి ప్రాంతాన్ని బట్టి లక్ష రూపాయల వరకూ వ్యాపారం జరుగుతోంది.

పప్పులు, నూనెల నుంచి అన్నీ కూడా ఆర్గానిక్ సామగ్రినే వినియోగిస్తున్నాం. ఆరోగ్యపరంగా చాలా బాగుంటుంది. రసాయనిక మిళితమైన ఆహారంతో మనకు తెలియకుండానే ఎన్నో రోగాలు వస్తున్నాయి. నగరంలో ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే చిరుధాన్యాలు, ఆర్గానిక్ వస్తువుల ఆహారాన్నే మేము తీసుకుంటున్నాం.

లక్ష్మి (ఎంవీపీ డబుల్‌రోడ్డు)

చిరు ధాన్యాలు మన శరీరానికి పోషకాలను అందిస్తాయి. వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల ఎముకలు దృఢమవుతాయి. మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. రక్తహీనత, బరువును తగ్గిస్తాయి. బీపీ, మధుమేహం వంటివి అదుపులో ఉంటాయి. తగ్గిస్తాయి. మతిమరుపు వంటి వాటిని దూరం చేస్తాయి.

జి.యోగితా ప్రియదర్శిని (పోషకాహార నిపుణురాలు, మధురవాడ)

# నాటి దూకుడు నేడేమైంది..?



అనకాపల్లి : నాడు.. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడి ఇంటి నిర్మాణంలో జలవనరుల శాఖకు చెందిన రెండు సెంట్ల స్థలం కలిసిందని స్పందనలో ఫిర్యాదు వచ్చింది. దానిపై అధికారులు హడావుడి చేశారు. కేసులు పెట్టి వందల సంఖ్యలో పోలీసులను ఇంటికి పంపి నిర్మాణాన్ని కూలగొట్టే ప్రయత్నం చేశారు. తమకు సంబంధిత శాఖ నుంచి ఎన్వోసీ ఉందని చెప్పినా వినలేదు. అది నకిలీదంటూ అయ్యన్నను అర్ధరాత్రి అరెస్టు చేసేవరకు అప్పటి సర్కారు పెద్దలు నిద్రపోలేదు. నేడు.. కశింకోట మండలం విస్సన్నపేటలో వైకాపా నేతలు తమ బినామీల పేరిట భారీ లేఅవుట్ వేశారు. అందులో కొండ గెడ్డలు, ప్రభుత్వ భూములు కొంతమేర కలిపేశారని గత ప్రభుత్వంలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారంలో అక్రమాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే జనసేన నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఆ ఫిర్యాదును పట్టించుకోనేలేదు. ఇదీ నేటి అధికారుల మెతక వైఖరి తీరు. తాజాగా మరోసారి ఆ పార్టీ నాయకుడొకరు ఆ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు.

గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు అధికారులు దూకుడు చూపేవారు. బుల్డోజర్లు తీసుకెళ్లి మరీ నిర్మాణాలు నేలమట్టం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఫిర్యాదులు చేసినా అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇందుకు విస్సన్నపేట భూముల వ్యవహారమే ఉదాహరణ. నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని ప్రధాన అనుచరుడు బొడ్డేటడ ప్రసాద్ కనుసన్నల్లోనే ఈ లేఅవుట్ వ్యవహారాలు నడిచాయి. అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి అనుచరుడు ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి ఇక్కడ 55 ఎకరాలపైగా భూములు కొనుగోలు చేశారు. 609 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. దీనికోసం పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు వచ్చాక అప్పటి ఆర్డీవో సీతారామారావు విచారణ జరిపారు. సుమారు పదెకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. చర్యలైతే తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలో నాటి నేతల అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికి తీస్తారని ఆశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటారని భావించారు. ఫిర్యాదు వచ్చి పదినెలలైనా అధికారులైతే ఆ దిశగా అడుగులు వేయడమే లేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలు కూడా మౌనం దాల్చడం వెనుక వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

**సా..గుతున్న విజిలెన్స్ విచారణ..**

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత గత ప్రభుత్వంలో భూముల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. అందులో భాగంగా విస్సన్నపేట లేఅవుట్‌పైనా విచారణ చేస్తున్నారు. అయితే భూ రికార్డులు సక్రమంగా లేకపోవడం, కొండలు కరిగించినా వాటిని ఎక్కడికి, ఎంత పరిమాణంలో తరలించారనే వివరాలు దొరక్కపోవడంతో కాలయాపన జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో విచారణ చేపట్టిన ఆర్డీవో నివేదిక సైతం ఇప్పటి వరకు వెలుగుచూడలేదు. ఈ భూముల వ్యవహారంలోనే సస్పెన్షన్‌కు గురైన అధికారిని ఆర్డీవో కార్యాలయంలోని కీలక పోస్టులో పెట్టారు. ఆయన హయాంలో జరిగిన అక్రమాల వివరాలు ఇప్పుడు ఆయన్ని దాటి బయటకు వస్తాయా అన్నది ఫిర్యాదుదారుల అనుమానం.

# అడిగింది ఇస్తే చాలు

ఏలూరు: పోలీస్ బాస్‌కు కళ్లు, చెవుల్లా పని చేయాల్సిన ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ విభాగాల్లో సిబ్బందిలో ఎక్కువ మంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో జరుగుతున్న అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలు ఉన్నతాధికారులకు తెలియకుండా బేరాలు మాట్లాడుకుంటున్నారు. పోలీస్ స్టేషన్లలో నెలవారీ మామూళ్లుకు ఎగబడుతున్నారు. ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ఈ దందాలు పెచ్చుమీరుతున్నాయి.

**గుట్టు విప్పరు..** జిల్లావ్యాప్తంగా చాప కింద నీరులా ఎన్ని అక్రమాలు జరుగుతున్నా చాలా మంది ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ అధికారులు ఉన్నతాధికారులకు వాస్తవ సమాచారం ఇవ్వడం లేదు. అంతర్గత సమాచారం ఇవ్వడానికే కేటాయించిన వారే మామూళ్ల బాటలో ఉండటంతో జిల్లాలో బాధితుల ద్వారా, పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన అంశాలకు సైతం మొక్కుబడిగా నివేదికలు పంపుతున్నారు. ఫలితంగా బాహాటంగా వెలుగులోకి వచ్చిన అంశాల్లో సైతం ఉన్నతాధికారుల చర్యలు కానరావడం లేదు. విషయం తెలిసిన వెంటనే అక్రమాలు చేసిన వారిని కలిసి..విచారణ పేరుతో సున్నితంగా బెదిరించడం..నామమాత్రపు నివేదిక ఇస్తామని చెప్పి భారీగా వసూలు



చేసుకుంటున్నారు.

**అన్నింటా దందా..** జిల్లాలో మద్యం దుకాణదారులు చాలా పోలీస్ స్టేషన్లకు, అబ్కారీ నెలవారీ మామూళ్లు ముట్టజెబుతున్నారు. ఒక్కో దుకాణం స్టేషన్‌కు రూ.25వేల వరకు ముట్టజెబుతోంది. తాజాగా కొందరు ఎస్‌బీ సిబ్బంది సైతం తమకు ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున మామూళ్లు ఇవ్వాలని భయపెట్టి వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు, ఉద్యోగ నియామక విచారణకు అభ్యర్థుల ఇళ్లకు వెళ్లాల్సిన అవసరం లేదు. కానీ చాలా మంది ఎస్‌బీ సిబ్బంది ఇళ్లకు వెళ్లి వంకలు చెప్పి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఏలూరు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ మండలంలో అక్రమ మట్టి రవాణాను స్థానిక ఎస్సై, ఓ కానిస్టేబుల్ అన్నీ తామై నిర్వహిస్తున్నారు. నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. అక్కడ పని చేసే ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ సిబ్బంది ఇద్దరికీ నెలవారీ మామూళ్లు ముట్టజెప్పి విషయం బయటికి రాకుండా పోలీసులు కథ నడిపిస్తున్నారు.

మెట్ట ప్రాంతంలో రెండు కీలక మండలాల్లో ముగ్గురు పోలీస్ అధికారులు ఇష్టారాజ్యంగా కోడి పందేలు నిర్వహణకు సహకరిస్తూ.. నాటు సారా తయారీని ప్రోత్సహిస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమైనా ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం లేదు. పోలీసులకు వస్తున్న సొమ్ములో వాటాదారులుగా మారిపోయారు.

# చేతులెత్తేసింది!

జంగారెడ్డిగూడెం : మెట్టలో కీలకమైన ఎర్రకాలువ జలాశయం నిర్లక్ష్యానికి గురవుతోంది. వైకాపా హయాంలో అయిదేళ్లు ఈ ప్రాజెక్టును పెద్దగా పట్టించుకోలేదు. ఈ కారణంగా ముఖ్యమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు దాదాపు నిలిచిపోయాయి. సుమారు రూ.6 కోట్ల విలువైన పనులకు నాలుగైదు సార్లు టెండర్లు పిలిచినా బిల్లుల భయంతో గుత్తేదారులు ముందుకు రాలేదు.

**16వేల ఎకరాలకే నీరు..** జలాశయంతో పాటు కుడి, ఎడమ ప్రధాన కాలువలు సైతం అధ్వానంగా మారాయి. ఫలితంగా 30వేల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉన్నా 16వేల ఎకరాలకే ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమైన కొన్ని పనులకు నిధులు మంజూరు చేసింది. వీటితో పాటు పెండింగ్ పనులపై కూడా దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

భద్రత దృష్ట్యా తక్కువగా నిల్వ.. డ్యామ్ భద్రత దృష్ట్యా 4.428 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో తక్కువగా నిల్వ చేస్తున్నారు. నిర్వహణ లేక గేట్లు మొరాయిస్తున్నాయి. లీకేజీ కారణంగా నీరు వృథా అవుతోంది. రోలర్లు, రోప్‌లు సైతం పలు చోట్ల దెబ్బతిన్నాయి. వరదల్లో గేట్లు ఎత్తాలన్నా, దించాలన్నా జనరేటర్ అవసరం. దాని పరిస్థితి అథోగతే. రెండున్నరేళ్లుగా ప్రాజెక్టు సిబ్బందికి జీతాలు కూడా లేవు. ప్రధాన సమస్యలు.. స్పిల్‌వే డ్రాప్ 2018లో కొట్టుకు పోయింది. ఫలితంగా చేలు మునిగిపోతున్నాయి. తిరుమలాపురం వద్ద బయనేరుపై కూలిన అక్విడక్ట్ కోసం 2019లో రూ.4.50 కోట్లకు టెండర్లు పిలిచారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన కొత్తలో వాటిని రద్దు చేశారు. 3వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయింది.

# పీపీపీ.. డుండుండుం

పామూరు: ఒక వైపు మండుటెండలు అయినా తరుముకొచ్చిన శుభ ఘడియలతో జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో మంచి రోజులు రానే వచ్చాయి. శుభ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన వేదికలను ఇప్పటికే పలువురు ముందుగా రిజర్వ్ చేసుకున్నారు. ఇదే అదునుగా కొందరు నిర్వాహకులు వసతులను బట్టి ఒక్కో రోజుకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఊపందుకున్న కొనుగోళ్లు: శుభ ముహూర్తాలతో పలువురికి డిమాండ్ పెరిగింది. పురోహితులతో పాటు వాయిద్యాలు, వీడియోగ్రాఫర్లు, కల్యాణ మండపాలు, బంగారు, వస్త్ర దుకాణాలు, వంట పనివారు, సప్లయర్స్, ఇతర అనుబంధ రంగాల వారికి ఈ మూడు నెలల పాటు చేతి నిండా పని దొరకనుంది. గత పెళ్లిళ్ల సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.30 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు సాగినట్లు అంచనా. ఈ సారి ఆ మొత్తం రూ. 40 కోట్లకు పైగా ఉంటుందని.. ఇంకా పెరిగే అవకాశాలూ ఉన్నాయని మ్యారేజ్ బ్యూరోల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

మొత్తం 24 ముహూర్తాలు..

ఏప్రిల్: 16, 18, 20, 21, 23, 30

మే: 1, 7, 8, 9, 10, 11, 14, 17, 18, 21, 22 23, 28

జూన్: 4, 5, 6, 7, 8.. ఏప్రిల్ 30న అక్షయ తృతీయ

# శ్రీకాళహస్తికి పరిశ్రమల హారం

శ్రీకాళహస్తి : కూటమి పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశ్రమల హారంగా మారనుంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు రూపొందించాలని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గతంలో తెదేపా ప్రభుత్వంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం-1, 2గా ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారిపై ఈఎంసీ-3గా కేటాయించి ఏపీఐఐసీకి పెద్దఎత్తున భూములు కేటాయించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ



నేపథ్యంలో ఈఎంసీ-1,2లో 830.5 ఎకరాల ఏపీఐఐసీకి భూములు కేటాయించగా.. 330 ఎకరాల్లో రూ.వేల కోట్లు పెట్టుబడులతో డిక్సన్, సిలికాన్, కార్బన్, టీసీఎల్ వంటి 56 భారీ పరిశ్రమలను ఏర్పాటుకు పండగలా భూమి చేశారు. అప్పటికే 30కిపైగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం గమనార్హం.

**పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు**

ఈఎంసీ-1, 2, 3లో వెయ్యి ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అధికారులతో చర్చలు జరపడంతో రానున్న రోజుల్లో కదలికలు ఏర్పడనున్నాయి.

**తెదేపా హయాంలో శ్రీకారం**

తిరుపతి ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు సమీపంలో ఉండటంతో 2014లో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెదేపా శ్రీకారం చుట్టింది. అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు సంకల్పించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి కుంటుపడింది.

**వైకాపాలో వెనుదిరిగినవెన్నో**

వైకాపా ఐదేళ్ల పాలనలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోగా జియో, విన్‌టెక్, ఎయిల్‌డిక్సన్, ఫాక్స్‌లింక్ వంటి కొన్ని ప్లాంట్‌లు వెనుదిరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు సమీపంలో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏపీఐఐసీకి కేటాయించి భూములు బీడు భూములగానే దర్శనమిస్తున్నాయి.

# బె'ధర'గొడుతున్నారు

చిత్తూరు : వ్యవసాయ శాఖలో అన్నదాతకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే యాంత్రీకరణ పథకం ఐదేళ్ల తరవాత అమల్లోకి వచ్చింది. కొన్ని పరికరాలపై 50శాతం.. మరికొన్నింటికి నిర్దేశిత మొత్తాన్ని రాయితీగా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి ధరలు ఎక్కువగా నిర్ణయించడం గమనార్హం.. తైవాన్ స్ప్రేయర్‌నే పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ప్రైవేటు కన్నా రూ.4,132 అధికంగా నిర్ణయించింది. ఇదే స్ప్రేయరుకు ఉద్యానశాఖ రూ.10 వేలు రాయితీ ఇస్తుండగా రైతులు రూ.23 వేలకే కొనుగోలు చేసి బిల్లులు సమర్పిస్తున్నారు.

**తగ్గిపోతున్న సాయం..**

వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడం వల్ల అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైకా కొన్నింటి ధరలను అధికంగా



పేర్కొనడంతో రైతుకు వాస్తవంగా దక్కే ఆర్థిక ప్రయోజనం 25 నుంచి 30 శాతమే ఉంటోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన మేరకు అన్నదాతకు లబ్ధి చేకూరడం లేదు. ఉద్యానశాఖలో అమలవుతున్న యాంత్రీకరణ పథకం వారికి మేలు చేసేలా ఉంది. ఎందుకంటే రైతులే స్వయంగా బేరమాడి కొనుగోలు చేసి బిల్లులు పెడుతుంటే అధికారులు రాయితీ జమ చేస్తున్నారు. సాధారణంగా ఒక్క పరికరాన్నే కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసినప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**పెరిగింది ఇందుకేనంటా..**

నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్‌కు 2శాతం కమీషన్, జీఎస్టీ కారణంగా ధరలు పెరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులు యంత్రాలు సరఫరా చేసిన కంపెనీలకు రాయితీ సొమ్ము జమ చేసేందుకు 3-4 నెలలు సమయం పడుతుండటంతో ఆయా కంపెనీల ధరలు ఐదు నుంచి 10 శాతం అధికంగా ఉన్నాయని మరికొందరు అధికారులు పేర్కొంటున్నారు.

**అంతంత మాత్రంగానే దరఖాస్తులు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలకు లక్ష్యాలను కేటాయించి జిల్లా వ్యవసాయాధికారులకు పంపింది. 24 రోజులు గడిచినా ఉమ్మడి జిల్లాలో కేవలం 1,208 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మూడు రోజులే గడువు ఉందని ఈలోగా రైతులు దరఖాస్తు చేసుకుని నాన్ సబ్సిడీ చెల్లించిన వారికి ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆగ్రోస్ జిల్లా మేనేజరు శశిచంద్రమౌళిరెడ్డి తెలిపారు.

# ఏటీఎం సాగు.. ఆదాయం బాగు



తిరుపతి : రసాయన ఎరువులతో పంటలు సాగు చేసి ఖర్చు పెరిగి ఆర్థికంగా చితికిపోతున్న ఎంతో మంది రైతులను చూస్తున్నాం. దీనికి భిన్నంగా పాత పద్ధతులు అనుసరించి ఏటీఎం (ఎనీ టైం మనీ) సాగుకు శ్రీకారం చుట్టారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాల పంటలు సాగు చేసి నిరంతర ఆదాయార్జన చేస్తున్నారు.

**ఎప్పుడు డబ్బు కావాలన్నా..**

తిరుపతి గ్రామీణ మండలం అడపారెడ్డిపల్లికి చెందిన మిథున్‌రెడ్డి బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ చేశారు. ఏటీఎం విధానంలో సేంద్రియ పద్ధతిలో తనకున్న మూడు గుంటల భూమిలో 19 రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఆవుపేడ, పంచితం, బెల్లం, పుట్టమట్టితో తయారు చేసిన జీవామృతంతో చీడపీడలను అరికడుతున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో సాగు చేసిన ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్టాల్‌లో విక్రయిస్తున్నారు.

365 రోజులు ఏదో ఒక పంట అందుబాటులో ఉండటంతో ఎప్పుడు ఖర్చులకు డబ్బు కావాలన్నా.. పొలంలో కాయగూరలు, పండ్లు కోసుకొచ్చి విక్రయించొచ్చని మిథున్‌రెడ్డి తన అనుభవాలను పంచుకున్నారు.

**ఆర్థిక లోటు లేదు..**

బైరెడ్డిపల్లె మండలం కైగల్‌కు చెందిన మహిళా రైతు ప్రమీలమ్మ 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం విధానంలో విభిన్న పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి నెలా రూ.6 - 8 వేలు ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రకృతి సాగుతో పెట్టుబడి ఖర్చులు సైతం తగ్గుతున్నాయని ప్రమీలమ్మ చెబుతోంది. ఇంటి అవసరాలకు పోను పండించిన కూరగాయలను వి.కోట మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒక పంట తర్వాత మరో పంట చేతికి అందడంతో కుటుంబ అవసరాలకు ఆర్థిక లోటు ఉండటం లేదని చెబుతున్నారు.

**ఉచితం.. పేదలకు ప్రత్యేకం**

పేదలకు కావాల్సిన వస్తువులు ఉచితంగా ఇస్తూ... శ్రీకాళహస్తికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ప్రత్యేక గుర్తింపు పొందారు. సంస్థ తరపున ఉచిత బజార్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషా స్థానికంగా ఓ ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నాడు. పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో 'హెల్పింగ్ హ్యాండ్స్'ను ప్రారంభించారు. ఫ్యాన్సీ స్టోర్‌లో గీతలు పడిన వస్తువులు, డబ్బాలు, బకెట్లు, మగ్గులు, పెన్సిల్ బాక్సులు తదితర వస్తువులను ఉచిత బజార్ ద్వారా పేదలకు అందిస్తున్నారు. మొదట్లో దుకాణ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత బజారును... పేదల ఆదరణ చూసి ప్రస్తుతం ఆయా పేదల కాలనీల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నంతలో సాయపడాలి: ఉన్నంతలో వీలైన మేరకు ప్రజలకు సాయపడాలన్నది నా సంకల్పం. అందుకే పేదలకు అవసరమైన బకెట్లు, మగ్గులు తదితర వస్తువులు ఉచితంగా ఇస్తున్నాను. పలువురు లబ్ధి పొందుతుండటం ఎంతో ఆనందంగా ఉంది.మునీర్‌బాషా

# మామిడి ఎగుమతుల జోరు



నక్కపల్లి: వేసవితోపాటే మొదలయ్యే మామిడి సీజన్ నక్కపల్లి మండలంలో జోరందుకుంది. జిల్లాలో అత్యధికంగా వ్యాపారం సాగే చినదొడ్డిగల్లు, వేంపాడు కేంద్రాలుగా ఇతర ప్రాంతాలకు ప్రస్తుతం పచ్చిమామిడి ఎగుమతులు సాగుతున్నాయి. ధర అనుకున్నంతగా లేకపోయినా, ఉన్నంతలో రైతులు వ్యాపారం సాగిస్తున్నారు. చినదొడ్డిగల్లు, వేంపాడు, డొంకాడ తదితర ప్రాంతాలనుంచి ఏటా మామిడి వ్యాపారం భారీ ఎత్తున సాగుతుంది. ఆ మేరకు సీజన్ ఆరంభంలో లేత పచ్చిమామిడి క్రయ, విక్రయాలు జోరుగా సాగుతాయి. ప్రస్తుతం ఫరియ, కలెక్టర్ రకాలు నిత్యం ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు కాకినాడ జిల్లా సరిహద్దు ప్రాంతాలనుంచి రైతులు సరకు తెచ్చి చినదొడ్డిగల్లు, వేంపాడులోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీరంతా బిహార్, బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక పచ్చళ్లు, కూరలు, తీపి పదార్థాల తయారీకి వీటిని విరివిగా వినియోగిస్తుంటారు. దీంతో దీనికి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం ఈ వ్యాపారమే జోరుగా సాగుతోంది. కాగా ఈ ఏడాది పూత ఆశాజనకంగా వచ్చినా వాతావరణ మార్పులతో దిగుబడి నిలబడలేదు. ఫలితంగా రైతులు నిరాశలో ఉన్నారు. మరోవైపు ధరా అనుకున్నస్థాయిలో లేదు. గతేడాది ఇదే సమయానికి పచ్చిమామిడి టన్ను ధర రూ. 35 వేల వరకు పలికింది. ఈ ఏడాది వ్యాపారం ఆరంభంలో ధర కాస్త బాగానే ఉంది. గతనెల చివరి వారంలో టన్ను రూ. 30 వేల వరకు ఉండగా, తర్వాత సమీప రాష్ట్రాలనుంచి సరకు అధికంగా వస్తుండటంతో డిమాండ్ తగ్గి ధర పడిపోయింది. ఈ క్రమంలో ఒక్కోవారం ధర తగ్గుతూ ప్రస్తుతం కలెక్టర్ రకం టన్ను రూ. 14 వేలకు, ఫరియా రూ. 10 వేలకు పడిపోయింది. నిత్యం ఇక్కడున్న దుకాణాల నుంచి పలు వాహనాల్లో దాదాపు 50 టన్నుల వరకు సరకు ఎగుమతి చేస్తున్నారు. మరో రెండు వారాలపాటు ఇదే వ్యాపారం జోరుగా సాగనుంది. తర్వాత మామిడి పండ్ల ఎగుమతులు ఊపందుకోనున్నాయి.

# కాల్వల బాగుకు కదలాలి



నంద్యాల : ఉమ్మడి జిల్లాలో సాగునీటి కాల్వలు పూడికతో నిండిపోయాయి.. జమ్ము, పిచ్చిమొక్కలు పెరిగాయి. నీరు విడుదల చేసినా ముందుకెళ్లదు.. చివరి ఆయకట్టుకు చేరడం లేదు.. దీంతో ఏటా రైతులు నష్టపోతున్నారు. ఉపాధిహామీ పథకం కింద పూడికతీత పనులు చేపట్టే వెసులుబాటు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉపాధిహామీ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఏ కాల్వకు ఎంత మొత్తం నిధులు అవసరమవుతాయో ప్రతిపాదనలు తయారు చేయాలి. ఆ దిశగా చర్యలు కరవయ్యాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ చూపి కాల్వలో పూడిక తీత పనులు చేపట్టేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**చేసిన పనులే చేయిస్తూ**

ఉపాధిహామీ పథకంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరితో ఏటా చేసిన పనులే చేయిస్తున్నారు. వీటితో పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. ఐదు ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని ప్రధాన, పంట కాల్వల్లో పెద్దఎత్తున పూడిక పేరుకుపోయినా దీనిపై దృష్టిపెట్టడం లేదు.

నంద్యాల జిల్లాలో గత ఆర్థిక సంవత్సరానికి 77 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్ణయించారు. దాదాపు లక్ష్యం పూర్తి చేశారు. కర్నూలు జిల్లాలో 54.68 లక్షల పనిదినాలకు గాను 90 శాతం పైగా లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈ క్రమంలో వేతనదారులతో చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేయిస్తున్నారు. వాటికి బదులు సాగునీటి కాలువల్లో పూడిక తీసే పనులు చేయిస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు కోరుతున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి ఈ పనులు చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

సంఘాలు ముందుండి నడపాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సాగునీటి సంఘాల సభ్యులు కూడా అందుబాటులో ఉండటంతో ఆయా ప్రాజెక్టులు, కాలువల పరిధిలో ఉపాధి నిధులతో పూడికతీత పనుల చేయించవచ్చు. తద్వారా ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300కు పైగా గిట్టుబాటయ్యేలా చూడొచ్చు.

**ఎటుచూసినా అస్తవ్యస్తమే..**

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా తెలుగుగంగ, ఎస్సార్బీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ పరిధిలో సాగునీటి కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ ఛానళ్లు, పంట కాల్వలు ఎక్కువగా ఉన్నాయి. ఇవన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. దీంతో సాగునీరు సరిగా పారని పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ కాల్వ పొడవునా మహానంది, బండిఆత్మకూరు, రుద్రవరం మండలాల్లోని పంట కాలువల్లో ఇసుక మేటలు వేసింది. ఎస్సార్బీసీ కాల్వల్లో ఒండ్రు మట్టి పేరుకుపోయింది. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో కంకర రాళ్లు కనిపిస్తున్నాయి.

**పనులు చేయిస్తున్నాం- జి.రాజకుమారి, కలెక్టర్**

ఉపాధిహామీ నిధులతో ఈ ఏడాది పంట కాల్వల్లో పనులు చేయిస్తున్నాం. వీటికే ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. ప్రధాన సాగునీటి కాల్వల్లో పనులు చేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. వాటిని జల వనరుల శాఖ మాత్రమే చేయాల్సి ఉంటుంది. ప్రధాన, పంట, పిల్ల కాల్వలు పనులు చేపడుతున్నాం.

# అతివలకు.. ఆలంబన

కళ్యాణదుర్గం : పట్టణాల్లో మహిళల జీవనోపాధులను మెరుగుపరిచి ప్రతి మహిళను లక్షాధికారిణి చేయాలి. కుటుంబంలో వ్యాపారవేత్తగా ఎదగనివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పట్టణ పేదరిక నిర్మూలన(మెప్మా) ద్వారా మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకు ద్వారా రుణాలు ఇప్పించి కొత్త యూనిట్లు ప్రారంభించడానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో మహిళా సంఘాలకు కేవలం రుణాలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అతివలు వారికి వచ్చిన నగదును ఇంటి అవసరాలు, పిల్లల చదువులకు ఉపయోగించుకుని ప్రతి నెలా అతి కష్టం మీద బ్యాంకులకు కంతులు చెల్లిస్తూ వచ్చారు. ఇప్పుడు అలాకాకుండా ప్రభుత్వమే చొరవ తీసుకుని రుణాలు ఇప్పించి యూనిట్‌ను ఏర్పాటు చేసి వారి ఉన్నతికి బాటలు వేయనుంది.

**కొత్త యూనిట్లకు ప్రోత్సాహం..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త యూనిట్లకు శ్రీకారం చుట్టింది. ఇందులో ర్యాపిడ్ వాహనాలు, తృప్తి క్యాంటిన్‌ల



ఏర్పాటు, పర్యాటక రంగ సేవలు, మొబైల్ మార్ట్, అమృత్‌మిత్ర తదితర యూనిట్లు మహిళా సంఘం సభ్యుల ద్వారా ఏర్పాటు చేయించి ఉపాధి మెరుగుపరుచుకునే దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు యూనిట్ల వారీగా ఈ ఏడాదికి లక్ష్యాన్ని నిర్దేశించారు. తృప్తి క్యాంటీన్ సంస్థతో కలిసి చిన్నపాటి హెూటళ్లు ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ఆ సంస్థతో ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది. ర్యాపిడ్ ద్విచక్ర వాహనాలను ఇప్పించి వారి జీవనోపాధికి ఊతం ఇవ్వడం తదితర యూనిట్లు స్వయం సహాయ సంఘాల మెరుగుదలకు ఉపయోగపడనున్నాయి.

**సభ్యుల అభ్యున్నతికి అడుగులు- విశ్వజ్యోతి, మెప్మా పీడీ**

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల అభ్యున్నతికి కొత్త యూనిట్లు ఉపయోగపడనున్నాయి. ప్రతి కుటుంబంలో మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని, ఆర్థికంగా స్థిరపడాలని ఈ యూనిట్లను తీసుకున్నారు. బ్యాంకు లింక్ నుంచి తీసుకుంటున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసి జీవనోపాధి మెరుగుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రాథమికంగా ఈ ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీలకు లక్ష్యాలను నిర్దేశించారు. వీటిని ముందుకు తీసుకువెళ్లడానికి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

# ఆంక్షలు కఠినం.. ఆటలు దూరం!

అనంతపురం : అనంత నగర నడిబొడ్డున ఆరు దశాబ్దాల క్రితం ప్రజల చందాలతో నిర్మించిన నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఎవరు అడుగుపెట్టాలన్నా కాసులు చెల్లించాల్సిన దుస్థితి. క్రికెట్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్‌లో నిరంతం ఇక్కడ శిక్షణ శిబిరాలు జరిగేవి. పలువురు ఈ స్టేడియంలో సాధన చేసి జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ప్రస్తుతం పోలీసులు ఆంక్షలు విధించడం క్రీడాకారులకు శాపంగా మారింది. పీటీసీ డీఎస్పీగా కోటిరెడ్డి బాధ్యతలు స్వీకరించగానే కఠిన ఆంక్షలతో స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాలీబాల్, కబడ్డీ కోర్టులను నామరూపాల్లేకుండా చేశారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్‌ను సైతం తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. మహిళలు, బాలుర క్రికెట్ భవనాలను ఖాళీ చేయించారు.

**క్రీడల నిర్వహణకే మొగ్గు: వినోద్‌కుమార్, కలెక్టర్**

ఈ విషయం నా దృష్టికి వచ్చింది. సమస్యపై శాంతిభద్రతలు, క్రీడల ఐజీ, ఎస్పీకి లేఖ రాశాం. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం. శిక్షణ శిబిరాల నిర్వహణకే మొగ్గు చూపుతాం.

ఏడేళ్ల నుంచి ఉచిత తర్ఫీదు స్టేడియంలో ఏడేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. ఏనాడు పైసా చెల్లించలేదు. ఉచితంగా శిక్షణ పొంది క్రికెట్‌లో రాణిస్తున్నా. మైదానంలో ఆంక్షలు విధించడం ఏమాత్రం తగదు. భార్గవ్‌రాజ్, క్రికెటర్

**క్రికెటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకం**

గత 25 ఏళ్ల నుంచి ఉచితంగా శిక్షణ ఇస్తున్నా. ఎంతోమంది మంచి క్రికెటర్లను తీర్చిదిద్దాను. నెట్స్ ప్రాంతాన్ని లీజుకి ఇస్తే పేద పిల్లలు ఆడే అవకాశం కోల్పోతారు. ఎంతోమంది క్రికెటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకం చేస్తున్నారు. - టీవీ చంద్రమోహన్‌రెడ్డి, క్రికెట్ శిక్షకుడు

# నిలిచిన పనులు.. ప్రయాణానికి పాట్లు

పుట్టపర్తి : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా కూటమి ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉపాధి హామీ పథకం నిధులతో ఉమ్మడి అనంత జిల్లాలో పెద్దఎత్తున సీసీ, బీటీ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అతి తక్కువ సమయంలో 90 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. మొదట్లో ప్రతివారం బిల్లులు జమ చేయడంతో యుద్ధప్రతిపాదికన పూర్తయ్యాయి. రెండు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కొన్ని రహదారులు మధ్యలోనే ఆగిపోయాయి. మరికొన్నిచోట్ల రాజకీయ కారణాలతో ముందుకు కదలడం లేదు. పలుచోట్ల కంకర వేసి వదిలేయడంతో రాకపోకలకు పడరానిపాట్లు పడాల్సి వస్తోంది.

**350 పనులకు మోక్షం కలిగేనా?**

పల్లెపండుగ కింద నిధులు కేటాయించి రహదారులు, డ్రైనేజీ తదితర పనులు మంజూరు చేశారు. చివరిదశలో 350 పనులు రెండు నెలలుగా ఆగాయి. ఉమ్మడి జిల్లాలో రూ.231 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.211 కోట్లు చెల్లించారు. జిల్లాకు రూ.10 కోట్ల చొప్పున రూ.20 కోట్ల విలువైన పనులు నిలిచిపోయాయి. అధికారులు గుత్తేదారులను ఒప్పించి.. పనులను పూర్తి చేయించి ప్రయాణికులకు కష్టాలు తప్పించాల్సిన అవసరం ఉంది. అనంతపురం జిల్లాలో అత్యల్పంగా వజ్రకరూరు మండలంలో 68 పనులు మంజూరు కాగా ఇప్పటివరకు 48 మాత్రమే పూర్తయ్యాయి. రెండు నెలలుగా 20 పెండింగ్‌లో ఉన్నాయి. కుందుర్పి మండలంలో 60 పనులకు గాను 34 పూర్తిగా... 26 అసంపూర్తిగా ఉన్నాయి. బొమ్మనహాళ్ మండలంలో 25 పనులు మొదలు కావాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో వంద శాతం పూర్తి చేశారు. రూ.23.31 కోట్ల విలువైన 305 పనులు మంజూరు కాగా వేగంగా పూర్తిచేశారు. ఈ విషయంలో ధర్మవరం నియోజకవర్గం వెనకబడింది. 76 శాతం పూర్తయ్యాయి. ముఖ్యంగా ముదిగుబ్బ మండలంలో 77 పనులకు 47 మాత్రమే పూర్తి చేయడం గమనార్హం.

# అరటి.. నష్టాలు మిగిల్చి

తాడిపత్రి: జిల్లాలో సిరులు కురిపించిన అరటి సాగు ప్రస్తుతం నష్టాలను మిగిలిస్తోంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా విపణిలో సరైన ధర లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు. మరోవైపు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఫలితంగా చెట్లు ఎండిపోతున్నాయి. కాయలో నాణ్యత లోపించడంతో వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. అనంతపురం జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలు. బిందు, తుంప సేద్య పద్ధతుల్లో పంట సాగవుతోంది. గత ప్రభుత్వం రాయితీపై బిందు సేద్య పరికరాలు అందివ్వలేదు. రైతులే సొంత ఖర్చుతో కొనుగోలు చేశారు. ఇది రైతులకు భారంగా మారింది. మరోవైపు వ్యాపారుల మాయాజాలంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతు న్నారు.

**పెట్టుబడులు దక్కని పరిస్థితి**



గత ఖరీఫ్‌లో సాగు చేసిన పంటకు రైతులు ఎకరాకు రూ.1.60 లక్షల పెట్టుబడితో బిందు సేద్య పద్ధతిలో సాగు చేసి మంచి దిగుబడి సాధించారు. జనవరి నుంచి పంట చేతికి వస్తోంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో టన్ను ధర రూ. 25 వేలు పలికింది. ప్రస్తుతం రూ.10 వేలు కూడా లేదు. ఈపరిస్థితి కర్షకులకు కన్నీరు తెప్పిస్తోంది.

**పంట తొలగింపు...**

కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన రైతు ఉమేష్ రూ.3 లక్షల పెట్టుబడితో మూడు ఎకరాల్లో అరటి సాగు చేశారు. పంట కోత దశకు వచ్చింది. ప్రస్తుతం కిలో రూ.5-8 ధర ఉండటం, దీనికి తోడు వ్యాపారులు ముందుకు రాలేదు. చివరకు తోపుడు బండ్లపై డజన్ రూ.50-60 (2-3 కిలోలు)లు విక్రయిస్తున్నారు. ఎండలకు వ్యాపారం సాగించలేక గురువారం ఎకరా అరటి తోట తొలగించానని కన్నీరుమున్నీరవుతున్నారు. మంచి ధరలు ఉంటే దాదాపు రూ.16లక్షల వరకు వచ్చేదని వాపోయారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం - ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారిణి, తాడిపత్రి**

ఎండల కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. దూర ప్రాంతాలకు తరలించేందుకు వ్యాపారులు మొగ్గుచూపడం లేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ కంపెనీలు పంట కొనుగోలు చేయడంతో ధరలు ఆశాజకనంగా ఉండేవి. ప్రస్తుతం స్థానిక మార్కెట్లకు మాత్రమే పంట తరలించే పరిస్థితి ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

# ఉపాధిలో అక్రమాల గునపం

కర్నూలు: కోడుమూరుకు చెందిన అబ్దుల్ గని దుబాయిలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు ఇక్కడ ఉపాధి జాబ్‌కార్డు ఉంది.. కూలీగా పేరు నమోదై ఉండటంతో ఆయన పేరుతో వేతనాలు మంజూ రు చేసి పక్కదారి పట్టించారు.తుగ్గలి మండలం రాతనలో రూ.3 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు జిల్లా ఉన్నతాధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నిజమేనని తేల్చిన అధికారులు రికవరీ మాత్రం చేయడం లేదు.ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడా నికి ఫొటో విధానాన్ని తీసుకొచ్చారు.. క్షేత్రస్థాయిలో కూలీల చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి.. ఇక్కడే అక్రమాలకు ఆస్కారం నెలకొంటోంది.. సిబ్బంది మార్ఫింగ్ చేసి చిత్రాలు అప్‌లోడ్ చేసి నిధులు నొక్కేస్తున్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.19 కోట్లు పక్కదారి పట్టినట్లు అధికారులు నిర్ధారించారు. వాటిలో సుమారు రూ.9 కోట్లు వసూలు చేశారు. మిగిలిన మొత్తానికి సంబంధించి ఆర్.ఆర్.చట్టం కింద రూ.3.20 కోట్లు వసూలు చేసేలా 152 కేసులు నమోదు చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని సూచించినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు దోచుకున్న మొత్తాలను వసూలు చేయడంలోనూ అంతులేని తాత్సారం జరుగుతోంది.



**మసకబారిన విజిలెన్స్ విభాగం**

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) విజిలెన్స్ విభాగ అధికారిగా ఉన్న భాస్కర్ పంచాయతీ అధికారిగా సుమారు ఐదు నెలల కిందట బదిలీ అయ్యారు. ఆదోని ఏపీడీకే డి.వి.ఒ. బాధ్యతలు అప్పగించారు. ఆయన ఆదోనిలో ఉండాల్సి వస్తుండటంతో కీలకమైన విజిలెన్స్ విభాగ విధులు నిర్వర్తించలేని దుస్థితి తలెత్తింది.

జిల్లాలో ఏటా రూ.270 కోట్లు ఉపాధి హామీ కింద వేతనాల రూపంలో చెల్లింపులు జరుగుతుండగా సామగ్రి నిమిత్తం మరో రూ.150 కోట్ల వరకు వెచ్చిస్తుంటారు. వాటిపై దృష్టి సారించాల్సిన కీలక అధికారి లేకపోవడంతో అక్రమాలకు ఆస్కారం నెలకొంది.

గత ఐదేళ్ల వైకాపా హయాంలో అక్రమాలకు అంతేలేదు. నాలుగేళ్ల కాలంలో మొత్తం 3,399 పనుల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. ఆయా పనుల్లో రూ.1.23 కోట్లు దుర్వినియోగమైనట్లు తేల్చారు.

**తుగ్గలిలో రూ.4,10,189 దుర్వినియోగం**ఉపాధి హామీ పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో రూ.4,10,189 దుర్వినియోగమైనట్లు తనిఖీ బృందం తేల్చింది. నిబంధనలు పాటించకపోవడంతో ఉపాధి సిబ్బందికి రూ.3,51,500 జరిమానా విధించినట్లు డ్వామా ఏపీడీ మాధవీలత తెలిపారు. దుర్వినియోగమైన సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు. ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో రెండు రోజులుగా జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభ ముగిసింది. ఉపాధి ఏపీడీ పక్కీరప్ప పాల్గొన్నారు.

# పట్టణవాసి దాహార్తి తీర్చేలా..!



అనకాపల్లి : గత ప్రభుత్వంలో పడకేసిన తాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పట్టాలెక్కించేందుకు కూటమి సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఓ వైపు జల్‌జీవన్ మిషన్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి నీటిని అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు పురపాలక సంఘాల్లో పట్టణవాసుల దాహార్తిని తీర్చడానికి వివిధ బ్యాంకుల రుణాలతో మెగా తాగునీటి పథకాలను నిర్మించబోతున్నారు. వచ్చే 20 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి తలసరి 135 లీటర్ల తాగునీటి సరఫరా చేయాలన్న ఉద్దేశంతో సమగ్ర రక్షిత నీటి పథకాలకు 2014-19 లోనే రూపకల్పన చేశారు. వైకాపా హయాంలో వాటి పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టిసారించి తాగునీటి ఇబ్బందులు తొలగేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**ఏఐఐబీ ప్రాజెక్టుకు మరో మూడేళ్లు పొడిగింపు..**

గతంలో ఆసియన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధుల సహకారంతో ఎలమంచిలిలో రూ.101.75 కోట్లతో మెగా తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు రెండు ప్యాకేజీలుగా గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వైకాపా సర్కారు చొరవ చూపకపోవడంతో ఎనిమిది గ్రామాల్లో రోడ్లు తవ్వి పైపులైన్లు వేసి సగంలోనే నిలిపేశారు. ఈ ఏఐఐబీ ప్రాజెక్టు గతేడాది మార్చి 31తో గడువు పూర్తయింది. కూటమి ప్రభుత్వ పెద్దలు సదరు బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడి మరో మూడు ఏళ్లు గడువు పెంచాలని ప్రతిపాదించగా ఇటీవల ఆమోదించారు. 2028 జూలై లోగా ఈ తాగునీటి పథకం పనులకు సహకరించడానికి సమ్మతించారు. త్వరలో ఈ పనులు కార్యరూపంలోకి రానున్నాయి. దీనివల్ల ఎలమంచిలి పురపాలక పరిధిలో 14 వేల ఇళ్లకు రక్షితనీరు అందనుంది.

**నర్సీపట్నంలో కొత్త అంచనాలతో..**

నర్సీపట్నంలో మొదట రూ.142.76 కోట్లు అంచనాతో గత తెదేపా ప్రభుత్వంలోనే అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు శిలాఫలకం వేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఇదే పథకానికి అంచనా విలువ పెంచి రూ.166 కోట్లతో అప్పటి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శంకుస్థాపన చేశారు. కొన్ని వార్డుల్లో రోడ్లు తవ్వి పైపులు వేసి ఆపేశారు. ఈ నిలిచిపోయిన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేలా శాసన సభాపతి అయ్యన్నపాత్రుడే మరలా బాధ్యత తీసుకున్నారు. కొత్తగా రూ.185.29 కోట్ల అంచనాతో సవివర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకుని ఈ పనులను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలని చూస్తున్నారు.

**కథనాలతో అనకాపల్లికి శుద్ధజలం..**

2019లో అగనంపూడి వద్ద ఏలేరు కాలువ నీటిని శుద్ధిచేసి అనకాపల్లి జోన్‌కు సరఫరా చేయడానికి అప్పటి సీఎం జగనే రూ.32 కోట్లతో శంకుస్థాపన చేశారు. అయిదేళ్లు గడిచినా ఈ పనులు పూర్తి చేయలేకపోయారు. పలుమార్లు కథనాలు రావడంతో కూటమి సర్కారు స్పందించింది. అసంపూర్తిగా నిలిచిన పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తిచేయించింది. ఈ వేసవిలోనే అనకాపల్లి వాసులకు శుద్ధజలం అందుబాటులోకి తీసుకురాబోతున్నారు.

# స్వర్ణ కుప్పం సాకారమిలా..!



కుప్పం : రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన కుప్పం.. ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధికి దూరంగా నిలిచింది. గతంలో తెదేపా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు వైకాపా ప్రభుత్వం రంగులేసుకుని చలామణి అయ్యింది. పురపాలిక అభివృద్ధికి రూ.66 కోట్లు, నాలుగు మండలాల అభివృద్ధికి రూ.100 కోట్లు అంటూ ముఖ్యమంత్రి హోదాలో కుప్పం పర్యటనలో జగన్‌మోహన్‌రెడ్డి వాగ్దానం ప్రచార్భాటానికే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదేళ్లు కుప్పంలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామంటూ బహిరంగ సభలో ప్రసంగించారు. ఆ మేరకు నిధులు.. అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

**700 మందికి ఉద్యోగాలు**

నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు కడా, 1ఎం1బీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించగా 700 మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. వీటితో పాటు అలీప్ పరిశ్రమ మౌఖిక ఒప్పందం, మదర్, శ్రీజ మిల్క్ డెయిరీల శంకుస్థాపనలు జరిగాయి. డిజిటల్ ఎడ్యుకేషన్ కోసం ఫొంటీర్ మార్కెట్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటి వరకు కడా ఎనిమిది పరిశ్రమలతో మౌఖిక ఒప్పందం చేసుకుంది.

**పది సూత్రాలతో సాగేలా..**

స్వర్ణ కుప్పం విజన్-2029.. అమలుకు పది సూత్రాల అజెండాతో సాగుతున్నారు. రూ.2 వేల కోట్లకు ప్రతిపాదనలు పంపారు. రూ.200 కోట్లు మంజూరయ్యాయి.

**పర్యావరణ పరిరక్షణకు ఈ-బస్సులు**

కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శ డిపోగా మార్చేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రస్తుతం ఉన్న బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు ఓ పరిశ్రమతో ఒప్పందం చేసుకోగా, ప్రస్తుతం ఓ బస్సును కుప్పం డిపో నుంచి ఆ సంస్థకు అప్పగించారు. ఆ బస్సును ఎలక్ట్రిక్ బస్సుగా మార్చితే మిగిలిన 96 సర్వీసులను మార్చనున్నారు.

**సింగపూర్ బృందం పర్యటన:** ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలు రూపొందించేందుకు సింగపూర్ ప్రతినిధులు ఇటీవల కుప్పంలో పర్యటించారు.

లక్ష్యం సాధిస్తాం: అభివృద్ధిలో ఆదర్శంగా కుప్పాన్ని నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వానికి ప్రణాళికలు పంపాం. లక్ష్యాన్ని సాధిస్తాం. వికాస్ మర్మత్, కడా పీడీ

# దర్జాగా ఇసుక దందా!




పుట్టపర్తి : శ్రీ సత్యసాయి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని అక్రమార్కులు వ్యాపారంగా మలుచుకుని దర్జాగా ఇసుక తరలిస్తున్నారు. ఏకంగా జిల్లా నుంచి బెంగళూరుకు రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పదిహేనురోజులకోసారి జిల్లాలోని రీచ్‌లు, డంపులను అధికారులు పరిశీలించాలని కలెక్టర్ చెబుతున్నా క్షేత్రస్థాయిలో తనిఖీల్లేవు. ఫలితంగా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక రవాణా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట**

ముదిగుబ్బ మండలంలోని పీసీరేవు, తాడిమర్రి మండలంలోని సీసీరేవులో మాత్రమే తవ్వి.. డంపు చేసిన ఇసుక తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. అయితే ఐదు నెలలుగా చిత్రావతిలో అక్రమంగా యంత్రాలతో ఇసుక తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నారు. రోజుకి 80 టిప్పర్లకుపైగా రాత్రివేళల్లో బెంగళూరుకి తరలిపోతోంది. ఒక్కో టిప్పరు రూ.50 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**రాత్రీపగలు..**

పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని చిత్రావతి నది నుంచి రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఓబుళదేవరచెరువు, అమడగూరు సమీపంలో వేదావతి నది, తనకల్లు సమీపంలోని పాపాగ్ని, కదిరిలోని కూటాగుళ్ల, ముదిగుబ్బ సమీపంలోని మద్దిలేరు వాగు, రొద్దం మండలంలో పెన్నా, పరిగిలో జయమంగళి, అగళి మండలంలో సువర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిపోతోంది. ట్రాక్టరు రూ. 2వేల నుంచి రూ.3వేలు వరకు విక్రయిస్తున్నారు. ఓడీసీలో నారప్పగారిపల్లి, ఎనగలూరు, మిట్టపల్లి దగ్గర నిత్యం అక్రమ రవాణా సాగుతోంది.

**అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం**

**- రామ్మోహన్‌రావ్, మైనింగ్ ఏడీ**

నదుల నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతి ఉంది. టిప్పర్లలో తరలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులపై ప్రత్యేక నిఘాపెట్టి పట్టుకుంటాం.

# నదులు.. నిలువెల్లా గాయాలు

నెల్లిమర్ల, : జిల్లాలో ప్రధాన నీటివనరులైన చంపావతి, గోస్తనీ నదులు ఘోషిస్తున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా నిలువెల్లా గోతులు కనిపిస్తున్నాయి. దీంతో వర్షాల సమయంలో ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రస్తుతం నీరు లేకపోవడంతో గతంలో చేపట్టిన తవ్వకాలతో ఎక్కడికక్కడే భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. అయిన ప్పటికీ ఇసుకాసురులు ఆగడం లేదు. భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, ఎస్.కోట, జామి, గంట్యాడ, గజపతినగరం మండలాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

**అక్కడే ఎక్కువ..**

నెల్లిమర్ల నుంచి డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మీదుగా చంపావతి ప్రవహిస్తోంది. కొన్నిచోట్ల తవ్వకాలకు అనుమతులు లేనప్పటికీ పగలు, రాత్రి తేడా లేకుండా తరలించేస్తున్నారు. సమీపంలో విశాఖ జిల్లా ఉండడం, జాతీయ రహదారి కావడం తదితర కారణాలతో పెద్దఎత్తున తరలిపోతోంది. నదితో పాటు సమీపంలో గెడ్డలు, గోర్జులను సైతం వదలడం లేదు.

**నిబంధనలేవీ?**



నదుల వెంబడి పలు కీలకమైన వంతెనలు, ఊటబావులు, నీటి పథకాలున్నాయి. వీటికి 100 మీటర్ల దూరంలో తవ్వకాలు చేపట్టాలి. నిబంధనలను అతిక్రమిస్తూ నిషేధిత ప్రాంతాల్లోనూ తోడేస్తున్నారు. బొడ్డవర, ముషిడిపల్లి, వేములపల్లి, మధుపాడ, గోపాలపల్లి, మామిడిపల్లి, కొత్తకోట, కొట్టాం, తాండ్రంగి, విజినిగిరి, జామి, భీమసింగి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది.

**రూ.లక్షల్లో వ్యాపారం..**ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఎడ్ల బండ్ల యజమానులతో ఒప్పందం చేసుకుని, ఓ చోటుకు తరలించి, అక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రాత్రి, పగలూ తేడా లేకుండా ఈ తంతు సాగుతోంది. తనిఖీలు చేసి, తగిన చర్యలు తీసుకుంటామని నెల్లిమర్ల తహసీల్దారు సుదర్శనరావు తెలిపారు. నిషేధిత ప్రాంతాల్లో తవ్వకాలు జరగకుండా చూస్తామన్నారు. ఊటబావులు, తాగునీటి రక్షిత పథకాలకు ఇబ్బందులు తెస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం డీఈ వైకుంఠరావు హెచ్చరించారు.

# కేరాఫ్.. కాకినాడ

విజయనగరం : జేఎన్‌టీయూ కాకినాడ, జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయాల (విజయనగరం)కు చెందిన ఆచార్యులు, సిబ్బంది విషయంలో ఎవరెక్కడి వారు అన్న వ్యవహారం రెండున్నరేళ్లుగా నలుగుతోంది. స్థానికంగా నియమితులై కొందరు డిప్యుటేషన్‌పై వెళ్లారని ఇక్కడి అధికారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అనుకూలంగా నిర్ణయం వస్తోందన్న తరుణంలో ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు విస్మయానికి గురిచేస్తున్నాయి. జేఎన్‌టీయూజీలో పనిచేస్తున్న వారంతా కాకినాడ విద్యాలయం వారేనంటూ బుధవారం ప్రకటించింది. ఉపకులపతి, రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ, సిబ్బందితో సహా అందరికీ ఇది వర్తిస్తుందని పేర్కొనడంతో కలవరం రేపుతోంది. మరోవైపు ఉన్నతవిద్యాశాఖకు వివరణ ఇచ్చేందుకు విద్యాలయం అధికారులు సిద్ధమవుతున్నారు.

**నేపథ్యమిదీ..**

ఉమ్మడి జిల్లాలో ఉన్నత విద్యకున్న ఏకైక విశ్వవిద్యాలయం జేఎన్‌టీయూ. 2007లో ప్రాంగణంగా ఏర్పాటై, 2022లో విశ్వవిద్యాలయం హోదా దక్కించుకుంది. ప్రారంభంలో ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న సమయంలో ఇక్కడ 41 మంది బోధకులు ఉండేవారు. 2012లో వీరిలో 21 మంది నరసారావుపేట, కాకినాడ విద్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. తిరిగి రాలేదు. కొందరు ఐచ్ఛికం ఇచ్చి ఉండిపోయినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం స్థానికంగా 22 మంది మాత్రమే కొనసాగుతున్నారు. ఇందులో 18 మందే ఇక్కడివారు. మిగిలిన వారు కాకినాడ నుంచి వచ్చి పనిచేస్తున్నారు. అక్కడి నుంచే వీరికి జీతాలు అందుతున్నాయి. తాత్కాలిక, గంటలు ఎక్కువ కింద మరికొందరు బోధకులున్నారు. బోధనేతర సిబ్బంది కింద ఆరు పోస్టులు




మంజూరయ్యాయి. ప్రస్తుతం ముగ్గురు డిప్యుటేషన్‌పై అక్కడి నుంచి వస్తున్నారు. పొరుగుసేవల విధానంలో ఇంకొందరు నిర్వహిస్తున్నారు.

**నిధుల పరంగానే..**

జేఎన్‌టీయూ విభజన నిధుల పరంగా మాత్రమే జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. బోధకుల విషయంలో చట్టంలో ఎక్కడా పొందుపర్చలేదని, ఇక్కడ నియమితులైన వారిలో కొందరికి ఆప్షన్ ఇచ్చి డిప్యుటేషన్‌పై తీసుకెళ్లారన్నది ఇక్కడి వారి వాదన. వారిని వెనక్కి పంపించాలని స్థానిక అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ఈ ఉత్తర్వులిచ్చినట్లు తెలుస్తోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి..**

**- డి.రాజేశ్వరి, ఇన్‌ఛార్జి ఉపకులపతి, జేఎన్‌టీయూజీ**

ప్రారంభంలో 41 మంది బోధకులు ఉండడంతో విశ్వవిద్యాలయంగా మార్చారు. అనంతరం కొందరిని డిప్యుటేషన్‌పై పంపించేశారు. చట్టవిరుద్ధంగా ఈ ప్రక్రియ జరిగిందని, తిరిగి పంపించాలని ప్రిన్సిపల్ కార్యదర్శికి తెలియజేశాం. ఈ నేపథ్యంలో ఉత్తర్వులు వచ్చాయి. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నాం.

ప్రస్తుతం పనిచేస్తున్నవారు..

రెగ్యులర్ బోధకులు: 22

తాత్కాలిక: 51

కాల వేతనం: 56

నాన్‌టీచింగ్: 03

పొరుగుసేవలు: 62

ఇతర విభాగాల్లో: 100

# సంగమేశ్వరుడ్ని చూతం రారండి

నందికొట్కూరు : ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఆ ఆలయంలో సంవత్సరానికి నాలుగు నెలలు మాత్రమే పూజలు జరిగే పరిస్థితి ఉంటోంది. మిగతారోజుల్లో ఆలయమంతా నీటితో నిండిపోయి ఉండటంతో స్వామి దర్శనం ఎప్పుడు చేద్దామా..! అని భక్తులు ఎదురుచూస్తుంటారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరంలోని సంగమేశ్వరుడ్ని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తులు నమ్ముతుంటారు. తుంగ, భద్ర, క్రిష్ణ, వేణి, భీమ, మలాపహరిణి, భవనాసి అనే ఏడు నదులు కలిసే అద్భుతమైన ప్రదేశం ఇది. పురాణాల ప్రకారం గంగా నదికి కాకి రూపం వచ్చిందని, ఆ రూపం పోగొట్టుకోవడానికి సమస్త తీర్థాలతో జలకమాడుతూ సంగమంలో స్నానం చేసి హంస రూపం పొందిందనేది కథనం. పాప నివృత్తి అయినందున ఈ ప్రదేశానికి సంగమేశ్వరం అని పేరొచ్చిందంటారు.

**జులై చివరి వారంలో....**

జులై చివరి వారంలో ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి చేరింది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ ఎనిమిది నెలల తర్వాత ఆలయం పూర్తిగా కన్పించడంతో ధర్మరాజు ప్రతిష్ఠించిన వేపదారుని లింగంతో పాటు ఇక్కడి వినాయకుడు, పంచముఖ ఆంజనేయ స్వామి దేవతామూర్తులు తొలిపూజను అందుకున్నారు. పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో నిల్వ ఉన్న నీరు, బురదను శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టారు.



**200 సంవత్సరాల చరిత్ర**

ప్రస్తుతం కనిపిస్తున్న ఆలయాన్ని సుమారు 200 సంవత్సరాల కిందట స్థానిక ప్రజలు నిర్మించారు. సుమారు ఇరవై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆలయంతో పాటు, చుట్టూ ప్రాకారం నిర్మించినట్లు శిథిలాలను చూస్తే అర్థమౌతుంది. ప్రస్తుతం కనిపించే ప్రధాన ఆలయం అత్యంత సాదాసీదాగా ఉంటుంది. ముఖమండపం పూర్తిగా శిథిలమై పోగా అంతరాలయం, గర్భాలయాలు మాత్రమే దర్శనమి స్తున్నాయి. గర్భాలయంలో సంగమేశ్వరుడు పూజలందుకుంటుండగా, శివుడికి వెనుకవైపున ఎడమ భాగంలో లలితాదేవి, కుడివైపున వినాయకుడు దర్శనమిస్తారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిలో ఈ ఆలయం మునిగిపోవటం వల్ల నిత్యపూజలు జరగవు. ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే పూజలు జరుగుతాయి. ఆలయంలో నిల్వ ఉన్న నీరు, బురదను శుభ్రం చేస్తున్నారు.ఆలయం వద్దకు భక్తులు వాహనాల్లో చేరుకుంటున్నారు. మరో రెండు రోజుల్లో పూర్తిగా ఆలయంలో ఉన్న నీరు, బురద తొలిగితే సులభంగా సంగమేశ్వరుని దర్శనం చేసుకోవచ్చు.

# పింఛను పక్కా.. అవినీతి ఉండదిక

చీపురుపల్లి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో అక్రమాలను నియంత్రించేందుకు ఆధునికీకరించిన ఎల్-1 స్కానర్లను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అందించేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే వీటిని ఆయా గ్రామ సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేసింది. వచ్చే నెల నుంచి వీటి సాయంతోనే పింఛన్లు అందించనున్నారు.

**ఈ నెల వరకూ ఇలా..**

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లకు సంబంధించి వేలిముద్రలు పడని లబ్ధిదారులకు ఈ నెల వరకూ ఎల్ జీరో ఆర్డీ పరికరాల సాయంతో పంపిణీ చేసేవారు. ఇది పూర్తిస్థాయిలో ఫలితాన్ని ఇచ్చేది కాదు. లబ్ధిదారులు వేలిముద్రలు వేస్తున్నా ఇబ్బందులు తలెత్తేవి. దీనికి తోడు కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలిముద్రలు రూపొందించి పింఛన్లు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు యూఐడీఏఐ (యూనిక్ ఐడింటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా)కి వెళ్లాయి. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధునిక ఎల్-1 ఆర్డీ పరికరాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. ఆ మేరకు కూటమి ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది.



**ఏప్రిల్ నుంచి వినియోగం..**

తాజాగా అందజేసిన ఎల్-1 ఆర్డీ పరికరాలతోనే ఏప్రిల్ నుంచి పింఛను అందించనున్నారు. ఆమేరకు యూఐడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునికీకరించింది. దీంతో పాత పరికరాలు పనిచేయవని ఆ సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. జిల్లాలకు వచ్చిన పరికరాల్లో పంపిణీ చేయగా మిగిలినవి అధికారుల వద్ద ఉన్నాయి. ఏ సచివాలయంలోనైనా పరికరం పనిచేయకుంటే వాటి స్థానంలో కొత్తది ఇచ్చేలా ప్రణాళిక వేశారు. ఇప్పటికే ఏర్పాట్లు చేశాం

– రోజారాణి, కె.రామచంద్రరావు, గ్రామ సచివాలయాల బాధ్యులు, మన్యం, విజయనగరం జిల్లాలు

కొత్తగా వచ్చిన పరికరాల ద్వారానే వచ్చే నెల నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నాం. ఈ ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేశాం. ఎక్కడైనా పరికరం పనిచేయకుంటే వెంటనే కొత్తది సమకూర్చుతాం.

ఉమ్మడి జిల్లాలో పింఛనుదారుల సంఖ్య

పార్వతీపురం మన్యం : 1,39,908

విజయనగరం : 2,73,083

# నకిలీ పట్టాలతో మాయ



విశాఖపట్నం: దివ్యాంగుల కాలనీలో విలువైన స్థలాలపై కొందరు కన్నేశారు. ఒకే స్థలానికి రెండు, మూడు నకిలీ పట్టాలు సృష్టించి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారు. తాజాగా ఓ ముఠా ఈ కాలనీలోని ఖాళీ స్థలాలు రాత్రికిరాత్రే చదును చేసి అమ్మకాలకు బేరం పెడుతోంది. ప్రభుత్వం ఓ లక్ష్యంతో ఏర్పాటు చేసిన దివ్యాంగుల కాలనీలో ఇలా ఇతరులు పెత్తనం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇళ్లు నిర్మించుకున్న వారిలో అర్హులైన దివ్యాంగులు 25 శాతానికి మించి లేకపోవడం విచిత్రం.దివ్యాంగుల స్థలాలు చేతులు మారడంతో కొందరు రాజకీయ నాయకులు, పోలీసులు పాగా వేశారు. ప్రధాన రోడ్డు వెంబడి విలాసవంతమైన నివాస, భారీ వాణిజ్య సముదాయాలు నిర్మించుకుని అద్దెకిచ్చుకుంటున్నారు.

**అలా రూపొందించె.. అలా రూపొందించె..**

మధురవాడ మిధిలాపురి వుడా కాలనీ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే మార్గంలో దివ్యాంగులకు ఓ కాలనీ ఉంది. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా అర్హులైన 136 మందికి రెండు సెంట్ల చొప్పున గతంలో ప్రభుత్వం పట్టాలిచ్చింది. కాలక్రమేణా చాలా మంది దివ్యాంగులు నివాసాలు నిర్మించక పోవడంతో ఖాళీగా ఉన్న స్థలాలపై అక్రమార్కులు కన్నేశారు. తొలుత గ్రామీణ తహసీల్ధార్ కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేసిన ఓ వ్యక్తి నకిలీ పట్టాల తయారీకి తెరలేపారు. దివ్యాంగులకు ఇచ్చిన పట్టాల తరహా అవే నెంబర్లు, స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో నకిలీవి సృష్టించారు. దివ్యాంగుల కాలనీ ఎదురుగా గెడ్డ స్థలం కప్పి ఆక్రమణ

ఆరాతీశారు... వదిలేశారా?: కాలనీలో జరుగుతున్న నకిలీ పట్టాల వ్యవహారంపై ఇటీవల భీమిలి ఆర్డీఓ సంగీత్‌మాధుర్ పర్యటించి నివేదిక అందించాలని గ్రామీణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారులు కాలనీలో కొందరితో మాట్లాడి ఆక్రమణలపై ఆరా తీసి వదిలేయడంతోనే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదీ..**

తయారు చేసిన నకిలీ పట్టాలే అస్త్రాలుగా ఉపయోగిస్తూ, కాలనీలో ఖాళీ స్థలాలను లక్ష్యంగా పెట్టుకుని ఆక్రమిస్తున్నారు. నిజమైన లబ్ధిదారులను సైతం నకిలీ పట్టాలతో భయపెట్టి కాలనీలోకి అడుగు పెట్టకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కబ్జా ముఠా కొన్ని రోజులుగా ఒక్కో స్థలాన్ని చదును చేస్తూ అమ్మకాలు మొదలు పెట్టింది. రెండు సెంట్ల స్థలానికి రూ.15లక్షలకుపైగా ధర నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ స్థలాన్ని విజయసాయిరెడ్డి వెంట తిరిగే ఓ నాయకుడికి విక్రయించగా రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఓ ఎలక్ట్రీషియన్‌కు ఈ కాలనీలో 6 స్థలాలకు ఆరు విద్యుత్తు మీటర్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఇదే వార్డులోని వైకాపా నాయకులతో సదరు వ్యక్తి జతకట్టి, ఇప్పుడు అదే నాయకులతో కలిసి పార్టీ మారారు. ప్రస్తుతం కాలనీలో గెడ్డకు సమీపంలో కొండను తొలిచి 10కి పైగా స్థలాలను విక్రయించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఆరోపణలున్నాయి.

# వనరులు అపారం.. ప్రణాళికే అవసరం!



నర్సీపట్నం : పునర్విభజన తరవాత అనకాపల్లి జిల్లాలో అటవీ విస్తీర్ణం బాగా తగ్గింది. ఉన్నవి అంతరించకుండా చూడటంతో పాటు పలు ప్రభుత్వశాఖలు ప్రణాళికతో ముందుకు వెళితే హరిత అనకాపల్లి సాకారమవుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్న సమయంలో అడవులు జిల్లా విస్తీర్ణంలో 44 శాతం ఉండేవి. జిల్లాల విభజన అయ్యాక ప్రస్తుతం జిల్లా విస్తీర్ణంలో 24 శాతం మాత్రమే అడవి ఉంది. 4.29 లక్షల హెక్టార్ల విస్తీర్ణం ఉన్న అనకాపల్లి జిల్లాలో అటవీ విస్తీర్ణం 78, 372 హెక్టార్లే. మార్గదర్శకాల ప్రకారం 33 శాతం అడవులు ఉండాలి. సామాజిక అడవుల విభాగం కింద గత సీజన్‌లో జేకే పేపర్‌మిల్లు యాజమాన్యం 48 లక్షల సరుగుడు మొక్కలు రైతులకు అందజేసింది. సామాజిక అడవుల విభాగం కేవలం 16 లక్షల సరుగుడు మొక్కలు మాత్రమే అందజేసింది. ఇవన్నీ కలిపితే ఆరువేల హెక్టార్లలో మాత్రమే పచ్చదనం నింపినట్లయింది. జిల్లాలోని పరిశ్రమల్లో గ్రీన్‌బెల్టు విస్తీర్ణం పెంచడంతోపాటు వినియోగానికి రాని భూమిలో పచ్చదనం పెంచే అవకాశాలు ఉన్నాయి. గతంలో వనసంరక్షణ సమితుల ద్వారా అడవుల పెంపకంలో ప్రజల భాగస్వామ్యం ఉండేది. ఈ సమితులన్నీ గడిచిన దశాబ్దంగా నామమాత్రమయ్యాయి. తక్కువగా ఉన్న అడవుల్లోనూ వేట కారణంగా వన్యప్రాణులు తగ్గిపోతున్నాయి. జిల్లాలో అడవిపందులు, కొండగొర్రెలు, కణుజుల వేట ఆగడం లేదు. జిల్లాలో సామాజిక అటవీ (సోషల్ ఫారెస్ట్) శాఖ ఏర్పాటుచేశారు. దీనిలో నలుగురు రేంజ్, ముగ్గురు సెక్షన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం. చోడవరం. మాడుగుల,. కె. కోటపాడు మండల ప్రాంతాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచుతూ వీటిని అందిస్తున్నారు. గత ఏడాది 60 లక్షల సరుగుడు మొక్కలను రైతులకు అందజేశారు. ఏటా ఎన్‌టీపీసీ సహకారంతో 40వేల మొక్కలు అందజేస్తున్నారు. ఇలా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు మొక్కలు నాటడం... దీనిపై ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నారు. రైతుల పొలాల్లో సరుగుడు, నీలగిరి, జీడి, మామిడి, పామాయిల్ వంటి సాగుని ప్రోత్సహించాలి. నరికివేతకు గురవుతున్న ఉద్యాన పంటలను అంచనా వేసి నాటించే మొక్కలు ఎక్కువగా ఉండేలా చూడాలి. జిల్లాలో 995 ప్రాంతాల్లో చిత్తడి నేలలు ఉన్నట్టు అంచనా. వీటిని పరిశీలించి పచ్చదనం పెంచేలా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు.

నర్సీపట్నం అటవీ రేంజ్‌లోని పెడిమికొండ రక్షిత అటవీ ప్రాంతంలో 97 హెక్టార్ల జీడితోటల స్థానంలో టేకు వనాలు నాటాలని గతంలో ప్రతిపాదించినా అమలు కాలేదు. జీడితోటల వయసు ముదిరిపోయి దిగుబడి తగ్గుతోంది. ఎర్రవరంలోని 22.63 హెక్టార్లలో జీడితోటల ఆదాయం ఇప్పటికే తగ్గిపోయింది. ఆరిలోవ అడవిలో ఔషధ మొక్కల పెంపకక్షేత్రం స్థానంలో రూ. 2 కోట్ల ఖర్చుతో నగరవనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి రెండేళ్లయినా కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదు. ఎలమంచిలి సమీపంలోనూ నగర వనం ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది.

**40లక్షల మొక్కలు పెంచుతాం**

రాష్ట్రంలో ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ లక్ష్యంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు పెంచి పంపిణీ చేయాలని యోచిస్తున్నాం. ఇప్పటికే చాలా నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. రైతులు కోరుకునే రకాలతోపాటు ప్రభుత్వ శాఖల అవసరాలకు అనుగుణంగా మొక్కలు పెంచుతున్నాం. జి.లక్ష్మణ్, సామాజిక అడవుల డీఎఫ్ఓ

# అక్రమార్కుల చెరలో ఎర్రవంక



బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని గోవిందంపల్లి గ్రామ పంచాయతీలో ఎర్రవంక స్థలాన్ని ఓ భూస్వామి ఆక్రమించి తన భూమిలో కలిపేసుకున్నారు. ఆ స్థలాన్ని చదును చేసి విక్రయించేందుకు పావులు కదుపుతున్నాడు. దీని వెనక పెద్ద కథే ఉంది. అదేందో తెలుసుకుందాం.గోవిందపల్లి గ్రామం పక్కనే కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం సర్వేనంబరు 56లోని దాదాపు 10 ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించింది. దీనిపై తీసుకున్న అప్పును కల్లుగీత కార్మికులు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు భూమిని వేలం వేయగా కల్లుగీత కార్మికసంఘం నాయకుడే రూ.కోట్ల విలువైన భూమిని దక్కించుకున్నాడు.

గోవిందపల్లి గ్రామం పక్కనే అనంతపురం– అమరావతి జాతీయ రహదారి రావడంతో భూమి ధర అమాంతం పెరిగిపోయింది. ఈభూమి పక్కనే తూర్పు వైపున 60 అడుగుల విస్తీర్ణంతో ఎర్రవంక ప్రవహిస్తుంది. ఈ వంక స్థలంపై కన్నేసిన సదరు నాయకుడు దాదాపుగా 2 ఎకరాల ఎర్రవంక స్థలాన్ని తన భూమిలో కలిపేసుకున్నాడు. వంకను 5 అడుగులకు కుదించి మరో మార్గంలో దారి మళ్లించాడు.

**వైకాపా హయాంలో దౌర్జన్యకాండ**

ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ నాయకుల అండతో వంకలో దళితుల శ్మశాన వాటికను, రజకులు ఏర్పాటు చేసుకున్న దోబీఘాట్‌ను సైతం నేలమట్టం చేశాడు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దాడులు చేయడానికీ వెనుకాడలేదు.

**ఎకరా రూ.50 లక్షల విక్రయానికి బేరం**

కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 ఎకరాలు, ఎర్రవంకకు చెందిన రెండు ఎకరాల స్థలాన్ని మొత్తం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎకరా రూ.50 లక్షలకు విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దారు నాగరాజుని వివరణ కోరగా గోవిందపల్లిలో ఆక్రమణకు గురైన వంక స్థలాన్ని పరిశీలించి సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. వంకను ఆక్రమించినట్లు రుజువైతే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# హద్దులు గుర్తించి... చిక్కులు పరిష్కరించి

కర్నూలు : భూముల రీసర్వే పేరుతో గత వైకాపా ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. భూ విస్తీర్ణాల్లో తేడాలు రావడంతో కలత చెందారు. సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో పకడ్బందీగా సర్వే చేయడానికి జనవరి 20న శ్రీకారం చుట్టింది. ఇది తుది దశకు చేరింది.. రెండో విడత వచ్చే నెల 15 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. రెండో విడతలో కర్నూలు జిల్లాలో 25 మండలాల్లో 47 గ్రామాలు, నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 56 గ్రామాలను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

**దస్త్రాల స్వచ్ఛీకరణ**

ఎంపిక చేసిన గ్రామాల్లో ముందుగా భూ దస్త్రాల స్వచ్ఛీకరణ చేస్తున్నారు. తర్వాత గ్రామ సరిహద్దులు గుర్తించి 250 ఎకరాలకు ఒక బ్లాక్ ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకల వారీగా గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, రెవెన్యూ సహాయకుల ఆధ్వర్యంలో రీసర్వే చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 53 గ్రామాల్లో 2,17,964.80 ఎకరాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ సాగుతోంది. గత రెండు నెలల వ్యవధిలో ఇప్పటి



వరకు 1,52,027.37 ఎకరాల్లో జీటీ పూర్తవగా.. మరో 65,936.83 ఎకరాల్లో చేపట్టాల్సి ఉంది. ఈనెలాఖరులోగా పూర్తి చేస్తామని సర్వే అధికారులు చెబుతున్నారు.

**దగ్గర పడుతున్న గడువు**

సర్వే గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ తర్వాత 9(2) నోటీసులు జారీ చేస్తారు.రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. వచ్చే నెల 10వ తేదీనాటికి ప్రకటన జారీ చేసి చివరిగా డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డు (డీఎల్ఆర్)లో వివరాలు నమోదు చేస్తారు.

ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సరిహద్దు రాళ్లు నాటడం, భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తారు. వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**వీటిని అధిగమిస్తే**

ఎలాంటి భూ వివాదాలు లేని సర్వే నంబర్లకు రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ త్వరితగతిన పూర్తవుతోంది. విస్తీర్ణంలో తేడాలున్న భూములకు సంబంధించి రైతులతో ఉప తహసీల్దార్లు మాట్లాడాలి. ఇరువురిని ఒప్పించలేకపోతున్నారు.పాత పట్టాదారు పాసు పుస్తకాలు ఉండి.. వెబ్‌ల్యాండ్‌లో పేర్లు లేని రైతుల భూములను సర్వే చేయడం లేదని పలువురు వాపోతున్నారు.

**రోవర్ల కొరత**

ఉమ్మడి జిల్లాలో 53 మండలాల్లో 53 గ్రామాల్లో రీసర్వే ప్రారంభించారు. 200-250 ఎకరాలకు ఒక బ్లాక్ చొప్పున మొత్తం 870 బ్లాకలను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 100, నంద్యాల జిల్లాలో 62 రీసర్వే బృందాలను ఏర్పాటు చేశారు.కర్నూలు జిల్లాలో 151 రోవర్లకు 102 మాత్రమే పనిచేస్తుండగా.. నంద్యాలలో 60కి పైగా రోవర్లు వినియోగిస్తున్నారు. ఇవి తగిన సంఖ్యలో లేకపోవడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది.ఒక రోవర్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక గ్రామంలో.. అదే రోవర్ ను మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మరో గ్రామంలో వినియోగిస్తున్నారు.

# టెండర్లు సరే.. పనులు ఎన్నడో..?

పుత్తూరు : సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కుంగి నాలుగేళ్లు కావస్తున్నా పనుల్లో పురోగతి లేదు. 2021 మే 18న ఎస్ఎస్ ట్యాంకు కట్ట కుంగింది. దీని మరమ్మతులు త్వరగా చేపడతామని గత ప్రభుత్వ పాలకులు ప్రగల్భాలు పలికినా అడుగు ముందుకు పడలేదు. మరమ్మతులకు నిధులున్నా పనులు ఎప్పుడు మొదలవుతాయనేది దేవదేవుడికే ఎరుక.పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి రూ.55 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించారు. 2021 మే 18న దీని కట్ట అకస్మాత్తుగా కుంగింది. ట్యాంకు నిర్మించి పదేళ్లు గడిచినా నీరు నింపకపోవడం.. వర్షాలకు ఒకేసారి నింపడంతో 300 మీటర్ల మేర కట్ట కుంగిందని



నిపుణులు బృందం నివేదిక ఇచ్చింది. అప్పట్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.43 లక్షలతో తాత్కాలిక పనులు చేసి మమ అనిపించారు. వైకాపా హయాంలో కట్ట మరమ్మతులకు రూ.9 కోట్లకు మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక టెండర్లు పిలిచి ఖరారు చేసినా పనులు ప్రారంభం కాలేదు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రజారోగ్యశాఖ డీఈఈ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## అవమానంతో అద్దానికి దూరంగా ఆరు నెలలు!

బాలీవుడ్ నటి విద్యాబాలన్ కాస్టింగ్ కౌచ్ పై గతంలో ఎంతో ఓపెన్ గా మాట్లాడింది. ఇండస్ట్రీలో అవకాశం పేరుతో లైంగికంగా ఎలాంటి వేధింపులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నది చెప్పిన సందర్భాలెన్నో. లైంగిక వేధింపుల నుంచి తానెలా తప్పించుకుందో చెప్పింది. అలాంటి వాళ్ల విషయంలో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నది కొత్తగా ఇండస్ట్రీకి వచ్చే యువతకు సూచించింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి కాస్టింగ్ కౌచ్ పై గళం విప్పింది. ఓ సినిమా నిర్మాత నాతో దారుణంగా ప్రవర్తించాడు. నేరుగా నా దగ్గరకు వచ్చి అసభ్యంగా పిలిచాడు. ఆ అవమానం తర్వాత ఆరు నెలలు పాటు అద్దంలో ముఖం చూసుకోవడం మానేసాను. ఆ మాటల తర్వాత నాపై నేను నమ్మకం కూడా కోల్పోయాను. ఇలాంటి సంఘటనలు



ఎన్నో జరిగాయి. అదే సమయంలో బాడీ షేమింగ్ చేసేవారు. మలయాళంలో నటించే అవకాశం వచ్చింది. కానీ ఆ సినిమా ప్రారంభానికి ముందే ఆగిపోయింది. అప్పుడు నన్నతంతా దురదృష్టవంతురాలన్నారు. సినిమా ఏదో కారణంతో ఆగిపోతే అంతా నన్నే ఆడిపో సుకున్నారు. నా కారణంగా నిలిచిపోయిందన్నట్లు ప్రచారం చేసారు. ఇలాంటివి నా జీవితంలో చాలా ఉన్నాయని%-% వాపోయింది. బాలీవుడ్ పై కాస్టింగ్ కౌచ్ అరోపణలు కొత్తేం కాదు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్లు పరిశ్రమపై ఆరోపణలు చేసారు. ఐశ్వర్యారాయ్, దీపికా పదుకొణే నుంచి చాలా మంది యువ భామలు తమ అనుభవాల్ని చెప్పుకొచ్చారు. విద్యాబాలన్ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి నెలలు గడుస్తుంది. గత ఏడాది రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. కానీ కొత్త ఏడాది లో మాత్రం దర్టీ భామ ఒక్క అనౌన్స్ మెంట్ కూడా చేయలేదు.

## ఆ స్టార్ హీరోకి అందాల త్రిష జోడీ కాదా?

విశ్వ నటుడు కమల్ హాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో థగ్ లైఫ్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. నాయకుడు తర్వాత ఇద్దరు కాంబినేషన్ లో రూపొందుతున్న చిత్రమిది. ఇంతవరకూ రాజ్ కమల్ ఫిల్మ్స్ లో మణిరత్నం కూడా సినిమా చేయలేదు. దీంతో కమల్ హాసన్ ని హీరోగానే కాక నిర్మాతగాను మణి చూడాల్సిన సన్నివేశం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇందులో హీరోయిన్లగా త్రిష, అభిరామి నటిస్తున్నారు. మరి ఇందులో కమల్ కి జోడీగా నటించేది ఎవరు? అంటే ఎలాంటి సందేహం లేకుండా ఇంకెవరు? త్రిష అనుకుంటారంతా. కానీ కమల్ కి జోడీగా నటించింది త్రిష కాదు సీనియర్ నటి అభిరామి. శింభు కు జోడీగా త్రిష నటిస్తుంది. సినిమాలో ఈ రెండు పాత్రలు ఎంతో కీలకమైనవి. హీరోల పాత్రలకు ధీటుగా ఉంటాయని తెలుస్తోంది. మణిరత్నం ఎలాంటి సినిమా తీసినా? అందులో రొమాన్స్ కి ప్రాధాన్యత



ఇస్తారు. థగ్ లైఫ్ లోనూ తనదైన మార్క్ రొమాన్స్ ఉంటుందని చెబుతున్నారు. జూన్ లో చిత్రాన్నిరిలీజ్ చేయాల ని ప్లాన్ చేస్తున్నారు. కానీ ఇంతవరకూ సరైన ప్రచారం చేయలేదు. థగ్ లైఫ్ ప్రకటన తర్వాత సినిమా గురించి ఏ విషయాలు వెల్లడించలేదు.

ఆన్ సెట్స్ లో ఉన్నా పెద్దగా లీకులు రాలేదు. దీంతో యూనిట్ ప్రచారం పనులు మొదలు పెట్టింది. తొలి సింగిల్ తో ప్రచారం మొదలు పెట్టారు. ఇకపై సినిమాలో పాటలన్నీ ఒక్కొక్కటిగా రిలీజ్ కానున్నాయి. ఈసినిమాకు రెహమాన్ సంగీతం అంది స్తున్నారు. ముగ్గురు కాంబినేషన్ లో చాలా కాలం తర్వాత పడిన చిత్రమిది. దీంతో సినిమా రిలీజ్ కి ముందే మ్యూజికల్ గా సంచలనమవుతుందని అభిమానులు అంచనా వేస్తున్నారు.




## 'విశ్వంభర'కు ఇది ప్లస్సా మైనస్సా?



మెగాస్టార్ చిరంజీవి కొత్త చిత్రం 'విశ్వంభర' మొదలైనపుడు ఎంత హైప్ వచ్చిందో తెలిసిందే. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకుడు కావడం.. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' తరహా ఫాంటసీ కథ కావడం.. యువి క్రియేషన్స్ భారీ బడ్జెట్లో ఈ సినిమాను నిర్మిస్తుండడంతో మెగా ఫ్యాన్స్ ఎగ్జైట్మెంట్ మామూలుగా లేదు. చిరుకు సెకండ్ ఇన్నింగ్స్‌లో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని దీని మీద అంచనాలు ఏర్పడ్డాయి. కానీ టీజర్ రిలీజయ్యాక మొత్తం కథ మారిపోయింది. అందులో పేలవమైన విజువల్ ఎఫెక్ట్స్, విజువల్స్ చూశాక సినిమా చుట్టూ నెగెటివిటీ ముసురుకుంది. దీంతో అప్పటిదాకా రెడీ అయిన విజువల్ ఎఫెక్ట్స్ కంటెంట్ అంతా పక్కన పెట్టి కొత్తగా వర్క్ చేయాల్సి వచ్చింది.

ఈ కారణంగానే సినిమా నిరవధికంగా వాయిదా పడింది. అసలు వార్తల్లో లేకుండా పోయిన 'విశ్వంభర'ను మళ్లీ ప్రేక్షకుల దృష్టిలోకి తేవడానికి, హైప్ పెంచడానికి ప్రయత్నిస్తోంది చిత్ర బృందం. ఇందులో భాగంగానే ఇటీవల తొలి పాటను రిలీజ్ చేశారు. ఐతే అది యావరేజ్ అనిపించింది. తాజాగా ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ బడ్జెట్ గురించి మీడియాకు సమాచారం ఇచ్చారు. ఏకంగా రూ. 75 కోట్లు ఎఫెక్ట్స్ కోసమే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఐతే ఒకప్పుడు ఇలా వీఎఫెక్స్ బడ్జెట్ గురించి వెల్లడిస్తే ఆశ్చర్యపోయి దాని గురించి చర్చించుకునేవారు జనం. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. బాహుబలి, కల్కి సహా పలు భారీ చిత్రాల్లో హాలీవుడ్‌కు ఏమాత్రం తీసిపోని ఎఫెక్ట్స్ చూసేశారు ప్రేక్షకులు. పైగా 'విశ్వంభర' వీఎఫెక్స్ ఖర్చు ఈ స్థాయికి వెళ్లడం వెనుక వేరే కారణాలున్నాయనే అనుమానాలు కూడా ఉన్నాయి. ముందు రూపొందించిన వీఎఫెక్స్ కంటెంట్ అంటే పక్కన పడేసి మళ్లీ వర్క్ చేయడం వల్ల బడ్జెట్ బాగా పెరిగిందని భావిస్తున్నారు. కాబట్టే వీఎఫెక్స్ బడ్జెట్ ఇంత భారీగా అయిందంటే ప్రేక్షకుల్లో పెద్దగా ఎగ్జైట్మెంట్ కనిపించడం లేదు. కాబట్టే ఈ 75 కోట్ల వీఎఫెక్స్ బడ్జెట్ వార్త ప్లస్ అవుతుందని చెప్పలేని పరిస్థితి.

## రాజేంద్రప్రసాద్ 'షష్టిపూర్తి'.. టీజర్ టాక్ ఎలా ఉందంటే?




టాలీవుడ్ సీనియర్ నటుడు, నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ లీడ్ రోల్ లో నటించిన మూవీ షష్టిపూర్తి. పవన్ ప్రభా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో రూపేష్ అక్షయ్ సింగ్ హీరోగా నటిస్తున్నారు. మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా మ్యూజిక్ అందిస్తున్నారు. సీనియర్ నటి అర్చన మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్స్, సాంగ్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. మూవీ లవర్స్ ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదే జోష్ తో మేకర్స్ ఇప్పుడు టీజర్ ను తీసుకొచ్చారు. హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ఇళయరాజాతో రిలీజ్ చేయించగా.. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. మీ అమ్మనాన్నలకు బర్త్ డేలు, మ్యారేజ్ యానివర్సిరీలు జరిపించినా జరిపించకపోయినా.. షష్టిపూర్తి మాత్రం జరిపించండని చెబుతున్న బ్యాక్ గ్రౌండ్ డైలాగ్ తో టీజర్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత అర్చన.. ఒకతను నన్ను ప్రేమిస్తున్నాడు అని తన ఫ్రెండ్స్ తో చెప్పగా.. వారు రాజేంద్రప్రసాద్ ను ఉద్దేశించి.. రేషన్ షాప్ లో పనిచేసే అబ్బాయా అని అడుగుతారు. ఆ తర్వాత వారిద్దరికి పెళ్లి జరిగి బాబు పుడతాడు. అతడే హీరో.. కట్ చేస్తే లాయర్ గా మారుతారు. అనంతరం యాక్షన్ సీన్స్ చూపించారు. చివరలో ఒకప్పుడు నిన్ను చూసి పారిపోయిన వాళ్లు ఇప్పుడు నిన్ను పొగుడుతుంటే ఎంత ఆనందంగా ఉందో తెలుసా అంటూ రాజేంద్రప్రసాద్ చెప్పిన డైలాగ్ తో టీజర్ ఎండ్ అయింది. అయితే షష్టిపూర్తి టీజర్ బాగుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. తెలుగుతనం ఉట్టి పడేలా ఉండే సినిమాను తీస్తున్నట్లు ఉన్నారని చెబుతున్నారు. తండ్రి పాత్రలో రాజేంద్ర ప్రసాద్ జీవించేశారని చెబుతున్నారు. ఆయన లాస్ట్ డైలాగ్ మాత్రం సూపర్ అని కొనియాడుతున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. MAA AAI ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపేష్ కుమార్ చౌదరి నిర్మిస్తున్నారు. ఆయనే హీరోగా కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రభాస్ శ్రీను, చలాకీ చంటి, చక్రపాణి ఆనంద, అచ్యుత్ కుమార్, మురళీధర్ గౌడ్, అనిల్, జబర్దస్త్ రామ్, లత, శ్వేత తదితరులు నటిస్తున్నారు. కుటుంబ బంధాలు విలువలు నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం రిలీజ్ డేట్ ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.

## రష్మిక మందన్న కొత్త ప్రేమ

నేషనల్ క్రష్ రష్మిక మందన్న పాన్ ఇండియా రేంజ్‌లో వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో సూపర్ హిట్స్‌ను సొంతం చేసుకున్న రష్మిక ఇటీవల వచ్చిన సికిందర్ సినిమాతో నిరాశ పరచింది. సల్మాన్ ఖాన్ నటించిన ఆ సినిమాపై మొదటి నుంచి కూడా అంచనాలు లేవంటూ కొందరు కామెంట్ చేస్తే, ఆ సినిమా ఫ్లాప్ రష్మిక మందన్న కెరీర్ పై ఏమాత్రం ఎఫెక్ట్ చేయదని కొందరు అంటున్నారు. మొత్తానికి రష్మిక మందన్న జోరుకు సికిందర్ బ్రేక్‌లు వేసిందనే వార్తలను ఆమె ఫ్యాన్స్ ఖండిస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో మరోసారి రష్మిక తన సత్తా చాటడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్‌గా రష్మిక మందన్న ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. ఎక్కువ శాతం స్కిన్ షో ఫోటోలను ఈమె షేర్ చేస్తూ ఉంటుంది. కానీ ఈసారి మాత్రం క్యూట్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రష్మిక మందన్న చేతిలో పూలు పట్టుకుని, తలపై పూలు పెట్టుకుని భలే ముద్దుగా ఉన్నారు అనే విధంగా ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా సెలబ్రెటీలు తలలో పూలు పెట్టుకునేందుకు ఆసక్తి చూపించరు. ఏదైనా సినిమా



షూటింగ్ సమయంలో పూలు పెట్టుకుంటారేమో తప్ప ప్రత్యేకంగా హాజరు అయిన కార్యక్రమాలకు పూలు పెట్టుకుని కనిపించడం, ఫోటో షూట్స్ కోసం పూలు పెట్టుకోవడం జరగదు. రష్మిక మందన్న తాజాగా పూల గురించి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పందించింది. మీరు చివరి సారి ఎప్పుడు పూలను కొనుగోలు చేశారు, నిన్ను నువ్వు తరచుగా అభినందించుకోవడానికి మరియు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి ఒక సున్నితమైన జ్ఞాపకం పూలు.. ఎందుకంటే ప్రపంచంలోని ప్రేమ మరియు దయ అంతా పూలకు అర్థాం అంటూ పూలపై తన ప్రేమను కనబర్చింది. రష్మిక కొత్తగా పూలపై తన ప్రేమను కనబర్చడం విడ్డూరంగా ఉందంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉంటే, స్వచ్ఛమైన ఆడవారికి పూలు అంటే చాలా ఇష్టం ఉంటుంది. అంతే కాకుండా అమ్మాయిలు అబ్బాయిల కంటే ఎక్కువగా పూలను ఇష్టపడుతారు అంటారు. రష్మిక కి సైతం పూలపై ప్రత్యేక ప్రేమ ఉందని దీంతో అర్థం చేసుకోవచ్చు. సికిందర్ సినిమా తర్వాత ఈ అమ్మడు కాస్త గ్యాప్ తీసుకుని ది గర్ల్ ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రష్మిక ఓకే చెప్పాలే కానీ ఏడాదిలో నాలుగు అయిదు సినిమాలు ఆమె నుంచి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ రష్మిక మాత్రం చాలా కండీషన్స్ పెడుతూ సినిమాలకు కమిట్ అవుతుంది. కనుక కాస్త తక్కువ సినిమాలు వచ్చినప్పటికీ క్వాలిటీ సినిమాలు వస్తున్నాయని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈమె హిందీలో ప్రస్తుతం రెండు పెద్ద సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతోంది. మరో వైపు యానిమల్ పార్క్‌లోనూ ఈమె నటించే అవకాశాలు ఉన్నాయి.

## ఎల్లే కవర్‌పై చిల్లింగ్ పూజా

తమిళ స్టార్ హీరో సూర్య సరసన రెట్రో చిత్రంలో నటించింది పూజా హెగ్డే. కొంత గ్యాప్ తర్వాత ఈ భామ సౌత్ లోకి తిరిగి ఎంట్రీ ఇస్తోంది. రెట్రో మే 1న థియేటర్లలోకి విడుదల కానుంది. తదుపరి దళపతి విజయ్ సరసన జననాయగన్ అనే చిత్రంలోను పూజా నటించనుంది. ఇలాంటి సమయంలో పూజా తన అభిమానులను అస్సలు విస్మరించడం లేదు. వారికి కావాల్సిన ట్రీట్ ని ఇస్తూ పండగ వాతావరణం తెస్తోంది. లేటెస్ట్ ఎల్లే కవర్ షూట్ లో పూజా రకరకాల డిజైనర్ దుస్తుల్లో ఇంటర్నెట్ లో దుమ్ము దులిపేస్తోంది. కవర్ పేజీ కోసం పూజా చెలరేగి గ్లామర్ ని ప్రదర్శించింది. ఎంపిక చేసుకున్న డిజైనర్ దుస్తుల్లో ట్రెడిషన్ మిస్ కాకుండానే, అందంగా తనలోని పాజిటివ్ ఎలిమెంట్స్ ని మరింత స్టైల్ గా ప్రదర్శించింది. అది రాజస్తానీ కళంకార్ డిజైన్ అయినా లేదా జైపూర్ సాంప్రదాయ




డిజైన్ అయినా.. పూజా టోన్డ్ లుక్ ని థై సొగసుల్ని ఎలివేట్ చేస్తూ, రూపొందించిన ఈ డిజైనర్ లుక్ ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. పూజా ఎంపిక చేసుకున్న రకరకాల డిజైనర్ దుస్తుల్లో బ్లాక్ కలర్ డిజైనర్ ఫ్రాక్ ఎంతో స్పెషల్ గా ఆకట్టుకుంది.

ఓవరాల్ గా ఎల్లే ఫోటోషూట్ ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ అవుతోంది. టాలీవుడ్ లో అల వైకుంఠపురములో లాంటి క్లాసిక్ హిట్ చిత్రంలో నటించిన పూజా హెగ్డే చరణ్ సరసన ఆచార్య మూవీలో నటించింది. ఆ తర్వాత పరిశ్రమకు దూరమైంది. మహేష్, చరణ్ లాంటి స్టార్ల సరసన మళ్లీ నటిస్తుందని భావించినా కానీ ఎందుకనో ఈ బ్యూటీకి అవకాశాలు కనుమరుగయ్యాయి. పూజా మళ్లీ ఎప్పటికి రీఎంట్రీ ఇస్తుందో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536